RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in




హైదరాబాద్ 11 జూలై 2026 శనివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:37

# ఖమ్మం జిల్లా నాకు గుండెకాయ లాంటిది

**ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురంలో**

**రైతు ఆశీర్వాద సభ**

**ముఖ్య అతిథిగా హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**శాసనమండలి చైర్మన్, స్పీకర్,**

**పలువురు మంత్రులు ఎమ్మెల్యేలు హాజరు**



మిగతా 2లో

**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూలై10 ప్రజాబలం:**ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురంలో శుక్రవారం రైతు ఆశీర్వాద సభ ఘనంగా నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరై రైతు భరోసా నిధులు విడుదల చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ

రాజకీయంగా పాలమూరు నాకు ప్రాణమైతే.. ఖమ్మం జిల్లా గుండెకాయ లాంటిది

2023 జూలై లో పొంగులేటి చేరిక సందర్భంగా ఖమ్మం జిల్లా ప్రజలు ఉప్పెనలా వచ్చి బీఆరెస్ ను బొంద పెట్టారు. సరిగ్గా ఇప్పుడు అదే జూలై లో బీఆరెస్ ను మళ్లీ మొలకెత్తనివ్వమని చింతకాని సభకు వేలాదిగా తరలి వచ్చిన మీకు అభినందనలు.

2023 లో ప్రభుత్వ ఏర్పాటు నుంచి ప్రతీ ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వాన్ని గెలిపించి... పాపాల భైరవున్ని ఫామ్ హౌస్ లోనే బందీ చేశారు. జరగబోయే కురుక్షేత్రంలో కౌరవ కల్వకుంట్ల కుటుంబాన్ని రాజకీయ ముఖచిత్రం నుంచి పాతాళానికి తొక్కే వరకు కాంగ్రెస్ కార్యకర్తలు విశ్రమించరు.

వచ్చే సాధారణ ఎన్నికలు 2028 డిసెంబరులో జరగవు

2029 మే లేదా జూన్ మాసంలో జరుగుతాయి

తెలంగాణలో 17 పార్లమెంట్ స్థానాలు 26 కు పెరుగుతాయి,

119 అసెంబ్లీ స్థానాలు 182 కు పెరుగుతాయి.

36 నెలల ముందుగానే వచ్చే ఎన్నికల ఫలితాల జోస్యం చెబుతున్నా..182 అసెంబ్లీ స్థానాల్లో 117 సీట్లు గెలిచి రెండోసారి కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది ,భద్రాచలం రాములవారి మీద ఆన... ఇది ఖమ్మం కాంగ్రెస్ కార్యకర్తల మాట అని రాస్కో చంద్ర శేఖర్ రావు... నీ దొంగ సర్వేలు చేసే దొంగ ఏజెన్సీలు గుర్తు పెట్టుకోండి, ఈ మాట కోసం రోజుకు 18 గంటలు పనిచేస్తాం,

ప్రతీ సందర్భంలో ప్రజా ప్రభుత్వం రైతులను ఆదుకుంటోంది,

ఒకరిపై ఒకరికి నమ్మకం లేదు.. ఒకే ఇంట్లో రెండు గుంపులు,ఒకరిపై ఒకరు పోటీగా ఒకాయన కన్నెపల్లికి పోయి పంపులు ఆన్ చేయాలంటాడు ,ఒకసారి మేడిగడ్డ కుంగితేనే ఇంత నష్టం జరిగింది... మళ్లీ నీళ్లు నింపితే భద్రాచలం రాముడు మునుగుతాడు ,

## నాగార్జునసాగర్, శ్రీశైలం, జూరాల వంటి ప్రాజెక్టులతో సాగునీరు అందించిన కాంగ్రెస్ పార్టీయే

## భట్టి విక్రమార్క



నా గుండె చప్పుడు, నా సొంత నియోజకవర్గం మధిర ప్రజల మధ్య జరిగిన 'రైతు ఆశీర్వాద సభ'ను ఆశీర్వదించిన ప్రజలందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు.నా ఆహ్వానాన్ని మన్నించి మన గడ్డపైకి విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు.

మన చింతకాని గడ్డపై నుంచే రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేయడం, నూతన ఈ-పట్టాదార్ పాస్‌బుక్‌లు పంపిణీ చేయడం ఎంతో తృప్తినిచ్చింది. గత ప్రభుత్వ హయాంలో పెట్టుబడి సాయం కోసం నెలల తరబడి ఎదురుచూసిన రైతన్నలకు.. మన 'ప్రజా ప్రభుత్వం' కేవలం 9 రోజుల్లోనే రూ.9,000 కోట్లు జమ చేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకుంది.నాగార్జునసాగర్, శ్రీశైలం, జూరాల వంటి ప్రాజెక్టులతో సాగునీరు అందించిన కాంగ్రెస్ పార్టీయే.. నేడు రైతు రుణమాఫీ, ఉచిత విద్యుత్, పంట నష్టపరిహారంతో రైతును రాజుగా నిలబెడుతోంది. అలాగే, మహిళలను మహాలక్ష్ములుగా గౌరవిస్తూ, ఉచిత బస్సు ప్రయాణం, వడ్డీ లేని రుణాలతో వారి ఆర్థిక సాధికారతకు పెద్దపీట వేస్తోంది.మన లక్ష్యం ఒక్కటే.. మౌలిక సదుపాయాలు, వ్యవసాయం, పారిశ్రామిక వృద్ధి, పారదర్శక పాలనతో 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ప్రపంచంతో పోటీపడేలా తీర్చిదిద్దడం.నా మధిర ప్రజల ఆశీర్వాదమే నా బలం. మీ బిడ్డగా నాపై మీరు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయను. నా చివరి శ్వాస వరకు మీ అభివృద్ధికి, రాష్ట్ర సమగ్ర వికాసానికి అహర్నిశలు శ్రమిస్తూనే ఉంటాను..

## సీతారామ ప్రాజెక్టుతో వేల ఎకరాలకు నీరు.

## రైతు ఆశీర్వాద సభలో మంత్రి తుమ్మల.

**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూలై10 ప్రజాబలం:**ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురంలో నిర్వహించిన రైతు ఆశీర్వాద సభలో తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ తెలంగాణకు సీతారామ ప్రాజెక్ట్ ఊపిరి లాంటిదని సీతారామ ప్రాజెక్టు ద్వారా వేల ఎకరాలకు నీరు అందుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు. భారతదేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణలో రైతు భరోసాతో నిధులు విడుదల చేసి భారతదేశంలోని అన్ని రాష్ట్రాలకు దిక్సూచిగా నిలిచిందని, రైతు రుణమాఫీ వడ్ల బోనస్ తదితర కార్యక్రమాలలో తెలంగాణ ముందంజలో ఉందని తెలిపారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా జొన్నలు కొన్ని ఏకైక రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని, సీతారామ ప్రాజెక్ట్ ద్వారా నీళ్లు వైరా చెరువుకు కలిపి రైతులకు నీరు అందించే విధంగా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. రానున్న కొద్ది రోజులలో కూడా సత్తుపల్లికి సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు తీసుకొచ్చి రైతులకు నీరు అందించే విధంగా చేస్తామని తెలిపారు, నీరు లేకుండా ఏ ఒక్క ఎకరం పొలం కూడా ఎండిపోకుండా ఉండేవిధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో మాట్లాడి సీతారామ ప్రాజెక్టు నిర్మించేలా చర్యలు తీసుకున్నామని, తెలంగాణ ప్రభుత్వం రైతులందరికీ ఎల్లప్పుడు సాయ సహకారాలు అందిస్తూ రైతుల కోసం పనిచేస్తుందని తెలిపారు. తెలంగాణలో అన్ని పంటలను ప్రోత్సహిస్తూ పొద్దు తిరుగుడు పామాయిల్ తదితర పంటలకు సబ్సిడీ అందిస్తూ రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తున్నామని బ్యాంకుల్లో రైతులకు తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తూ రైతు ఉపాధి కోసమే తెలంగాణ ప్రభుత్వం పని చేస్తుందని ఈ సందర్భంగా తెలియజేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వమని రైతులకు అన్నివేళల అండగా ఉంటూ రైతు ఎదుగుదల కోసమే పనిచేస్తుందని తెలంగాణ రైతు రాజ్యం రైతు బాగుంటే దేశం బాగుంటుంది అని తెలిపారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం వానకాలం రైతు భరోసా నిధులను కేవలం 9 రోజులలో 9 వేల కోట్ల మేర రైతు ఖాతాలో జమ చేసిందని మధిర నియోజకవర్గంలోని జీలుగుమాడు గ్రామంలో పైలట్ ప్రాజెక్టు కింద చేపట్టిన సమగ్ర భూ సర్వేలో భాగంగా 476 మంది రైతులకు భూధర్ కార్డులను రైతు ఆశీర్వాద సభ వేదికగా అందజేశామని, మొక్కజొన్న రైతులకు 3504 కోట్ల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు.

# మెడికల్ ఎక్విప్‌మెంట్ కొనుగోళ్లకు కొత్త విధానం

**పారదర్శకతకు ప్రాధాన్యత**

**ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను**

**ఆదేశించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ**

ప్రభుత్వ హాస్పిటళ్లకు క్వాలిటీ మెడికల్ ఎక్విప్‌మెంట్‌ను వేగంగా, పారదర్శకంగా అందించేందుకు ప్రొక్యూర్‌మెంట్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ టీజీఎంఎస్ఐడీసీ అధికారులను ఆదేశించారు. కోటిలోని టీజీఎంఎస్ఐడీసీ ఆఫీసులో శుక్రవారం నిర్వహించిన రివ్యూ మీటింగ్‌లో మెడికల్ ఎక్విప్‌మెంట్ ప్రొక్యూర్‌మెంట్, టెండర్ ప్రాసెస్, ఎక్విప్‌మెంట్ వర్కింగ్ స్టేటస్, మెయింటెనెన్స్ తదితర అంశాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు.

ప్రభుత్వ హాస్పిటళ్లలో ఏర్పాటు చేసే ప్రతి మెడికల్ ఎక్విప్‌మెంట్ క్వాలిటీదిగా ఉండటంతో పాటు నిర్ణీత సమయంలో అందుబాటులోకి రావాలని మంత్రి స్పష్టం చేశారు. పారదర్శక, డిజిటలైజేషన్‌కు ప్రాధాన్యతను ఇస్తూ నూతన విధానానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో అన్ని కొనుగోళ్లు ఒకే విధమైన ప్రామాణిక విధానాల ప్రకారం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రొక్యూర్‌మెంట్ ప్రక్రియను పూర్తిగా డిజిటలైజ్ చేయాలని మంత్రి ఆదేశించారు. కొనుగోళ్ల కోసం ఎండ్-టు-ఎండ్ డిజిటల్ టూల్‌ను త్వరితగతిన అమల్లోకి తీసుకువచ్చి, ఇండెంట్ నుంచి హాస్పిటల్‌లో ఇన్‌స్టాలేషన్ వరకు ప్రతి దశను ఆన్‌లైన్‌లో ట్రాక్ చేసే విధంగా వ్యవస్థను రూపొందించాలని సూచించారు. దీంతో ప్రొక్యూర్‌మెంట్ ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం, సామర్థ్యం మరింత పెరుగుతాయని పేర్కొన్నారు.



హాస్పిటళ్లలో ఏర్పాటు చేసిన మెడికల్ ఎక్విప్‌మెంట్ నిరంతరం పనిచేసేలా పటిష్టమైన మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ హాస్పిటళ్లలోని ఎక్విప్‌మెంట్ పనితీరును పర్యవేక్షించేందుకు సెంట్రలైజ్డ్ డ్యాష్‌బోర్డ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి పదిహేను రోజులకు ఒకసారి ఈ డ్యాష్‌బోర్డ్‌ను సీనియర్ మేనేజ్‌మెంట్ స్థాయిలో సమీక్షించి వెంటనే అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రస్తుతం అమలులో ఉన్న సీఏఎంసీ (కాంప్రహెన్సివ్ యాన్యువల్ మెయింటనన్స్ కాంట్రాక్ట్) అగ్రిమెంట్లను సమీక్షించి, సర్వీస్ లెవల్ అగ్రిమెంట్స్ (ఎస్ఎల్ఏ) పాటించని వెండర్లపై కఠినమైన పెనాల్టీలు విధించేలా నిబంధనలను సవరించాలని మంత్రి సూచించారు. ఎక్విప్‌మెంట్ మెయింటెనెన్స్‌లో నిర్లక్ష్యానికి తావు లేకుండా చూడాలని స్పష్టం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ ఎక్విప్‌మెంట్ పనితీరును క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు ఎనిమిది మంది బయోమెడికల్ ఇంజినీర్లను నియమించాలని మంత్రి ఆదేశించారు. హైదరాబాద్ రీజియన్‌కు నలుగురు, ఈస్ట్, వెస్ట్, సౌత్, నార్త్ జోన్లకు ఒక్కొక్కరిని నియమించి ఎక్విప్‌మెంట్ మానిటరింగ్‌ను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో టీజీఎంఎస్ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్ గౌరవ్ ఉప్పల్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరేంద్ర కుమార్, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీంద్ర నాయక్‌తో పాటు టీజీఎంఎస్ఐడీసీలోని వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రజాబలం

11 జూలై 2026 శనివారం

# జలవివాదాలకు చెక్...

దశాబ్దాలుగా కొనసాగుతున్న అంతర్రాష్ట్ర జల వివాదాలకు కేంద్ర ప్రభుత్వం పరిష్కార మార్గం చూపుతోంది. యమునా, నర్మదా, సోన్, కృష్ణా జలాల పంపిణీపై రాష్ట్రాల మధ్య అలాగే, కావేరి వివాదంపై కూడా చర్చలు కొనసాగుతున్నాయి. ఈ చర్యలతో సాగునీటి ప్రాజెక్టులు వేగవంతం కావడంతో పాటు రైతులకు నీటి భద్రత, ప్రజలకు తాగునీటి సౌకర్యం మెరుగుపడనుంది. కేంద్ర ప్రభుత్వం చొరవతో 'నీటి యుద్ధాలు' ఆగి, సాగునీటి ప్రాజెక్టులు వేగవంతం కాబోతున్నాయి. అపారమైన జల వనరులున్నా.. కేవలం వివాదాల వల్ల ఆగిపోయిన ప్రాజెక్టులకు ఈ ఒప్పందాలు కొత్త ఊపిరి పోస్తున్నాయి. దేశ అభివృద్ధిని కుంటుపరుస్తున్న కీలక అంశాల్లో అంతర్రాష్ట్ర జల వివాదాలు ఒకటి. దశాబ్దాల పాటు సాగిన న్యాయ పోరాటాల వల్ల రైతులు, సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే ప్రధాని మోదీ సూచనల మేరకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ రంగంలోకి దిగి రాష్ట్రాల ముఖ్యమంత్రులతో చర్చలు జరపడంతో పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం దొరుకుతోంది.యమునా జలాల ఒప్పందం : దాదాపు 30 ఏళ్ల నాటి హరియాణా–రాజస్థాన్ యమునా జల వివాదం పరిష్కారమైంది. ఈ ఒప్పందంతో రాజస్థాన్‌లోని షెకావతి, హరియాణా సరిహద్దు ప్రాంతాలకు అదనపు నీటి లబ్ధి చేకూరుతుంది.నర్మదా ప్రాజెక్టుల పరిష్కారం : గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాల మధ్య సర్దార్ సరోవర్, ఇందిరా సాగర్ ప్రాజెక్టుల పునరావాసం, ఆర్థిక అంశాలపై 'వన్–టైమ్ సెటిల్‌మెంట్' పూర్తయింది.కిషౌ బహుళార్థసాధక ప్రాజెక్టు హిమాచల్ ప్రదేశ్, ఢిల్లీ, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, హరియాణా రాష్ట్రాల మధ్య కీలక భేటీ జరగనుంది. టోన్స్ నదిపై కిషౌ ఆనకట్ట నిర్మాణంతో లక్షలాది మందికి తాగునీరు, విద్యుత్ అందుబాటులోకి రానున్నాయి. బీహార్, జార్ఖండ్ మధ్య సోన్ నది జలాల పంపిణీకి అంగీకారం కుదిరింది. ఒప్పందం ప్రకారం.. నీటిలో జార్ఖండ్‌కు 2 ఓంఈ, బీహార్‌కు 5.75 ఓంఈ నీరు లభిస్తుంది. దీనివల్ల ఇంద్రపురి జలాశయ ప్రాజెక్టు మార్గం సుగమమైంది.కృష్ణా జలాలు: కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీపై కూడా సానుకూల సంకేతాలు వెలువడుతున్నాయి. ఈ మధ్యనే కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులను కేంద్రం ఒక వేదికపైకి తీసుకొచ్చింది.తమిళనాడు, కర్ణాటక మధ్య దశాబ్దాలుగా రగులుతున్న 'కావేరి జల వివాదం' ఇప్పటికీ అత్యంత సున్నితంగా ఉంది. అయితే, ఈ అంశాన్ని కూడా చర్చల ద్వారా పరిష్కరించేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. ఇరు రాష్ట్రాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, శాస్త్రీయమైన పరిష్కారాన్ని కనుగొనేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. కేంద్రం చెబుతున్న లెక్కల ప్రకారం.. ఈ పరిష్కారాల వల్ల ప్రత్యక్షంగా రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు, రాష్ట్రాలకు విద్యుత్ అందుతాయి. రాష్ట్రాల మధ్య జలవివాదాలకు శాశ్వత పరిష్కారం చూపించే దిశగా కీలక అడుగులు పడుతున్నాయి. ఇప్పటిదాకా ఒకటిగా ఉన్న గోదావరి–కావేరీ అనుసంధాన ప్రాజెక్టును రెండు భాగాలుగా చేపట్టాలని కేంద్రం ప్రతిపాదించింది. అందులో ఒక భాగం సమ్మక్క సాగర్ నుంచి నాగార్జున సాగర్ దాకా కాగా.. రెండోది పోలవరం నుంచి చేపట్టేది. ఈ ప్రక్రియలో భాగంగా రెండు కీలక అడుగులు పడే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఒకటి.. 88 టీఎంసీలతో తెలంగాణ చేపట్టిన పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి ఏపీ అంగీకారం తెలపాలి. దానికి బదులుగా 167 టీఎంసీలతో పోలవరం నుంచి గోదావరి–కావేరీ అనుసంధానానికి తెలంగాణ సమ్మతి తెలియజేయాలని కేంద్రం షరతు పెట్టింది. ఇందుకు రెండు రాష్ట్రాలూ సూత్రప్రాయ ఆమోదం తెలిపినట్లు సమాచారం. ఇవి కార్యరూపం దాల్చితే తెలుగు రాష్ట్రాలకు జల వివాదాల విషయంలో శాశ్వతంగా మేలు జరుగుతుందనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతుంది. ప్రస్తుతం పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం డీపీఆర్ కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) వద్ద పెండింగ్‌లో ఉంది. 90 టీఎంసీలతో డీపీఆర్ సమర్పించగా.. నీటి కేటాయింపులపై సీడబ్ల్యూసీ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఈ 90 టీఎంసీల్లో 45 టీఎంసీలు పోలవరం నుంచి వచ్చే వాటా కాగా.. మరో 45 టీఎంసీలు తెలంగాణలో మైనర్ ఇరిగేషన్‌లో చేసిన పొదుపు ఖాతాలోనివి. ఈ పథకానికి అనుమతివ్వాలని రాష్ట్ర ప్రభుత్వం చాలాకాలంగా విజ్ఞప్తి చేస్తున్న సంగతి తెలిసిందే. సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ ఇటీవలే కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసి.. జలవివాదాల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరారు. తెలంగాణ విజ్ఞప్తితోనే పాలమూరు–రంగారెడ్డికి ఆమోదం తెలుపాలని ఏపీ సీఎం చంద్రబాబును సీఆర్ పాటిల్ ప్రత్యేకంగా కోరారు. పాలమూరుకు ఆమోదం తెలుపడానికి చంద్రబాబు అంగీకారం వ్యక్తం చేశారని.. అదే సమయంలో పోలవరం నుంచి గోదావరి–కావేరీ అనుసంధానానికి తెలంగాణ సమ్మతి తెలిపేలా చూడాలని ఆయన కోరారని తెలుస్తోంది. పోలవరం ప్రాజెక్టుకు అనుమతి లభిస్తే కృష్ణా డెల్టాకు తరలించే 80 టీఎంసీలకు బదులుగా సాగర్ ఎగువన ఉన్న రాష్ట్రాలు 80 టీఎంసీలు వాడుకోవాలని బచావత్ ట్రైబ్యునల్ తీర్పు ఉంది.ఆ తీర్పు మేరకు దక్కే 45 టీఎంసీలతో పాటు గోదావరి–కావేరి అనుసంధానంలో తెలంగాణకు వాటాగా ఇవ్వదలుచుకున్న 43 టీఎంసీలు కలుపుకొని 88 టీఎంసీలతో పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు ఏపీ ఆమోదం తెలపాలి. అలాగే, సమ్మక్కసాగర్‌లో తెలంగాణ తన వాటా 47 టీఎంసీలు వదులుకోవాలి. గోదావరి–కావేరీ అనుసంధానంలో ఏపీ వాటాగా లభించే 45 టీఎంసీలు, కర్ణాటక వాటా 16 టీఎంసీలు(దీనికి బదులుగా బెడ్తి– హీరేవడ్డెటి లింక్ కింద 16టీఎంసీలు కర్ణాటకకు ఇవ్వడం), గోదావరిలో ఏ రాష్ట్రమూ వినియోగించుకొని వాటా కింద 15 టీఎంసీలు, జీసీ లింక్‌లో తమిళనాడు వాటా 44 టీఎంసీలు కలుపుకొని 167 టీఎంసీలతో పోలవరం నుంచి గోదావరి–కావేరి అనుసంధానం చేపట్టడానికి తెలంగాణ గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలి.

నీటి లభ్యత ఉన్నచోటి నుంచి జలాలు తీసుకెళ్లి కరువు పీడిత ప్రాంతాలకు నీటిని అందించాలనే లక్ష్యంతో 1980లో నేషనల్ పర్ స్పెక్టివ్ ప్లాన్‌లో భాగంగా హిమాయలన్ కాంపోనెంట్ నుంచి పెనిన్సులర్ కాంపోనెంట్‌కు నీటిని తరలించే ప్రతిపాదన వచ్చింది. ఇదే క్రమంలో మహానది(ఒడిశా)–గోదావరి అనుసంధానం కూడా తెరమీదికి తెచ్చారు. ఈ పథకంలో కాటన్ బ్యారేజీ(ధవళేశ్వరం) ఎగువన 230 టీఎంసీలు తెచ్చి వేయాలనేది ప్రతిపాదన. ఇదే క్రమంలో గోదావరిలో 500 టీఎంసీల మిగులు జలాలకు సంబంధించి.. ఇచ్చంపల్లి నుంచి నాగార్జున సాగర్‌తో పాటు మరో నాలుగు అనుసంధాన ప్రతిపాదనలు తెరమీదికి వచ్చాయి. 2014లో రాష్ట్ర అవతవరణ అనంతరం తెలుగు రాష్ట్రాలు గోదావరిలో ఒక్క చుక్కకూడా మిగులు జలాలు లేవని వాదించడంతో ఈ ప్రతిపాదనలన్నీ పక్కనపెట్టారు. ఆ తర్వాత గోదావరిలో ఛత్తీస్‌గఢ్ మరో 50 ఏళ్లయినా వాడుకోని వాటా(148 టీఎంసీల)తో గోదావరి–కావేరీ అనుసంధానం తొలిదశను ప్రతిపాదించారు.

# ఖమ్మం జిల్లా నాకు గుండెకాయ లాంటిది



మొదటి పేజీ తరువాయి

ఖమ్మం జిల్లాలో 44 ఊర్లు కొట్టుకుపోయాయి దుర్మార్గుడా

నీ దుష్ట రాజకీయాల కోసం మేడిగడ్డ నింపాలా అని అడిగితే సమాధానం లేదు రేవంత్ రెడ్డి సర్వేలో కాంగ్రెస్ ఓడిపోతుందని దుష్ప్రచారానికి దిగారు .ఎన్నికలు ఎప్పుడో తెలియకుండా, రిజర్వేషన్లు ఎలా మారుతాయో తెలియకుండా ఎవరైనా సర్వేలు చేస్తారా.. గెలుపు ఓటములు నిర్ణయిస్తారా?

జూబ్లీహిల్స్ లో ఇలాగే చెబితే జనం బీఆరెస్ ను బండకేసి కొట్టారు .బ్యాడుమేళం బ్యాచ్ లా బీఆరెస్ సర్వేల బ్యాచ్ తయారైంది,

బీజేపీ లోకి వెళ్ళనని హరీష్ రావును కెసీఆర్ పై ఒట్టేసి చెప్పమను, నువ్వు ఎక్కడుంటావో తెలియదు.. మీ బావ ఎటు పోతాడో తెలియదు,బీఆరెస్ ను బీజేపీ లో విలీనం చేస్తారని నీ సొంత చెల్లెలే చెబుతోంది,

ఆంధ్ర కాంట్రాక్టర్లు బీఆరెస్ కి వందల కోట్లు ఇచ్చారని నీ సొంత చెల్లే చెప్పింది ,

బీఆరెస్ అమలు చేసిన షాది ముబారక్, రైతు బందు పథకాలను మేం కొనసాగించడం లేదా? ప్రతీ పేదవాడికి రేషన్ కార్డు, సన్న బియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చాం, రైతు భరోసా 12 వేలకు పెంచాం, రైతు రుణమాఫీ చేసి రుణవిముక్తులను చేశాం, రాబోయే ఎన్నికల్లో తెలంగాణ నుంచి 26 పార్లమెంట్ స్థానాలకు 20 పార్లమెంట్ స్థానాలు గెలిపిద్దాం, రాహుల్ గాంధీని ప్రధాని చేసుకుందాం, భట్టి కోరికమేరకు మధిరకు ఇంజనీరింగ్ కాలేజ్ మంజూరు చేస్తాం అని తెలిపారు. అనంతరం పలువురు మంత్రులు రైతు యొక్క ఆశీర్వాద సభ గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలోఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వాకిటి శ్రీహరి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, రామసాయం రఘురాం రెడ్డి, బలరాం నాయక్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు నాయకులు మహిళలు పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రజల ఆధ్యాత్మిక, సాంస్కృతిక అస్తిత్వాన్ని చాటిచెప్పే బోనాల జాతర

**ఉజ్జయిని శ్రీ మహంకాళి అమ్మవారి ఆషాడ బోనాల జాతరను భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా అత్యంత వైభవంగా నిర్వహించాలి**

**లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు సేవలు అందించడంలో సంబంధిత విభాగాలన్నీ సహనంతో, సంయమనంతో వ్యవహరించాలి**

**పిల్లలు, బాలింతలు, గర్భిణులు, వృద్ధులు, దివ్యాంగుల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి**

**బోనాలు సమర్పించేందుకు తరలివచ్చే శివసత్తులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయాలి**

**విఐపి, వివిఐపిలకు దర్శనం కల్పించడంలో గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని మెరుగైన కార్యాచరణను అమలు చేయండి**

**సీఎం రేవంత్ రెడ్డిఈ యేడాది బోనాల నిర్వహణకు రూ. 20 కోట్లు కేటాయించడం హర్షణీయం**

**సీఎం గారి సూచనలకు అనుగుణంగా ఈ యేడాది బోనాల ఉత్సవాలను దేదీప్యమానంగా నిర్వహించాలి**



సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల ఉత్సవాల సన్నాహక సమావేశంలో అధికారులకు ఆదేశాలు జారీచేసిన దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు శ్రీమతి కొండా సురేఖ

తెలంగాణ ప్రజల ఆధ్యాత్మిక, సాంస్కృతిక అస్తిత్వాన్ని చాటిచెప్పే బోనాల జాతర రాష్ట్ర ప్రత్యేకతను ప్రపంచానికి చాటి చెప్తున్నదని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు శ్రీమతి కొండా సురేఖ అన్నారు. తెలంగాణ ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా నిలిచిన సికింద్రాబాద్ ఉజ్జయిని శ్రీ మహంకాళి అమ్మవారి ఆషాఢ బోనాల జాతరను భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అత్యంత ఘనంగా నిర్వహించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

ఈ రోజు సికింద్రాబాద్ లోని ఉజ్జయిని శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానంలో ఆషాఢ బోనాల జాతర ఏర్పాట్లపై దేవాదాయశాఖతో పాటు సంబంధిత శాఖల అధికారులతో మంత్రి సురేఖ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, ఇతర శాఖల అధికారులు జాతర ఏర్పాట్లపై మంత్రి సురేఖ కి వివరించగా, మంత్రి సురేఖ వారికి సలహాలు, సూచనలు చేశారు.

ఈ కార్యక్రమంలో సనత్ నగర్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్ రెడ్డి, దేవాదాయ శాఖ డైరక్టర్ హనుమంతరావు, డిసిపి (సికింద్రాబాద్ జోన్) రక్షితా కృష్ణ మూర్తి, అడిషనల్ డిసిపి (ట్రాఫిక్) రాములు, సాంస్కృతిక శాఖ డైరక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, దేవాదాయ శాఖ ఆర్జెసి రామకృష్ణారావు, డిసి వినోద్ రెడ్డి, ఎసిలు మనోహర్ రెడ్డి, శ్రీనివాస్, జిహెచ్ఎంసి, ఐ అండ్ పిఆర్, వైద్యారోగ్యశాఖ, ఆర్ అండ్ బి, పోలీస్, విద్యుత్, అగ్నిమాపక శాఖ, టిజిఆర్టిసి తదితర శాఖలకు చెందిన అధికారులు, సనత్ నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జ్ కోట నీలిమ, దేవాలయ కమిటి సభ్యులు, దక్కన్ మానవ సేవా సమితి, నల్లగుట్ట అభివృద్ధి సంఘం, మన్నూరు కాపు సంఘం, ఆర్యవైశ్య సేవా సమితిలకు చెందిన పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీకగా నిలిచిన బోనాల జాతరకు రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తారని, ఈ నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు.

బోనాల జాతర సందర్భంగా జూలై 19న ఘటం ఎదుర్కోలు, ఆగస్టు 2న బోనాల ఉత్సవాలు, ఆగస్టు 3న రంగం (భవిష్యవాణి), గజారోహణ మహోత్సవం కార్యక్రమాలను వైభవోపేతంగా నిర్వహించాలని మంత్రి సురేఖ ఆదేశించారు.

జూలై 19 న ఘటోత్సవముల ప్రారంభం నుంచి ఆగష్టు 3న రంగం కార్యక్రమం వరకు అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరాంగ తీర్చిదిద్దాలని మంత్రి సురేఖ దేవాదాయ శాఖకు సూచించారు.

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వృద్ధులు, దివ్యాంగులకు, పిల్లలు, బాలింతలు, గర్భిణులకు ప్రత్యేక క్యూ లైన్లు, ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేయాలని నిర్దేశించారు. బోనాల ఉత్సవాల్లో అమ్మవారిని దర్శించుకునేందుకు, బోనాలు సమర్పించేందుకు వచ్చే శివసత్తులకు ప్రత్యేక క్యూలైన్, సులభ దర్శనం, అవసరమైన సౌకర్యాలు కల్పించాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. గత బోనాల ఉత్సవాల్లో వారి నుంచి వచ్చిన వినతుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి సురేఖ తెలిపారు.

"ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర తెలంగాణ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసానికి, సాంస్కృతిక వైభవానికి ప్రతీక. భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన దర్శనం కల్పించడం ప్రభుత్వ బాధ్యత. అందుకు అవసరమైన అన్ని చర్యలను ప్రభుత్వం తీసుకుంటున్నది" అని మంత్రి సురేఖ పేర్కొన్నారు.

ఆలయ పరిసరాలను విద్యుత్ దీపాలతో అలంకరించి, పూలతో సుందరంగా తీర్చిదిద్దాలని, తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, పారిశుధ్య నిర్వహణ, నిరంతర విద్యుత్ సరఫరా, సీసీ కెమెరాలు, పటిష్ట పోలీసు బందోబస్తు వంటి అన్ని సౌకర్యాలను సమకూర్చాలని అధికారులకు మంత్రి స్పష్టం చేశారు. లక్షలాదిగా భక్తులు తరలివచ్చే పరిస్థితుల్లో, బోనాల సమర్పించేందుకు భక్తులు తీసుకువచ్చే దీపాల కారణంగా అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున, అగ్నిమాపక శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. అన్ని దేవాలయాల వద్ద తగిన అగ్నిమాపక పరికరాలు, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు

అదే విధంగా దేవాదాయ శాఖ భక్తులకు లడ్డూలు, వడలు, పులిహోర ప్రసాదాలను నిరంతరాయంగా అందుబాటులో ఉంచాలని, సమాచార, ప్రసార సబంధాల శాఖ జాతర ప్రచారాన్ని విస్తృతంగా చేపట్టి రాష్ట్రవ్యాప్తంగా భక్తులకు సమాచారం చేరేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. నిరంతరాయంగా లైవ్ ప్రసారాలు చేపట్టాలని, దేవాలయ పరిసరాల్లో స్క్రీన్ లు ఏర్పాట్లు చేసి ప్రత్యక్ష ప్రసారాలు చేయాలని సూచించారు. దేవాదాయ శాఖ డైరక్టర్ హనుమంత రావు మాట్లాడుతూ మంత్రి ఆదేశాల మేరకు అన్ని శాఖలు కలసికట్టుగా పనిచేసి జాతరను దిగ్విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. పోలీసుశాఖతో పాటు ఇతర శాఖలు బోనాల ఉత్సవ బాధ్యతను విధులుగా పరిగణించకుండా అమ్మవారికి సేవగా భావించి నిర్వర్తించాలని డిసిపి రక్షితా కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. సాంస్కృతిక శాఖ చేపట్టనున్న సాంస్కృతిక కార్యక్రమాలను ఆ శాఖ డైరక్టర్ వివరించారు. ఈ సందర్భంగా దక్కన్ మానవ సేవా సమితి, ఆర్యవైశ్య సంఘం తదితర సంస్థల ప్రతినిధులు చేసిన సూచనలను కార్యరూపంలోకి తీసుకురావలని మంత్రి సురేఖ అధికారులను ఆదేశించారు.

సన్నాహక సమావేశం కోసం దేవాలయానికి చేరుకున్న మంత్రి సురేఖ కి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మంత్రి సురేఖ మహంకాళి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సన్నాహక సమావేశం తర్వాత మంత్రి అధికారులతో కలిసి ఉజ్జయిని మహంకాళి బోనాల పోస్టర్ ను ఆవిష్కరించారు.

# 68 మండలాల్లో డేంజర్

విజయవాడ, జూలై 10, ఏపీలో వర్షాభావం కనిపిస్తోంది. జూలై రెండవ వారం దాటుతున్న ఆశించిన స్థాయిలో వర్షాలు పడడం లేదు. సాగునీటి జలాశయాలు, ప్రాజెక్టుల్లో నీరు లేదు. డెడ్ స్టోరేజ్ కు చేరుకున్నాయి నిల్వలు. మరోవైపు ఖరీఫ్ సీజన్ కూడా ప్రారంభమైంది కానీ.. వర్షాలు లేక ఆశించిన స్థాయిలో పనులు ముందుకు వెళ్లడం లేదు. అల్పపీడనం ప్రభావంతో అక్కడక్కడ వర్షాలు పడ్డాయి కానీ.. ప్రస్తుతానికి ముఖం చాటేసాయి. వరి విత్తనాలు చల్లి వర్షం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు అన్నదాతలు. ప్రస్తుతం పరిస్థితి చూస్తుంటే మాత్రం ఖరీఫ్ ప్రమాదకరమే అని అర్థం అవుతోంది. ఈ తరుణంలో ఏపీ ప్రభుత్వం అప్రమత్తమయింది. ఈ వాతావరణ విపత్తుని ఎదుర్కొనేందుకు సన్నద్ధం అవుతోంది.ప్రధానంగా ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ ముందుగానే హెచ్చరించింది. అది మన రాష్ట్రంపై స్పష్టంగా కనిపించింది. నైరుతి రుతుపవనాల రాక కూడా ఆలస్యం అయ్యింది. జూన్ రెండో వారానికి రాష్ట్రానికి రుతుపవనాలు తాకాయి. తీవ్ర వర్షాభావం నెలకొంది. వర్షపాతం లోటు కనిపిస్తోంది. జూన్లో మైనస్ 25 వర్షపాతం లోటు నమోదు కాగా.. జూలైలో ఇప్పటివరకు మైనస్ 41 శాతం వర్షపాతం లోటు నమోదయింది. సాధారణంగా జూన్ నుంచి నవంబర్ వరకు నైరుతీ రుతుపవనాలు విస్తరిస్తాయి. ఖరీఫ్ కు ఇవే ప్రధానం. ఈ సీజన్ మొత్తం మైనస్ 27% వర్షపాతం లోటుతో ముగిసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.ఉమ్మడి 13 జిల్లాల్లో 68 మండలాలు ఉన్నాయి. అందులో ఎల్ నినో ప్రభావం 105 మండలాలపై తీవ్రంగా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. 208 మండలాలపై మాత్రం మద్యస్థ స్థాయిలో ప్రభావం ఉండనుంది. ప్రధానంగా శ్రీ సత్య సాయి, అన్నమయ్య, అనంతపురం జిల్లాలపై ప్రభావం ఉండనుంది. మద్యస్థ స్థాయి ప్రభావం కర్నూలు, నంద్యాల, చిత్తూరు, వైయస్సార్ కడప, తిరుపతి, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు జిల్లాలపై ఉండనుంది. నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమయింది. ప్రత్యామ్నాయ పంటలపై వ్యవసాయ శాఖ కీలక సూచనలు చేస్తోంది.

ఉరుములు, పిడుగులు.. ఆ జిల్లాలకు హై అలెర్ట్!

ఏపీ వ్యాప్తంగా చల్లటి వాతావరణం కొనసాగుతోంది. అక్కడక్కడ వర్షాలు పడుతున్నాయి. కానీ పూర్తిస్థాయిలో మాత్రం కురవడం లేదు. ఇంకా వర్షపాతం లోటు కనిపిస్తోంది. ఇటువంటి సమయంలో ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ వెదర్ అప్డేట్ ఇచ్చింది. నాలుగు జిల్లాల్లో మోస్తరు వర్షాలు, మిగిలిన జిల్లాల్లో తేలికపాటి వానలు పడతాయని తెలిపింది. అయితే భారీ వర్షాలు నమోదు కావడం లేదు. ఎల్ నినో ప్రభావం స్పష్టంగా ఉంది. ఖరీఫ్ అదును దాటుతుండడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. ఇదే పరిస్థితి మరికొన్ని రోజులపాటు కొనసాగితే ఇబ్బందికర పరిస్థితులు తప్పేలా లేవు. అయితే నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతుండడంతో కొంత ఆశలు రేగుతున్నాయి.ఐదు రోజులపాటు నైరుతీ రుతుపవనాల ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈరోజు శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం జిల్లాల్లో చెదురు మధురుగా పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ అంచనా వేస్తోంది. మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే ఛాన్స్ కనిపిస్తోంది. పిడుగులు పడే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచిస్తున్నారు. రైతులతోపాటు పశువుల కాపర్లు జాగ్రత్తగా ఉండాలని సూచనలు చేస్తున్నారు.ఏపీ పై ఎల్ నినో ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. కేవలం తేలికపాటి వర్షాలు తప్ప.. భారీ వర్షాలు నమోదు కావడం లేదు. నైరుతి రుతుపవనాలు సైతం ఆలస్యం అయ్యాయి. పెద్దగా ప్రభావం సైతం కనిపించడం లేదు. ఖరీఫ్ పంటలపై ప్రభావం కనిపిస్తోంది. ఈ ఏడాది ఇలానే కొనసాగితే కష్టం అని రైతుల్లో ఒక రకమైన ఆందోళన నెలకొంది. మరోవైపు ఎల్ నినో హెచ్చరికల నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం అప్రమత్తం అయ్యింది. ప్రత్యామ్నాయ పంటలను సూచించింది. రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ శాఖ అధికారులు ఈ పంటలపై సూచనలు అందిస్తున్నారు. ప్రధానంగా రాయలసీమ జిల్లాలతో పాటు ప్రకాశం, నెల్లూరు జిల్లాలో వర్షపాతం లోటు ఉంటుందని ముందుగానే అంచనా వేశారు. కానీ రైతులు ఆశలు పెట్టుకున్నారు. ఆకాశం మేఘావృతమై కనిపించినా.. వర్షాలు ఆశించిన స్థాయిలో కురవడం లేదు. ఇది కచ్చితంగా రైతులకు లోటు.

# టీడీపీలోకి హితేష్

ఒంగోలు జూలై 10, తెలుగుదేశం పార్టీలోకి మరో యువనేత ఎంట్రీకి రంగం సిద్ధం అయినట్లు తెలుస్తోంది. నందమూరి తారకరామారావు మనవడు దగ్గుబాటి హితేష్ త్వరలో పార్టీలో చేరుతారని తెలుస్తోంది. ఆయన మాజీ మంత్రులు దగ్గుబాటి వెంకటేశ్వరరావు, పురందేశ్వరి ల కుమారుడు. ఆయన పూర్తి పేరు హితేష్ చెంచురాం. గతంలో కుటుంబంలో నెలకొన్న విభేదాలు సమసి పోవడంతో చేరికకు మార్గం సుగమం అయినట్లు తెలుస్తోంది . ప్రస్తుతం దగ్గుబాటి పురందేశ్వరి భారతీయ జనతా పార్టీలో ఉన్నారు. ఆ పార్టీ ఎంపీగా కొనసాగుతున్నారు. దగ్గుబాటి వెంకటేశ్వరరావు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేకుండా ఉన్నారు. దశాబ్దాలుగా చంద్రబాబుతో ఉన్న విభేదాలు సమసిపోవడంతో హితేష్ టిడిపిలో చేరికకు రంగం సిద్ధం అయింది. ఈ మేరకు చంద్రబాబు సైతం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో త్వరలో హితేష్ సైకిల్ ఎక్కడం ఖాయం అన్నట్లు తెలుస్తోంది.దగ్గుబాటి వెంకటేశ్వరరావు నందమూరి తారక రామారావు అల్లుడు. సీఎం చంద్రబాబుకు స్వయానా తోడల్లుడు. 1983 నుంచి 2009 వరకు క్రియాశీలక రాజకీయాల్లో నడిచారు. 1983 అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. అసెంబ్లీలో అడుగుపెట్టారు. 1985, 1989, 2004, 2009 అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచారు. 1991లో మాత్రం ఎంపీగా విజయం సాధించారు. 1996లో రాజ్యసభకు ఎంపికయ్యారు. 2019లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి ఓడిపోయారు. ఆయనపై టిడిపి అభ్యర్థి ఏలూరి సాంబశివరావు గెలిచారు. సుదీర్ఘకాలం పరుచూరు నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించారు. ప్రస్తుతం అక్కడ టిడిపి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఉన్నారు. అయినా సరే హితేష్ టిడిపిలో చేరి రాజకీయాలు చేయాలని భావిస్తున్నారుపురందేశ్వరి సైతం తన భర్త వెంకటేశ్వరరావుతో కలిసి 2004లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బాపట్ల నుంచి ఎంపీగా పోటీ చేసి గెలిచారు. రెండోసారి విశాఖ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో మంత్రిగా కూడా వ్యవహరించారు. అయితే ఆమె తర్వాత బిజెపిలో చేరగా.. ఆమె భర్త వెంకటేశ్వరరావు మాత్రం వైసీపీలో చేరారు. 2019 ఎన్నికల్లో వెంకటేశ్వరరావు వైసీపీలో ఓడిపోయిన తర్వాత సైలెంట్ మోడ్ లోకి వెళ్లిపోయారు. వాస్తవానికి చంద్రబాబుతో విభేదించి టిడిపి నుంచి బయటకు వచ్చేసారు. ఇప్పుడు అదే చంద్రబాబుతో విభేదాలు పూర్తిగా సమసి పోయాయి. పైగా సోదరుడు లోకేష్ తో హితేష్కు మంచి సంబంధాలు ఉన్నాయి. అందుకే లోకేష్ టీమ్ లో చేరేందుకు హితేష్ రాజకీయాల్లోకి ప్రవేశించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. చంద్రబాబు నుంచి సైతం గ్రీన్ సిగ్నల్ లభించడంతో త్వరలో హితేష్ టిడిపిలో చేరనున్నారు.

## బేగంపేటలో ఎమ్మెల్యే తలసాని పర్యటన

సికింద్రాబాద్ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశించారు. శుక్రవారం బేగంపేట డివిజన్ లోని ఓల్డ్ కష్టమ్ బస్తీలో వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిత్యం డ్రైనేజీ పొంగి పోతుందని, దీంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా రోడ్లు కూడా సక్రమంగా లేవని చెప్పారు. స్పందించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ప్రజలు పడుతున్న ఇబ్బందులను దూరం చేయాలనే ఉద్దేశం తోనే ఓల్డ్ కష్టమ్ బస్తీలో సీవరేజ్ లైన్, రోడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఇప్పటికే పనులు ప్రారంభించడం జరిగిందని, త్వరితగతిన పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. సీవరేజ్ సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించేలా పర్యవేక్షణ జరిపి పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా సీవరేజ్ లైన్ పనులు పూర్తి కాగానే రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# రాయలసీమలో ఎకరా రూ.1.50 కోట్లు

అనంతపురం జూలై 10, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెట్టుబడుల ఆకర్షణ కోసం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో దూసుకుపోతోంది. కొత్త ఇండస్ట్రియల్ పాలసీ, ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానంతో పరిశ్రమలు, కంపెనీలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మారుతున్న పరిస్థితులకు తగిన విధంగా వ్యూహాలతో ముందుకు సాగుతోంది. తాజాగా ఏపీ ప్రభుత్వం ఇండస్ట్రియల్ కారిడార్లలో అభివృద్ధి చేస్తున్న మూడు నోడ్‌లలో పరిశ్రమలకు భూమి కేటాయించడానికి ప్రత్యేకంగా పాలసీని తీసుకొచ్చింది. విశాఖపట్నం–చెన్నై, హైదరాబాద్–బెంగళూరు, చెన్నై–బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లలో ఉన్న కొప్పర్తి, ఓర్వకల్లు, కృష్ణపట్నం నోడ్‌లలో ఉన్న పరిశ్రమలకు ఈ పాలసీ వర్తిస్తుంది.ఏపీ ప్రభుత్వం ఇండస్ట్రియల్ కారిడార్లలోని నోడ్‌లకు సంబంధించి పరిశ్రమలకు కేటాయించే భూముల ధరల్ని ఖరారు చేసింది. అత్యధికంగా నెల్లూరు జిల్లా క్రిస్ సిటీలో ఎకరా భూమిని రూ.1.74 కోట్లకు విక్రయించాలని నిర్ణయం తీసుకున్నారు. కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లులోని నోడ్‌లో ఎకరా రూ.1.50 కోట్లుగా ఫిక్స్ చేశారు. కడప జిల్లాలో ఎకరా రూ.1.25 కోట్లు ఖరారు చేశారు. కేంద్రం నిర్ణయించిన ధరలే ఫిక్స్ చేశారు. ఏపీ పొరుగున్న ఉన్న కర్ణాటకతో పాటుగా మహారాష్ట్ర, గుజరాత్‌లో కూడా ఇలాగే క్లస్టర్లలో పరిశ్రమలకు భూములకు సంబంధించి ధరలు ఖరారు చేశారు. గుజరాత్, ముంబైలో ఎకార రూ.2.25 కోట్లకు ఫిక్స్ చేశారు. పారిశ్రామికవేత్తల నుంచి ఎలాంటి అభ్యంతరాలు రాలేదని చెబుతున్నారు.రాష్ట్రంలోని ఇండస్ట్రియల్ నోడ్‌లకు సమీపంలో ఎకరా రూ.20 నుంచి 30 లక్షలకు భూములు అందిస్తున్నట్లు కేంద్రం దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. ఈ ధరలతో పోలిస్తే ఇండస్ట్రియల్ నోడ్‌లలో భూముల ధరలు 3 నుంచి 4 రెట్లు ఎక్కువగా ఉందని గుర్తు చేశారు. దీంతో కేంద్రం ఈ నోడ్‌లలో ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌తో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తునందున ఈ ఖర్చును భరించి రాబట్టేందుకు వీలుగా కేంద్రం ధరల్ని ఫిక్స్ చేసింది. కాకపోతే ముందుకుగా వచ్చే ప్రాజెక్టులకు మాత్రం 25శాతం రాయితీ ఇచ్చేందుకు అనుమతించింది.. అది కూడా ప్రోత్సాహకం కింద ఇస్తారు. రాష్ట్ర ప్రభుత్వాలు ఇండస్ట్రియల్ కారిడార్లకు సంబంధించిన భూముల్ని ఏ ధరకు విక్రయించాలో తమ నిర్ణయానికి అనుగుణంగా వ్యవహరించాలని, ఐఆర్ఆర్‌కు సంబంధించి కేంద్రం నిబంధన విధించింది.. ఈ ధరలకే భూములు విక్రయించాల్సి ఉంటుందంటున్నారు అధికారులు.క్రిస్ సిటీలో ముందుగా ఈ భూములు కేటాయింపు ప్రారంభించాలని ప్లాన్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కొప్పర్తి, ఓర్వకల్లు, కృష్ణపట్నం నోడ్‌లలో కలిపి దశల వారీగా 29,254 ఎకరాల్లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తోంది. రాష్ట్రం భూముల్ని కేటాయిస్తే.. కేంద్ర సంస్థ నిక్‌డిక్ట్ (నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్) అభివృద్ధి చేస్తోంది. మూడు నోడ్‌లలో కలిపి మొదటి దశలో భాగంగా మౌలిక సదుపాయాలకు మొత్తం 7,225 ఎకరాల్లో దాదాపు రూ.3,300 కోట్లు నిక్‌డిక్ట్ ఖర్చు చేస్తోంది.

# అడ్డంగా బుక్కైన కాటసాని

కర్నూలు, జూలై 10, నంద్యాల జిల్లాలో వైసీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి భూకబ్జా ఉదంతం తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తనకున్న రాజకీయ పలుకుబడిని ఉపయోగించి.. ఏకంగా రూ.15 కోట్ల విలువైన 3 ఎకరాల ప్రభుత్వ భూమిని కాటసాని రామిరెడ్డి అక్రమంగా ఆక్రమించుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. నాటి అధికార మదంతో ప్రభుత్వ ఆస్తులను సైతం వదలకుండా కాటసాని అనుచరులు కబ్జాకు పాల్పడ్డారనే విమర్శలు ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారాయి.ఈ భారీ భూకబ్జా పర్వంలో కేవలం రాజకీయ నాయకులే కాకుండా.. ప్రభుత్వానికి రక్షణగా ఉండాల్సిన అధికారులే లంచాలకు ఆశపడి చేతులు కలిపినట్లు తెలుస్తోంది. అప్పట్లో కాటసాని రామిరెడ్డి అక్రమాలకు ఇరిగేషన్ మరియు రెవెన్యూ శాఖలకు చెందిన కొందరు కీలక అధికారులు పూర్తి స్థాయిలో సహకరించారని విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వ భూమి అని తెలిసి కూడా రికార్డులను తారుమారు చేయడం లేదా కబ్జా జరుగుతున్నా కళ్లు మూసుకోవడం ద్వారా ఈ అక్రమ ఆక్రమణకు వారు బాటలు వేశారనే ఆరోపణలు వినపడుతున్నాయి.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. గత ప్రభుత్వ హయాంలో జరిగిన పలు అవినీతి అక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగానే కాటసాని రామిరెడ్డి చేసిన ఈ భూకబ్జా వ్యవహారంపై విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. రంగంలోకి దిగిన విజిలెన్స్ అధికారులు క్షేత్రస్థాయిలో రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, విచారణ జరపగా.. సదరు 3 ఎకరాల ప్రభుత్వ భూమిని కాటసాని ఆక్రమించిన మాట వాస్తవమేనని తేల్చేశారు. విజిలెన్స్ నివేదికతో కాటసాని అక్రమాలు అధికారికంగా బట్టబయలయ్యాయి.విజిలెన్స్ విచారణలో ఆక్రమణలు నిజమేనని తేలడంతో ఏపీ కూటమి ప్రభుత్వం అత్యంత తీవ్రంగా స్పందించింది. రూ.15 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని తక్షణమే స్వాధీనం చేసుకోవాలని, ఆక్రమణలను తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది. భూకబ్జాకు పాల్పడ్డ వైసీపీ నేత కాటసాని రామిరెడ్డిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు.. అప్పట్లో ఆయనకు అండగా నిలిచి లూటీకి సహకరించిన ఇరిగేషన్, రెవెన్యూ అధికారులపై కూడా శాఖాపరమైన మరియు క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది.

## అమ్ములపొదిలో పాశుపతాస్త్రం

న్యూఢిల్లీ, జూలై 10, భారత రక్షణ రంగం పాశుపతాస్త్రంను సిద్ధం చేసింది. ఇప్పటికే ప్రపంచంలో అత్యంత శక్తి వంతంగా గుర్తింపు పొందిన ఇడియన్ ఆర్మీ చేతిలోకి ఇది రావడంతో మరింత బలం చేకూరినట్లయింది. పూర్తిగా స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసిన 'పినాకా లాంగ్ రేంజ్ గైడెడ్ రాకెట్ ను విజయవంతంగా పరీక్షించారు. దీంతో భారత సైన్యం దీర్ఘదూర దాడి సామర్థ్యం మరింత బలోపేతమైంది. అయితే ఇది ఎలా తయారైంది? దీని వల్ల సైన్యానికి ఎటువంటి ఉపయోగం?ఒడిశాలోని చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ లో 8, జూలై 2026న నిర్వహించిన ఈ పరీక్షలో రాకెట్ నిర్దేశించిన 60 కిలోమీటర్ల కనిష్ఠ దూరాన్ని అత్యంత కచ్చితత్వంతో చేరుకుని లక్ష్యాన్ని ఛేదించింది. పరీక్ష సందర్భంగా ప్రయోగించిన పినాకా ఎల్ఆర్‌జీఆర్ ముందుగా నిర్దేశించిన మార్గాన్నే అనుసరిస్తూ ఎలాంటి వ్యత్యాసం లేకుండా ప్రయాణించింది. చివరికి లక్ష్యాన్ని అత్యంత ఖచ్చితత్వంతో తాకింది. రాకెట్ గైడెన్స్, నావిగేషన్, కంట్రోల్ వ్యవస్థలు అద్భుతంగా పనిచేశాయని ఈ పరీక్ష మరోసారి నిరూపించింది.పినాకా ఎల్ఆర్‌జీఆర్‌ను డీఆర్‌డీవో ఆధ్వర్యంలో అభివృద్ధి చేశారు. పూణెలోని ఆర్మమెంట్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ , హై ఎనర్జీ మెటీరియల్స్ రీసెర్చ్ లాబొరేటరీ (లు ఈ రాకెట్ రూపకల్పనలో కీలక పాత్ర పోషించాయి. అలాగే హైదరాబాద్‌లోని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ లాబొరేటరీ , రీసెర్చ్ సెంటర్ ఇమారత్ గైడెన్స్, నావిగేషన్, నియంత్రణ వ్యవస్థలకు అత్యాధునిక సాంకేతిక సహకారం అందించాయి.పినాకా ఎల్ఆర్‌జీఆర్ సాధారణ రాకెట్ కాదు. ఇది లక్ష్యానికి చేరుకునేంతవరకు తన దిశను సరిచేసుకుంటూ ప్రయాణించే గైడెడ్ రాకెట్. అందువల్ల శత్రు కమాండ్ సెంటర్లు, బంకర్లు, వ్యూహాత్మక స్థావరాలు వంటి కీలక లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ధ్వంసం చేయగలదు. తక్కువ సమయంలో భారీ అగ్నిశక్తిని ప్రదర్శించగల సామర్థ్యం దీనికి ప్రత్యేకత.ఈ విజయవంతమైన పరీక్షతో భారత సైన్యానికి అత్యాధునిక ఆయుధ వ్యవస్థ మరోటి అందుబాటులోకి రానుంది. సరిహద్దు భద్రత, ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్లు, యుద్ధ పరిస్థితుల్లో వేగవంతమైన ప్రతిస్పందనకు ఈ రాకెట్ కీలకంగా ఉపయోగపడుతుందని రక్షణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. భారత భూసేన అగ్నిశక్తిని మరింత పెంచడంలో పినాకా కీలక పాత్ర పోషించనుంది. ఈ పరీక్ష స్వదేశీ రక్షణ తయారీ సామర్థ్యానికి మరో నిదర్శనంగా నిలిచింది. విదేశీ ఆయుధాలపై ఆధారపడకుండా అత్యాధునిక రాకెట్ వ్యవస్థలను దేశీయంగానే అభివృద్ధి చేయగల సామర్థ్యం భారత్‌కు ఉందని ఈ పరీక్ష మరోసారి ప్రపంచానికి చాటిచెప్పింది. రక్షణ రంగంలో స్వావలంబన లక్ష్యానికి ఇది మరింత బలాన్ని చేకూర్చనుంది.పినాకా లాంగ్ రేంజ్ గైడెడ్ రాకెట్ విజయవంతమైన పరీక్షతో భారత్ ఆధునిక రాకెట్ సాంకేతికతలో మరో కీలక అడుగు వేసింది.

## PUBLIC NOTICE

Myclient ,ANURADHA VOREDII W/O SATYANARAYANA,R/O at H. NO 8-4-369/291,BANJARA NAGAR ,BORABANDA, KHAIRATABAD mandal ,HYD TG-500018.Iam informing to the general public that she has changed her name From PRAVEENA TATINENI W/O T.SRINIVAS RAO To ANURADHA VEREDI W/O SATYANARAYANA ,For all future purposes

Place; Hyderabad
Date;09-07-2026

(SHAIK JAKEER HUSSAIN)
Advocate
Chambers at; 12-4-74/E,
2 nd Floor,Moosapet
HYDERABAD 500 018
cell no;9246536715

## PUBLIC NOTICE

Myclient ,VOREDI SATYANARAYANA S/O. VOREDICHANDRA-IAH,aged 51 YEARS R/O. H NO 8-4-369/291,BANJARA NAGAR, BORABANDA, KHAIRATABAD Mandal ,HYD, TG-500018.I am informing to the general public that he Have changed his name from SUNKARA VENKATA PHANIDRA S/O SUNKARA NAGESH-WARA RAO to VOREDI SATYANARAYANA S/O VOREDI CHANDRAIAH,For all future purposes

Place; Hyderabad
Date;09-07-2026

(SHAIK JAKEER HUSSAIN)
Advocate
Chambers at; 12-4-74/E,
2 nd Floor,Moosapet
HYDERABAD 500 018
cell no;9246536715

# వైసీపీ, టీడీపీ మధ్య సవాళ్లు

కర్నూలు, జూలై 10, ఉమ్మడి కర్నూలు జిల్లా లోని ఆళ్లగడ్డ నియోజకవర్గంలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. అధికార తెలుగు దేశం పార్టీ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రరెడ్డి మధ్య ఆరోపణలు, సవాళ్లతో రాజకీయ చర్చలు మరింత ముదిరాయి. ఇద్దరు నాయకులు బహిరంగంగా ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడంతో ఈ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది. అహోబిలం ఆలయానికి సంబంధించిన వ్యవహారాల్లో అవినీతి చోటుచేసుకుందని బ్రిజేంద్రరెడ్డి ఆరోపించారు. భక్తులు సమర్పించే తలనీలాలు, కానుకలు వంటి అంశాల్లో అక్రమాలు జరుగుతున్నాయని, వాటికి అధికార వర్గాల మద్దతు ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రతి నెలా అక్రమ లావాదేవీలు జరుగుతున్నాయని కూడా ఆయన విమర్శించారు. ఈ ఆరోపణలపై స్పందించిన అఖిలప్రియ వాటిని పూర్తిగా ఖండించారు. తాను ఎలాంటి అవినీతికి పాల్పడలేదని స్పష్టం చేశారు. తమ కుటుంబం ఎప్పటి నుంచో దేవాలయాలు, మఠాలకు విరాళాలు అందిస్తోందని, ఆధ్యాత్మిక సంస్థలను దోచుకునే సంస్కృతి తమకు లేదని చెప్పారు. గతంలో అధికారంలో ఉన్నవారే ఇప్పుడు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఆమె ఎదురుదాడి చేశారు. అంతేకాకుండా, తనపై చేసిన ఆరోపణలను ఆధారాలతో నిరూపించాలని బ్రిజేంద్రరెడ్డికి సవాల్ విసిరారు. అవి నిజమని తేలితే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడానికి కూడా సిద్ధమని ప్రకటించారు. అదే సమయంలో ఆరోపణలను నిరూపించలేకపోతే ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ప్రత్యర్థి నేతను డిమాండ్ చేశారు. ఈ సవాల్‌కు ప్రతిస్పందించిన బ్రిజేంద్రరెడ్డి కూడా తన వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని, సరైన సమయంలో వాటిని ప్రజల ముందుకు తీసుకొస్తానని తెలిపారు. దీంతో ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం మరింత తీవ్రమైంది. ఈ వివాదానికి అహోబిలాన్ని వేదికగా ఎంచుకోవడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. అఖిలప్రియ ఆళ్లగడ్డ నుంచి అహోబిలానికి చేరుకుని అక్కడే ఉంటానని ప్రకటించారు. మరోవైపు బ్రిజేంద్రరెడ్డి కూడా అక్కడికి వెళ్లేందుకు సిద్ధమవగా, పరిస్థితులు ఉద్రిక్తంగా మారే అవకాశం ఉందని భావించిన పోలీసులు ఆయనను గృహనిర్బంధంలో ఉంచినట్లు సమాచారం. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆళ్లగడ్డ రాజకీయాలు గతంలో కూడా ఎన్నో సంచలనాలకు కేంద్రంగా నిలిచాయి. ఇప్పుడు మరోసారి ఇద్దరు ప్రధాన నాయకుల మధ్య నేరుగా సవాళ్లు, ప్రతి సవాళ్లు సాగడంతో స్థానిక రాజకీయాలు మరింత వేడెక్కాయి. అయితే అహోబిలం చర్చకు వచ్చేందుకు గంగుల బ్రిజేంద్రనాథ్ రెడ్డి తన ఇంటి నుంచి బయలుదేరారు. కానీ శాంతి భద్రతల సమస్య దృష్ట్యా పోలీసులు ఆయనను ఇంటి బయటకు రాకుండా అడ్డుకున్నారు. గంగుల బ్రిజేంద్రనాథ్ రెడ్డి తో పాటు ఆయన అనుచరులు కూడా తమను అహోబిలం వెళ్లేందుకు అనుమతివ్వాలని పోలీసులను కోరారు. పోలీసులు అందుకు అంగీకరించకపోవడంతో అఖిలప్రియకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎన్నికలకు ఇంకా మూడేళ్లు ముందు నుంచే ఆళ్లగడ్డ రాజకీయం హీటెక్కింది. గంగుల బ్రిజేంద్రనాథ్ రెడ్డి వర్సెస్ భూమా అఖిలప్రియగా వార్ మొదలయింది. ఇప్పుడే ఇలా ఉంటే.. రానున్న కాలంలోఇంకెన్ని వివాదాలు తలెత్తుతాయోనన్న ఆందోళన ఆళ్లగడ్డ ప్రజల్లో నెలకొంది. మొత్తం మీద కేవలం రాజకీయ ఆధిపత్యం కోసమే ఇలాంటి ఆరోపణలు చేసుకుంటున్నారంటూ సొంత పార్టీ నేతలే కామెంట్స్ చేస్తున్నారు. వ్యవహారం ఎలా ముగుస్తుందో, ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు బయటకు వస్తాయో అన్న అంశంపై రాజకీయ వర్గాలతో పాటు ప్రజల్లో కూడా ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం ఇరు పార్టీల కార్యకర్తలు తమ తమ నాయకులకు మద్దతుగా నిలుస్తుండటంతో పరిస్థితిని అధికారులు నిశితంగా గమనిస్తున్నారు.

# బీజేపీ నేతల మౌనం ఎందుకో...

విశాఖపట్టణం, జూలై 10, ఆంధ్రప్రదేశ్ బీజేపీలో ఏదో జరుగుతుంది. ఎంపీలు, ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ పెద్దగా రాజకీయంగా యాక్టివ్ గా లేకపోవడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. కూటమి ప్రభుత్వంపై ప్రత్యర్థులు విమర్శలు చేస్తున్నప్పటికీ దానికి సరైన కౌంటర్ మాత్రం ఇవ్వడం లేదు. బీజేపీ నేతల మౌనం వెనక అర్థం ఏంటన్నది ఇప్పటికీ కూటమిలోని ప్రధాన పక్షాలైన టీడీపీ, జనసేనలకు అర్థం కాకుండా ఉంది. రాష్ట్ర నేతలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారా? లేదా కేంద్ర నాయకత్వం నుంచి ఏమైనా ఆదేశాలు ఉన్నాయా? అన్న అనుమానం అందరిలోనూ కలుగుతుంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయి రెండేళ్లు పూర్తి కావస్తున్నప్పటికీ కమలం పార్టీ రాష్ట్ర నేతలు మాత్రం సంతోషంగా లేరు. తమ నియోజకవర్గాల్లో... అనేక నియోజకవర్గాల్లో తాము ప్రాతినిధ్యం వహిస్తున్న చోట టీడీపీ, జనసేన నుంచి తమకు మద్దతు లభించడం లేదని రివర్స్ లో బీజేపీ నేతలు ఈ విధమైన నిరాసక్తతతో ఉన్నారని చెబుతున్నారు. మొన్నటి ఎన్నికల్లో బీజేపీ పది స్థానాల్లో పోటీ చేసింది. ఎనిమిది స్థానాల్లో విజయం సాధించింది. అలాగే ఆరు లోక్ సభ స్థానాలకు పోటీ చేసి మూడింటిలోవిజయం సాధించింది. అనపర్తి నుంచి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి , కైకలూరు నుంచి కామినేని శ్రీనివాస్, విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి సుజనా చౌదరి, ఆదోని నుంచి డా. పి.వి. పార్థసారథి, జమ్మలమడుగు నుంచి ఆదినారాయణ రెడ్డి, ధర్మవరం నుంచి సత్య కుమార్ యాదవ్, ఎచ్చెర్ల నుంచి నడుకుదిటి ఈశ్వరరావు ఎన్నికయ్యారు. విశాఖపట్నం ఉత్తరం నుంచి పెన్మెత్స విష్ణు కుమార్ రాజులు ఎన్నికయ్యారు. రాజమండ్రి పార్లమెంటు నుంచి దగ్గుబాటి పురంధేశ్వరి, అనకాపల్లి సీఎం రమేష్, నర్సాపురం నుంచి భూపతిరాజు శ్రీనివాసవర్మలు ఎన్నికయ్యారు. దీంతో పాటు మాధవ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నారు... కానీ ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలున్నప్పటికీ ఎవరూ పెద్దగా స్పందించడం లేదు. అసలు కూటమి ప్రభుత్వంతో తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటం ఇప్పుడు రాజకీయంగా చర్చనీయాంశమైంది. కూటమి ప్రభుత్వం పై వస్తున్న ఆరోపణల విషయంలోనూ పెద్దగా స్పందించడం లేదు. ఇందుకు ప్రధాన కారణం.. కూటమి సర్కార్ లో తమకు ప్రాధాన్యత దక్కకపోవడం ఒక కారణమయితే, మరొక ముఖ్యమైన కారణం.. తమ నియోజకవర్గాల్లో టీడీపీ ఇన్ ఛార్జుల పెత్తనం సాగుతుండటమేనని చెబుతున్నారు. ఇప్పటికే ఈ విషయాన్ని కేంద్ర నాయకత్వానికి కొందరు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అయితే సంయమనం పాటించాలని, రానున్న కాలంలో అంతా సర్దుకుంటుందని నాయకత్వం చెప్పిందట. అయినా సరే కూటమిలో మిత్రధర్మం పాటించకుండా వ్యవహరించడంపై టీడీపీ, జనసేనలో కొంత అసంతృప్తి అయితే మొదలయింది. తెలుగు రాష్ట్రాల్లో వర్షాభావం, రుతుపవనాల లోపం వల్ల వ్యవసాయానికి తీవ్ర ఆటంకం కలిగి కరవు పరిస్థితులు ఏర్పడ్డాయి.

## జిల్లా ఆర్టీయే కు స్థల సేకరణ ప్రక్రియ ప్రారంభం

వికారాబాద్ జిల్లా ఆర్టీయే కార్యాలయంలో ఆటోమేటిక్ ఫిట్నెస్ టెస్టింగ్ సెంటర్, అడ్వాన్స్డ్ సైంటిఫిక్ డ్రైవింగ్ టెస్టింగ్ సెంటర్ ఏర్పాటుకు స్థల సేకరణ ప్రక్రియ ప్రారంభమైంది. దీని కోసం 7 ఎకరాల స్థలం గుర్తించారు. ఆటోమేటిక్ వ్యవస్థతో వాహన ఫిట్నెస్ పరీక్షలు మరింత పారదర్శకంగా జరగనున్నాయని అధికారులు తెలిపారు.

# ఆరణి శ్రీనివాసులుకు కష్టాలు

తిరుపతి, జూలై 10, తిరుపతి జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు కష్టాలు మొదలయినట్లు కనిపిస్తుంది. వచ్చే ఎన్నికల్లో ఆయనకు తిరుపతి శాసనసభ టిక్కెట్ దక్కేది కూడా కష్టంగానే కనిపిస్తుంది. తెలుగుదేశం పార్టీ నుంచి ఆరణి శ్రీనివాసులకు ఇబ్బందికరమైన పరిస్థితులు ఎదురవుతున్నాయని చెప్పాలి.

తాజాగా టీడీపీ అధినాయకత్వం తిరుపతి ఇన్ ఛార్జిగా మన్నెం శ్రీనివాస్ ప్రసాద్ ను నియమించడంతో ఈ ఊహాగానాలకు మరింత ఊపు నిచ్చినట్లయింది. ఇప్పటి వరకూ తిరుపతి టీడీపీ ఇన్ ఛార్జిగా ఉన్న సుగుణమ్మను తప్పించి ఆమె స్థానంలో మన్నెం శ్రీనివాస్ ప్రసాద్ ను నియమించడం వెనక వచ్చే ఎన్నికల్లో శ్రీనివాస్ ప్రసాద్ ను పోటీకి దింపాలన్న యోచనలోనే టీడీపీ నాయకత్వం ఉందన్నది పార్టీ వర్గాల ద్వారా విస్తృతంగా సోషల్ మీడియాలో ప్రచారం అవుతుంది. 2019లో వైసీపీ నుంచి గెలిచిన ఆరణి శ్రీనివాసులు 2024 ఎన్నికల్లో జనసేనలోచేరారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆరణి శ్రీనివాసులకు తిరుపతి నియోజకవర్గం టిక్కెట్ ఇచ్చారు. టీడీపీ బలంగా ఉన్నప్పటికీ, అక్కడ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ తనకు కావాలని గట్టిగా కోరినప్పటికీ పవన్ కల్యాణ్ తిరుపతి నియోజకవర్గం సీటును పట్టుబట్టి జనసేన ఖాతాలో వేసుకున్నారు కూటమి హవాలో ఆరణి శ్రీనివాసులు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. వైసీపీ నుంచి జనసేనలోకి గతంలో చిత్తూరు ఎమ్మెల్యేగా వైసీపీలో ఉన్న ఆయన పార్టీ మారి తిరుపతి జనసేన ఎమ్మెల్యే అయ్యారు. కానీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆరణి శ్రీనివాసులు పార్టీ క్యాడర్ ను పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. టీడీపీ, జనసేన క్యాడర్ ను పక్కన పెట్టి కొందరు వైసీపీ నేతలకు టచ్ లో ఉన్నారంటూ ఆరో?పణలు పలు దఫాలు ఎదుర్కొన్నారు. అలాగే సుగుణమ్మ కూడా జనసేన నేతలతో సమన్వయం చేసుకోవడంలో విఫలమయ్యారని టీడీపీ నాయకత్వం భావించింది. జనసేన నాయకులే ఆరణి శ్రీనివాసులుపై ఆరోపణలు చేస్తున్నారు. వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలకు కూడా ధీటుగా ఆరణి శ్రీనివాసులు స్పందించక పోవడం కూడా ఆరణిపై ఆగ్రహానికి కారణమయిందంటున్నారు. కొంతకాలం క్రితం తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ క్లాస్ పీకారని తెలిసింది.

ఇలాగైతే ఎలా.. కూటమిలోని మూడు పార్టీల కార్యకర్తలను కలుపుకుని పోవాలని పవన్ కల్యాణ్ చెప్పారట. పాత పరిచయాలుంటే వాటిని వదిలేయాలని, జనసేనలో కొనసాగాలనుకుంటే మారాలని ఆరణి శ్రీనివాసులుకు పవన్ కల్యాణ్ ఒకింత సీరియస్ గానే చెప్పినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే వచ్చే ఎన్నికలు మూడేళ్లకు ముందుగానే టీడీపీ ఇన్ ఛార్జిగా మన్నెం శ్రీనివాస్ ప్రసాద్ ను పార్టీ నాయకత్వం నియమించినట్లు తెలిసింది.

గ్రేటర్ రాయలసీమపై గురి

జనసేనలో చేరికలు పెరిగే అవకాశం కనిపిస్తోంది. ప్రధానంగా గ్రేటర్ రాయలసీమ పరిధిలోని ఆరు ఉమ్మడి జిల్లాల నుంచి భారీగా వైసీపీ నేతలు జనసేనలో చేరుతారని ప్రచారం ప్రారంభం అయింది. చాలామంది వైసిపి నేతలు అసంతృప్తితో ఉన్నారు. అటువంటి వారంతా జనసేన వైపు చూస్తున్నట్లు తెలుస్తోంది. వారిని పార్టీలోకి రప్పించేందుకు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డి రంగంలోకి దిగినట్లు సమాచారం. ఇటీవల 14 మంది జనసేన నేతలతో చేరికల కమిటీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.

అందులో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డి కూడా ఒకరు. ఆయనకు గ్రేటర్ రాయలసీమ జిల్లాలపై మంచి పట్టు ఉంది. కాంగ్రెస్ పార్టీతో పాటు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఆయన పని చేశారు. ఆ అనుభవంతోనే పెద్ద ఎత్తున వైసిపి నేతలను ఆకర్షించేందుకు ఆయన ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు గెలుస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై అసంతృప్తి ఉన్నవారు, వీధి లేక పార్టీలో కొనసాగుతున్న వారిని టార్గెట్ చేసుకున్నట్లు తెలుస్తోంది. గ్రేటర్ రాయలసీమ పరిధిలో కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం, నెల్లూరు, ప్రకాశం జిల్లాలో ఉన్నాయి. దాదాపు 70 వరకు నియోజకవర్గాలు ఉంటాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఆది నుంచి గ్రేటర్ రాయలసీమ అనుకూలంగా ఉంటూ వస్తోంది. 2014 ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వచ్చింది. కానీ గ్రేటర్ రాయలసీమలో మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టు చాటుకుంది. 2019 ఎన్నికల్లో మాత్రం ఒక ఐదు స్థానాలు మినహా మిగిలిన నియోజకవర్గాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయదుందుభి మోగించింది. 2024 ఎన్నికల్లో కూటమి ప్రభంజనంలో సైతం వైయస్సార్ కాంగ్రెస్ ఏడు స్థానాల్లో విజయం సాధించింది.

మూడు ఎంపీ సీట్లను పొందింది. అందుకే అక్కడ వైసిపిని తక్కువ అంచనా వేయకూడదని చంద్రబాబుతో పాటు పవన్ కళ్యాణ్ భావిస్తున్నారు.

అందుకే మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డిని రంగంలోకి దించినట్లు తెలుస్తోంది. బాలినేని శ్రీనివాస్ రెడ్డి తన సొంత జిల్లా ప్రకాశం నుంచి జనసేన చేరికల విషయంలో ప్రత్యేక ఫోకస్ పెట్టినట్లు సమాచారం. జిల్లాలో మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు ఓ నలుగురు జనసేనలోకి వస్తారని టాక్ నడుస్తోంది. ప్రధానంగా కరణం బలరాం, సిద్ధ రాఘవరావు, ఆమంచి కృష్ణమోహన్ తో పాటు మరొకరి పేరు ప్రధానంగా వినిపిస్తోంది. వారంతా తెలుగుదేశం పార్టీలో చేరేందుకు ప్రయత్నాలు చేశారు.

కానీ వర్కౌట్ కాలేదు. నియోజకవర్గాల పునర్విభజన కచ్చితంగా ఉంటుందన్న టాక్ ఉంది. పెరిగిన అసెంబ్లీ నియోజకవర్గాలతో అవకాశాలు కల్పిస్తామని కూటమి నుంచి వారికి హామీలు దక్కుతున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా రాయలసీమ జిల్లాల్లో చాలామంది వైసిపి మాజీ ఎమ్మెల్యేలు జనసేనలోకి వచ్చేందుకు సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే జనసేన చేరికల కమిటీ చాలా యాక్టివ్ గా పని చేయడం ప్రారంభించింది. సహజంగానే ఈ పరిణామం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఆందోళన కలిగిస్తోంది.

## న్యూ ఏజింగ్ టాప్ ప్రయారిటీ

న్యూఢిల్లీ, జూలై 10, వయసు పెరగడం మానవ జీవితంలో అనివార్యమైన భాగం. కానీ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఈ ప్రక్రియను మందగించి, ఆరోగ్యకరమైన జీవితకాలాన్ని పెంచడానికి భారీగా పెట్టుబడులు పెడుతున్నారు. ఇందుకోసం సుమారు 26 బిలియన్ డాలర్లు (సుమారు 2 లక్షల కోట్ల రూపాయలు) ఖర్చు చేస్తూ ఒక జాతీయ శాస్త్రీయ కార్యక్రమాన్ని నడుపుతున్నారు. 2025లో బీజింగ్‌లో జరిగిన సైనిక కవాతు సందర్భంగా పుతిన్ చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో అవయవాల మార్పిడి ద్వారా మనుషులు యువతను నిలుపుకోవచ్చని, బహుశా అమరత్వం కూడా సాధ్యమవుతుందని చర్చించినట్లు హాట్ మైక్ రికార్డింగ్ ద్వారా బయటపడింది. ఈ చర్చ 2024లో అధికారికంగా ప్రారంభమైన 'న్యూ హెల్త్ ప్రిజర్వేషన్ టెక్నాలజీస్' ప్రాజెక్టుకు సంబంధించినదిగా విశ్లేషకులు భావిస్తున్నారు. రష్యా ప్రభుత్వం దీనిని టాప్ ప్రయారిటీ శాస్త్రీయ కార్యక్రమంగా ప్రకటించిందిఈ కార్యక్రమం అనేక అధునాతన రంగాలపై దృష్టి పెట్టింది. కణాల వృద్ధాప్యాన్ని నెమ్మది చేసే చికిత్సల అభివృద్ధి. ఇది ప్రాజెక్టులో కీలక భాగం. కణజాలాలు, అవయవాలను 3డీ ప్రింటింగ్ ద్వారా తయారు చేయడం. ఇప్పటికే ఎలుకల థైరాయిడ్ గ్రంథి, మానవ కార్టిలేజ్ విజయవంతంగా ప్రింట్ చేశారు. 2030 నాటికి పూర్తి మానవ అవయవాలను సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. జన్యుపరంగా మార్చిన మినీ పందులలో మానవ అనుకూల అవయవాలు పెంచి, మనుషులకు మార్పిడి చేయడం. ఇది అవయవాల కొరతను తగ్గించడానికి సహాయపడుతుంది. క్రయోథెరపీ ఇవి కణాలను రక్షించడానికి ఉపయోగపడతాయి. ఈ సాంకేతికతలు ప్రపంచవ్యాప్తంగా (ముఖ్యంగా సిలికాన్ వ్యాలీలో) జరుగుతున్న పరిశోధనలతో సమాంతరంగా ఉన్నాయి. రష్యా వాటిని రాష్ట్ర స్థాయిలో ప్రాధాన్యత ఇచ్చి ముందుకు తీసుకెళ్తోంది. ఈ ప్రాజెక్టును పుతిన్ కుమార్తె, ఎండోక్రై నాలజిస్ట్ మరియా వొరొంత్సోవాకు అప్పటించారు. ఆమె నేతృత్వంలోని జన్యు పరిశోధనలతో అనుసంధానించారు. ఆమె రాష్ట్ర జన్యు కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. ఇది వ్యక్తిగత ఆసక్తిని రాష్ట్ర విధానంగా మార్చడానికి సహాయపడింది. ఈ ప్రాజెక్టు ఆశావాదాన్ని కలిగిస్తుంది. జీన్ థెరపీ, రీజెనరేటివ్ మెడిసిన్ వంటి రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. అవయవాల మార్పిడి ద్వారా జీవితకాలం పొడిగించడం సాంకేతికంగా సాధ్యమవుతుంది, కానీ పూర్తి అమరత్వం ఇప్పటికీ శాస్త్రీయంగా దూరంలోనే ఉంది. అవయవాల తిరస్కరణ, జన్యు మార్పుల భద్రత, జంతు ప్రయోగాల నైతికత వంటి సవాళ్లు ఉన్నాయి. ఇలాంటి అధునాతన చికిత్సలు మొదట్లో సంపన్నులు లేదా శక్తివంతులకు మాత్రమే అందుబాటులోకి రావచ్చు. ఇది సామాజిక అసమానతలను పెంచవచ్చు. అలాగే, జంతువులను ఉపయోగించి అవయవాలు పెంచడం వల్ల నైతిక చర్చలు రావచ్చు. రష్యాలో ఆయుర్దాయం తగ్గుతున్న నేపథ్యంలో ఈ ప్రయత్నం సానుకూలం. అయితే, యుద్ధం నేపథ్యంలో ఈ భారీ నిధులు ఇతర సామాజిక?ఆర్థిక అవసరాలకు ఉపయోగపడాలని విమర్శలు వస్తున్నాయి. చైనాతో సహకారం సాధ్యమైతే బయోటెక్నాలజీ రంగంలో రష్యా?చైనా బలం పెరగవచ్చు. ప్రపంచవ్యాప్తంగా ఇలాంటి పోటీ పెరగడం వల్ల మానవాళికి మంచి చికిత్సలు వచ్చే అవకాశం ఉంది. ఈ అభివృద్ధులు శాస్త్రం ఎంతవరకు మానవ సామర్థ్యాలను విస్తరించగలదో చూపిస్తాయి. ఫలితాలు ఏమైనా, ఇవి మానవాళి ముందుకు సాగడానికి ఒక ముఖ్యమైన అధ్యాయం.

# పీఓకేలో ఆందోళనలు తీవ్రం

న్యూఢిల్లీ, జూలై 10, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ కొన్ని రోజులుగా అట్టుడుకుతోంది. గత కొన్ని రోజులుగా పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. పాకిస్తాన్ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా రావల్కోట్ సహా పలు ప్రాంతాల్లో వేలాది మంది ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసనలు చేపడుతున్నారు. ధరల పెరుగుదల, విద్యుత్ కొరత, పరిపాలనా సమస్యలు, మౌలిక సదుపాయాల లోపం వంటి అంశాలపై ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ పరిణామాలు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో నెలకొన్న అసంతృప్తిని మరోసారి వెలుగులోకి తెచ్చాయి. స్థానిక వర్గాల ప్రకారం, నిరసనలను నియంత్రించేందుకు పాకిస్తాన్ అధికారులు కఠిన చర్యలు తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆహారం, ఇతర నిత్యావసర వస్తువుల సరఫరాపై ఆంక్షలు విధించారని కొందరు స్థానిక నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొందరు నాయకులు అంతర్జాతీయ సమాజం దృష్టి ఈ అంశంపై పడాలని కోరుతున్నారు. రక్షణ విశ్లేషకుడు, రిటైర్డ్ లెఫ్టినెంట్ కల్నల్ జె.ఎస్. సోధి మాట్లాడుతూ, పాకిస్తాన్ పాలనపై ప్రజల్లో అసంతృప్తి చాలా కాలంగా ఉందని అభిప్రాయపడ్డారు. అయితే, ఆయన చేసిన రాజకీయ విశ్లేషణలు వ్యక్తిగత అభిప్రాయాలేనని గమనించాలి. భవిష్యత్తులో అక్కడ మరింత పెద్ద ఉద్యమం చెలరేగే అవకాశం ఉందని ఆయన వ్యాఖ్యానించారు. 2023లో ఏర్పాటైన జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రజలు మొత్తం 38 డిమాండ్లను ప్రభుత్వం ముందుంచారు. ఈ కమిటీలో రవాణా రంగ ప్రతినిధులు, దుకాణదారులు, చిన్న వ్యాపారులు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులు తదితరులు ఉన్నారు. పెన్షన్ల చెల్లింపు, పిండి, విద్యుత్ ధరల తగ్గింపు, మెరుగైన ఆరోగ్య సేవలు, మీర్‌పూర్‌లో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణం, విద్యుత్ మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆస్తుల బదిలీలపై పన్నుల తగ్గింపు వంటి అంశాలు ప్రధాన డిమాండ్లలో ఉన్నాయి. స్థానికులు, గత రెండేళ్లలో జరిగిన నిరసనల సందర్భంగా మరణించిన వారి కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలని కూడా డిమాండ్ చేస్తున్నారు. అలాగే విద్యుత్ ఉత్పత్తిలో కీలక ప్రాంతంగా ఉన్నప్పటికీ, విద్యుత్ కొరత కొనసాగుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలావుంటే, భారతదేశం అధికారికంగా మొత్తం జమ్మూ-కాశ్మీర్, లడఖ్‌తో పాటు పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌ను కూడా భారత అంతర్భాగంగానే పరిగణిస్తోంది. అయితే ప్రస్తుతం పరిపాలన పాకిస్తాన్ ఆధీనంలో కొనసాగుతోంది. ఈ అంశం భారత్-పాకిస్తాన్ మధ్య దీర్ఘకాలిక వివాదంలో భాగంగా ఉంది. ప్రస్తుతం జరుగుతున్న నిరసనలు, ప్రజల డిమాండ్లు, అక్కడి పరిస్థితులు ప్రాంతీయ రాజకీయాల్లో మరోసారి చర్చనీయాంశంగా మారాయి. పరిస్థితిపై పలు వర్గాలు నిశితంగా గమనిస్తున్నాయి. అయితే అక్కడి పరిస్థితులపై వస్తున్న అనేక ఆరోపణలు, రాజకీయ వ్యాఖ్యానాలు స్వతంత్రంగా పూర్తిగా ధృవీకరించలేదు.

# 16 జిల్లాల్లో వర్షాభావం..

## 65 లక్షల ఎకరాలకు గాను

## 4.22 లక్షల ఎకరాల్లోనే సాగు

హైదరాబాద్, జూలై 10, తెలంగాణలో రుతుపవనాల నిరాశతో వానాకాలం పంటల సాగు తీవ్రంగా మందగించింది. రాష్ట్రంలోని 16 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదు కాగా.. వరి సాగు చేస్తున్న వారి సంఖ్య చాలా తగ్గిపోయింది. ఇప్పటి వరకు కేవలం 6.40 శాతం మాత్రమే అంటే 4.22 లక్షల ఎకరాల్లో మాత్రమే వరి సాగు చేపట్టారు. రాష్ట్రంలోని మొత్తం సాగు విస్తీర్ణంలో ఇప్పటి వరకు కేవలం 41.79 శాతం మేరకే అన్ని రకాల పంటలు సాగైనట్లు వ్యవసాయశాఖ బుధవారం ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో తెలిపింది. తెలంగాణ రాష్ట్రంలో వానాకాలం సీజన్ ప్రారంభమై దాదాపు 38 రోజులు గడుస్తున్నా.. ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. రాష్ట్రంలోని 16 జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనగా.. మిగిలిన 17 జిల్లాల్లో కేవలం సాధారణ వర్షపాతమే నమోదైనట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ వెల్లడించింది. ఈ వానాకాలం సీజన్ సాగు పరిస్థితులపై వ్యవసాయశాఖ బుధవారం ప్రభుత్వానికి ఒక సమగ్ర నివేదికను సమర్పించింది. ఈ నివేదిక ప్రకారం.. రాష్ట్రంలో ప్రధాన పంట అయిన వరి సాగు తీవ్రంగా మందగించగా.. ఇతర పంటల సాగు కూడా లక్ష్యానికి చాలా వెనుకబడి ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో ప్రస్తుత వానాకాలం సీజన్‌లో మొత్తం 65,95,645 ఎకరాల్లో వరి సాగు చేయాలని వ్యవసాయశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. అయితే వర్షాలు ముఖం చాటేయడంతో ఇప్పటి వరకు కేవలం 4,22,340 ఎకరాల్లో మాత్రమే (అంటే 6.40 శాతం) నాట్లు పడ్డాయి. నీటి వనరులు సరిగ్గా లేకపోవడం, సకాలంలో రుతుపవనాలు ఊపందుకోకపోవడంతో అన్నదాతలు వరి నాట్లు వేయడానికి వెనుకడుగు వేస్తున్నారు. వరితో పాటు రాష్ట్రంలో అన్ని రకాల పంటల అంటే పత్తి, మొక్కజొన్న, పప్పు ధాన్యాలు వంటి సాగును పరిశీలిస్తే.. మొత్తం సాధారణ సాగు విస్తీర్ణం 1,32,38,446 ఎకరాలుగా అంచనా వేశారు. కానీ నివేదిక ప్రకారం ఇప్పటి వరకు కేవలం 55,31,812 ఎకరాల్లో (41.79 శాతం) మాత్రమే విత్తనాలు నాటడం లేదా పంటలు వేయడం పూర్తయింది. అంటే సగానికి పైగా సాగు భూములు ఇంకా బీడుగానే ఉన్నాయి. వ్యవసాయశాఖ గణాంకాల ప్రకారం.. జూలై నెలలో సగటున 47.6 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా కేవలం 39.9 మి.మీ. మాత్రమే నమోదైంది. ఇది సాధారణం కంటే 16 శాతం తక్కువ. అలాగే జూన్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు మొత్తంగా 177.9 మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. 154.9 మి.మీ. మాత్రమే కురిసింది. ఇది సీజన్ సగటు కంటే 13 శాతం లోటుగా రికార్డయింది.

లోటు వర్షపాతం ఉన్న 16 జిల్లాలివే..!

లోటు వర్షాపాతం ఉన్న 16 జిల్లాల్లో.. ఆదిలాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, కరీంనగర్, జగిత్యాల, వరంగల్, హనుమకొండ, జనగామ, వికారాబాద్, మేడ్చల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగులాంబ గద్వాల, వనపర్తి, యాదాద్రి భువనగిరి, హైదరాబాద్ ఉన్నాయి. అయితే వర్షాల కొరత కారణంగా జిల్లాల వారీగా సాగు విస్తీర్ణంలో భారీ వ్యత్యాసాలు కనిపిస్తున్నాయి. కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మెదక్, సిద్దిపేట, మహబూబాబాద్, ములుగు, మేడ్చల్, వనపర్తి, సూర్యాపేట జిల్లాల్లో పంటల సాగు 25 శాతం కూడా దాటలేదు. ఇక నిర్మల్, నిజామాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, నారాయణపేట జిల్లాల్లో కొంతవరకు పరవాలేదనేలా 51 శాతం మేర సాగు పనులు జరిగాయి. వర్షాలు కొంత అనుకూలించిన ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో గరిష్టంగా 75 శాతం విస్తీర్ణంలో సాగు చేపట్టారు. రాబోయే రోజుల్లో అయినా భారీ వర్షాలు కురిస్తేనే వరి నాట్లు ఊపందుకునే అవకాశం ఉందని.. లేనిపక్షంలో సాగు విస్తీర్ణం మరింత తగ్గి దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# వాటర్ వార్....

హైదరాబాద్, జూలై 10, తెలంగాణ రాజకీయాల్లో మరోసారి గోదావరి ఉరకలెత్తుతోంది. అయితే, ఈసారి నదిలో ప్రవహిస్తున్న వరద నీటి కంటే, కాళేశ్వరం ప్రాజెక్టు చుట్టూ సాగుతున్న రాజకీయ వేడే ఎక్కువగా కనిపిస్తోంది. గోదావరిలో నీరు పుష్కలంగా ఉన్న తరుణంలో మోటార్లు ఆన్ చేసి నీటిని ఎత్తిపోయాలని ప్రతిపక్ష బీఆర్ఎస్ డిమాండ్ చేస్తుంటే.. ఇప్పుడు గనుక పంపులు ఆన్ చేస్తే ప్రాజెక్టు బ్యారేజీలే కుప్పకూలుతాయని అధికార కాంగ్రెస్ హెచ్చరిస్తోంది. ఈ ప్రచార యుద్ధం వెనుక అసలు నిజాలేంటి? సాంకేతిక నివేదికలు ఏం చెబుతున్నాయి?బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావుల ప్రధాన వాదన ప్రకారం.. కాళేశ్వరం ప్రాజెక్టులోని పంప్ హౌస్‌లు, బాహుబలి మోటార్లు అన్నీ సురక్షితంగా ఉన్నాయి. కేవలం కొన్ని బ్యారేజీల పిల్లర్లు మాత్రమే దెబ్బతిన్నాయి. వరద నీరు వృథాగా సముద్రం పాలు కాకుండా, పంపింగ్ సిస్టమ్‌ను తక్షణమే ఉపయోగించి మిడ్ మానేరు, లోయర్ మానేరు వంటి ప్రధాన రిజర్వాయర్లను నింపాలని వారు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. గత ప్రభుత్వానికి ఎక్కడ మంచి పేరు వస్తుందోననే భయంతో, కావాలనే పొలిటికల్ మైలేజ్ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ఒక వృథ కట్టడంగా చిత్రించేందుకు కుట్ర చేస్తోందని బీఆర్ఎస్ శ్రేణులు సోషల్ మీడియా వేదికగా తీవ్ర ఆరోపణలు గుప్పిస్తున్నాయి. బీఆర్ఎస్ ఆరోపణలను కాంగ్రెస్ ప్రభుత్వం సాంకేతిక ఆధారాలతో తిప్పికొడుతోంది. పంప్ హౌస్‌లు బాగున్నాయన్నది నిజమే కావొచ్చు, కానీ వాటికి నీటిని అందించాల్సిన మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల పునాదులు కదిలిపోయాయన్నది నగ్న సత్యమని ప్రభుత్వం గుర్తు చేస్తోంది. దీనికి జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇచ్చిన గైడ్‌లైన్స్, మధ్యంతర నివేదికలను చూపిస్తోంది. గత ఏడాది మేడిగడ్డ బ్యారేజ్ పిల్లర్లు కుంగిపోవడం, అన్నారం బ్యారేజీలో ఊటలు రావడం వంటి తీవ్రమైన ఘటనల తర్వాత ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ రంగంలోకి దిగింది. పూర్తిస్థాయిలో మరమ్మతులు జరగకుండా, పునాదుల కింద గ్రౌటింగ్ పూర్తికాకుండా బ్యారేజీలలో నీటిని నిల్వ ఉంచడం అత్యంత ప్రమాదకరమని ఆ కమిటీ స్పష్టం చేసింది. ఒకవేళ బలవంతంగా నీటిని నిల్వ ఉంచితే ఏర్పడే 'హైడ్రోస్టాటిక్ ప్రెజర్' కారణంగా మిగిలిన పిల్లర్లు కూడా కొట్టుకుపోయే ప్రమాదం ఉందని హెచ్చరించింది. బ్యారేజీలో నీరు నిలిస్తేనే పంపుల ద్వారా ఎత్తిపోయడం సాధ్యమవుతుంది. కాబట్టి, పునాదులే కదిలిన చోట నీటిని నిల్వ చేసి, పంపింగ్ చేయాలని చూడడం ఆత్మహత్యాసదృశ్యమేనని అధికార పక్షం వాదిస్తోంది. ఈ ప్రచార యుద్ధానికి తెరదించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్షానికి ఒక బహిరంగ సవాల్ విసిరారు. కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ లోపాలు, అడ్డగోలు ఖర్చులు, ప్రస్తుత దుస్థితిపై అసెంబ్లీ వేదికగా సుదీర్ఘమైన లైవ్ చర్చకు రావాలని సవాల్ చేశారు. జ్యుడీషియల్ ఎంక్వైరీ వివరాలు, సాంకేతిక తప్పిదాలను ప్రజల ముందు ఉంచి.. రీ-డిజైనింగ్ పేరిట జరిగిన వేల కోట్ల రూపాయల వ్యయం వెనుక ఉన్న అసలు నిజాలను నిరూపించాలని కాంగ్రెస్ వ్యూహాలు రచిస్తోంది. ఈ సవాల్‌పై హరీష్ రావు సానుకూలంగానే స్పందించినప్పటికీ, గతంలో కాళేశ్వరంపై జరిగిన లఘు చర్చలకు గులాబీ బాస్ కేసీఆర్ హాజరుకాలేదు. ఒకవేళ ఈసారి అసెంబ్లీలో గనుక పూర్తిస్థాయి పోరు జరిగితే, అది ఉభయ పార్టీలకు ప్రతిష్టాత్మకమైన 'చావో రేవో' లాంటి పరిస్థితిగా మారుతుంది. తాము నిర్మించిన ప్రాజెక్టును కాంగ్రెస్ చేతకానితనంతోనే వదిలేసిందని నిరూపించాలని బీఆర్ఎస్.. లేదు ఇది కేవలం 'కమీషన్ల స్కామ్' మాత్రమేనని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కాంగ్రెస్ భావిస్తున్నాయి. సోషల్ మీడియా వేదికగా సాగే ట్వీట్లు, కౌంటర్ ట్వీట్ల పొలిటికల్ డ్రామా వల్ల తెలంగాణ రైతులకు ఎలాంటి ప్రయోజనం లేదు. అసెంబ్లీ సాక్షిగా, నిపుణుల సమక్షంలో పారదర్శకమైన చర్చ జరిగి, ఎన్డీఎస్ఏ నివేదికలోని సాంకేతిక అంశాలు ప్రజల ముందుకు వచ్చినప్పుడే.. వేల కోట్లతో నిర్మించిన ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు భవిష్యత్తుపై ఒక స్పష్టత వస్తుంది.

## అందుబాటులోకి రానున్న కోచ్ ఫ్యాక్టరీ

వరంగల్, జూలై 10, హనుమకొండ జిల్లా కాజీపేట మండలం అయోధ్యపురంలో నూతనంగా నిర్మించిన రైల్వే కోచ్ ఫ్యాక్టరీ త్వరలోనే అందుబాటులోకి రానుంది. ఈ ఫ్యాక్టరీలో అతి త్వరలోనే ఉత్పత్తి పనులను ప్రారంభిస్తామని, భవిష్యత్తులో దేశ అవసరాలకు తగ్గట్టుగా సరికొత్త నూతన తరం కోచ్‌లను ఇక్కడే తయారు చేస్తామని రైల్వే బోర్డు ఛైర్మన్, సీఈవో సతీశ్ కుమార్ స్పష్టం చేశారు. అయోధ్యపురంలోని రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ ప్రాంగణమంతా కలియతిరిగిన ఉన్నతాధికారుల బృందానికి, నిర్మాణ ప్రగతి, షెడ్ల ఏర్పాటు, మౌలిక వసతుల కల్పనపై అధికారులు రైల్వే బోర్డు ఛైర్మన్‌కు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పూర్తి స్థాయి వివరాలను వివరించారు. అనంతరం సతీశ్ కుమార్ విలేకరులతో మాట్లాడుతూ.. కాజీపేట ఆర్ఎంయూలో విభిన్న రకాల రైల్వే కోచ్‌ల తయారీకి, వ్యాగన్ల మరమ్మతులకు అవసరమైన అన్ని రకాల అత్యాధునిక భారీ యంత్రాలు, సాంకేతిక ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ ఫ్యాక్టరీ ద్వారా స్థానిక యువతకు లభించే ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనపై తాము ప్రత్యేక దృష్టి సారించామని దీనిపై స్థానిక అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహిస్తామని ఆయన హామీ ఇచ్చారు. దేశీయంగా రైల్వే మౌలిక సదుపాయాల బలోపేతంలో కాజీపేట యూనిట్ భవిష్యత్తులో కీలక పాత్ర పోషించనుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో భాగంగా సౌత్, నార్త్ ఇండియాలను అనుసంధానించే కీలక జంక్షన్ అయిన కాజీపేట రైల్వేస్టేషన్‌ను కూడా సతీశ్‌కుమార్ సందర్శించారు. అక్కడ ప్రయాణికులకు అందుబాటులో ఉన్న కనీస వసతులు, ప్లాట్‌ఫారాల నిర్వహణను అడిగి తెలుసుకున్నారు.

# ఆదాయంలో శేరిలింగంపల్లి టాప్.....

హైదరాబాద్, జూలై 10, తెలంగాణను 'ఎగువ మధ్య-ఆదాయ'ఆర్థిక వ్యవస్థగా ప్రపంచ బ్యాంక్ గుర్తించడం బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దార్శనిక నాయకత్వానికి, పరిపాలనా దక్షతకు దక్కిన అంతర్జాతీయ స్థాయి గుర్తింపు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తాజా గుర్తింపును ప్రస్తావిస్తూ.. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను 5,407 అమెరికన్ డాలర్ల తలసరి ఆదాయంతో తెలంగాణ.. ప్రపంచ బ్యాంక్ ఎగువ మధ్య-ఆదాయ కేటగిరీలో చేరిందని, ఈ మైలురాయిని సాధించిన ఐదు భారతీయ రాష్ట్రాల్లో ఒకటిగా నిలిచిందని కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో గత దశాబ్ద కాలంలో తెలంగాణ సాధించిన అసాధారణ ఆర్థిక పరివర్తనకు ఈ విశేష విజయమే అద్దం పడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పుకొచ్చారు. తెలంగాణ ఆర్థిక పరివర్తనను ప్రపంచ బ్యాంకు సైతం ధృవీకరించడం కేవలం ఒక గణాంక విజయం మాత్రమే కాదని, కేసీఆర్ దార్శనికత, నిబద్ధత, పాలనా నమూనాకు దక్కిన అంతర్జాతీయ గుర్తింపు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. రాష్ట్ర ఆవిర్భావానికి ముందు దశాబ్దాల తరబడి నిర్లక్ష్యానికి గురైన తెలంగాణ, కేవలం పదేళ్ల వ్యవధిలోనే తన ఆర్థిక తలరాతను తిరగరాసుకుని భారతదేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న, సంపన్న రాష్ట్రాల్లో ఒకటిగా అవతరించిందని కేటీఆర్ గుర్తు చేశారు. పారిశ్రామికంగా, ఆర్థికంగా సుదీర్ఘకాలం పాటు అనుకూలతలు ఉన్న ఇతర రాష్ట్రాల వలె కాకుండా, దార్శనిక నాయకత్వం, సాహసోపేతమైన సంస్కరణలు, వినూత్న పాలన ద్వారానే తెలంగాణ ఈ మైలురాయిని చేరుకుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. 'పారిశ్రామిక అనుమతుల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చి అపూర్వమైన పెట్టుబడులను ఆకర్షించిన టీఎస్-ఐపాస్ తో పాటు, కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ కాకతీయ, రైతుబంధు వంటి ప్రతిష్టాత్మక పథకాలు రాష్ట్రవ్యాప్తంగా సమ్మిళిత వృద్ధికి, వ్యవసాయాభివృద్ధికి, పారిశ్రామిక విస్తరణకు, మెరుగైన ఉపాధికి బలమైన పునాది వేశాయి'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వివరించారు. యథాతథ స్థితిని సవాల్ చేయడానికి ఒక సంస్కర్త, అపూర్వమైన ఫలితాలను అందించడానికి ఒక కార్యదక్షుడు, ఒక రాష్ట్ర తలరాతను పూర్తిగా మార్చివేయడానికి ఒక నిజమైన మార్గదర్శి అవసరమని, ఈ లక్షణాలే కేసీఆర్ పాలనను నిర్వచిస్తాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొనియాడారు. తెలంగాణ అభివృద్ధి నమూనా ప్రపంచస్థాయి విశ్వసనీయతను సంపాదించుకుంది అనడానికి ప్రపంచ బ్యాంకు గుర్తింపే మరో నిదర్శనమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఉద్ఘాటించారు. ఎన్నికల హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి తెలంగాణను దివాలా తీసిన రాష్ట్రంగా చిత్రించడాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే మానుకోవాలని కేటీఆర్ హితవు పలికారు. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉందంటూ పదేపదే తప్పుడు చిత్రాన్ని చూపేందుకు చేస్తున్న ప్రయత్నాలు, అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ఆర్థిక సూచీల సాక్షిగా పూర్తిగా బట్టబయలు అయ్యాయని కేటీఆర్ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పాలనలో సృష్టించబడిన బలమైన ఆర్థిక పునాదిపై నిర్మితమైన రాష్ట్రం తెలంగాణ అని ప్రపంచ బ్యాంక్ గుర్తింపు మరోసారి నిరూపించిందని కేటీఆర్ నొక్కిచెప్పారు. దార్శనికత, పనితీరుతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించిన ప్రభుత్వానికి, తప్పుడు ప్రచారాలతో తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవాలని చూస్తున్న ప్రభుత్వానికి మధ్య ఉన్న వ్యత్యాసం తెలంగాణ ప్రజలకు పూర్తి స్థాయిలో తెలుసునని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు.

# వడివడిగా మూసి ప్రక్షాళన అడుగులు

హైదరాబాద్, జూలై 10, హైదరాబాద్ రూపురేఖలను మార్చే ప్రతిష్టాత్మక మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రాజెక్టు తొలి విడత పనుల కోసం రూ.7,345.12 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులలో ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ నుంచి రూ.4,500 కోట్ల రుణం తీసుకోనుండగా.. మిగిలిన రూ.2,845.12 కోట్లను రాష్ట్ర ప్రభుత్వమే గ్రాంట్ రూపంలో భరించనుంది. ఈ బడ్జెట్‌లో భూసేకరణ ఖర్చులను మినహాయించారు. ఈ పనులను ఈపీసీ విధానంలో చేపట్టనున్నారు. హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ నగరాల సరసన నిలిపేందుకు తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టులో కీలక ముందడుగు పడింది. ఈ మెగా ప్రాజెక్టు పరిధిలోని ప్రాధాన్యతా ప్రాంతాల అభివృద్ధి కోసం రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ రూ.7,345.12 కోట్ల భారీ బడ్జెట్‌కు పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో సుదీర్ఘ కాలంగా ప్రతిపాదనల దశలో ఉన్న మూసీ సుందరీకరణ, పునరుజ్జీవన పనులు త్వరలోనే క్షేత్రస్థాయిలో వేగవంతం కానున్నాయి. అయితే, ఈ కేటాయించిన నిధులలో కేవలం అభివృద్ధి పనుల వ్యయం మాత్రమే ఉందని భూసేకరణ ఖర్చులను ఇందులో చేర్చలేదని అధికారులు స్పష్టం చేశారు. భూసేకరణకు సంబంధించిన నిధులను ప్రభుత్వం విడిగా కేటాయించనుంది. ఈ భారీ ప్రాజెక్టు మొదటి విడతలో భాగంగా జోన్-1ం, జోన్-1ః పరిధిలోని ప్రాంతాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దనున్నారు. జోన్-1ం కింద హిమాయత్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు ఉన్న నదీ తీరాన్ని, అలాగే జోన్-1ః కింద ఉస్మాన్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు ఉన్న పరివాహక ప్రాంతాలను అనుసంధానిస్తూ అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. నదిలోకి మురుగునీరు చేరకుండా అడ్డుకట్ట వేయడం, నదీ తీరాల వెంబడి పచ్చదనం పెంపొందించడం, పర్యాటక ప్రాంతాలుగా మలచడం, అవసరమైన మౌలిక వసతుల కల్పన ఈ పనుల్లో ప్రధాన భాగం కానున్నాయి. హైదరాబాదీయులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించడమే లక్ష్యంగా ఈ జోన్లను ముస్తాబు చేయనున్నారు. ఈ మెగా ప్రాజెక్టుకు అవసరమయ్యే భారీ ఆర్థిక వనరులను సమకూర్చుకునేందుకు ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేసింది. మొత్తం రూ.7,345.12 కోట్ల అంచనా వ్యయంలో సింహభాగాన్ని అంతర్జాతీయ సంస్థల నుంచి సేకరిస్తోంది. దీని కోసం ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ నుంచి రూ.4,500 కోట్ల భారీ రుణాన్ని తీసుకోనున్నారు. ఈ మేరకు సంప్రదింపులు తుది దశకు చేరాయి. ఇక మిగిలిన రూ.2,845.12 కోట్ల నిధులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమే బడ్జెట్ నుంచి గ్రాంట్ రూపంలో స్వయంగా భరించనుంది. ఈ నిధుల సమీకరణతో ప్రాజెక్టుకు ఎలాంటి ఆర్థిక అడ్డంకులు లేకుండా పనులు సాఫీగా సాగడానికి మార్గం సుగమమైంది. ప్రాజెక్టు నిర్మాణంలో పారదర్శకత, వేగం పెంచేందుకు గాను ఈ పనులను పూర్తిగా ఈపీసీ మోడ్‌లో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విధానం వల్ల కాంట్రాక్ట్ పొందిన సంస్థే డిజైనింగ్, మెటీరియల్ సేకరణ, నిర్మాణ బాధ్యతలను సకాలంలో పూర్తి చేయాల్సి ఉంటుంది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీతో పాటు అర్బన్ డెవలప్‌మెంట్ విభాగం సంయుక్తంగా ఈ పనుల టెండర్లు, తదుపరి చర్యలను పర్యవేక్షించనున్నాయి. రాబోయే రోజుల్లో మూసీ నది సరికొత్త రూపురేఖలతో హైదరాబాద్‌కే ప్రధాన ఆకర్షణగా నిలవబోతోంది.

## ఉచిత పథకాలకు కోర్టు బ్రేక్

హైదరాబాద్, జూలై 10, తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'కల్యాణ లక్ష్మి', 'షాదీ ముబారక్' పథకాలు ఇప్పుడు న్యాయపరమైన చిక్కుల్లో పడ్డాయి. నిరుపేద కుటుంబాల్లోని ఆడపిల్లల పెళ్లిళ్లకు ఆర్థిక సాయం అందించే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఈ పథకాల చట్టబద్ధతపై తెలంగాణ హైకోర్టు తీవ్ర సందేహాలను, అభ్యంతరాలను వ్యక్తం చేసింది. అసెంబ్లీ ఆమోదం లేకుండా, కేవలం ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా వందల, వేల కోట్ల ప్రజాధనాన్ని ఏ విధంగా పంపిణీ చేస్తారని న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ నిలదీశారు. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ నోటీసులు జారీ చేశారు. న్యాయవాది విజయ్ గోపాల్ దాఖలు చేసిన రిట్ పిటిషన్ ఆధారంగా ఈ విచారణ సాగింది. చట్టసభ ఆమోదం లేకుండా కేవలం 8 జీవోల ఆధారంగా ప్రజాధనాన్ని ఉచిత పథకాలకు మళ్లించడం రాజ్యాంగ విరుద్ధమని పిటిషనర్ కోర్టుకు నివేదించారు. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 245, 246ల ఉల్లంఘన కిందికే వస్తుందని వాదించారు. చట్టపరమైన నిబంధనలు, శాసనసభ పర్యవేక్షణ లేకుండా ఇంత పెద్ద ఎత్తున నిధులను కేటాయించడం ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధమని పేర్కొంటూ, ఈ పథకాలకు సంబంధించిన జీవోలను రద్దు చేయాలని కోరారు. ఈ పిటిషన్ విచారణ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ప్రభుత్వ ప్రాధాన్యతలపై హైకోర్టు చేసిన వ్యాఖ్యలు రాజకీయ, సామాజిక వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ఒకవైపు రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోతోందని, నిధుల సమీకరణ కోసం ప్రభుత్వ భూములను విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని కోర్టు గుర్తు చేసింది. మరోవైపు ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు సకాలంలో అందడం లేదని, కాంట్రాక్టర్ల బిల్లులు, భూసేకరణకు సంబంధించిన పరిహారాలు భారీగా పెండింగ్‌లో ఉన్నాయని న్యాయస్థానం ఎత్తిచూపింది. రాష్ట్రం అప్పుల్లో ఉండి, కనీస చెల్లింపులు చేయలేని పరిస్థితుల్లో ఈ ఉచిత పథకాలను ఎవరు అడిగారు?" అని కోర్టు ఘాటుగా ప్రశ్నించింది. ప్రభుత్వం వద్ద అదనపు నిధులు, మిగులు బడ్జెట్ ఉంటే సంక్షేమ పథకాలు లేదా ఉచితాలు ఇవ్వడంలో తప్పు లేదని, కానీ ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో చెల్లింపుల విషయంలో ప్రభుత్వానికి సరైన ప్రాధాన్యత ఉండాలని కోర్టు హితవు పలికింది. 2014లో ప్రారంభమైన ఈ పథకాల కింద ప్రభుత్వం ఇప్పటివరకు రూ. 13,484 కోట్లు ఖర్చు చేసినట్లు పిటిషనర్ కోర్టు దృష్టికి తెచ్చారు. ఇంత భారీ మొత్తాన్ని వెచ్చిస్తున్నప్పటికీ, పర్యవేక్షణ లోపం వల్ల అనర్హుల చేతుల్లోకి నిధులు వెళ్తున్నాయని ఆరోపించారు. కాగ్ నివేదికల ప్రకారం.. సుమారు రూ. 90 కోట్లు అనర్హుల పాలయ్యాయని కోర్టుకు సమర్పించిన నివేదికల్లో పేర్కొన్నారు. అయితే, ప్రభుత్వ తరఫున వాదనలు వినిపించిన అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్ ఖాన్ ఈ వాదనలను తోసిపుచ్చారు. నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచే సామాజిక బాధ్యతతోనే ప్రభుత్వం ఈ పథకాలను అమలు చేస్తోందని స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి స్థిరంగానే ఉందని, పేదల సంక్షేమాన్ని విస్మరించలేమని కోర్టుకు తెలిపారు. ఇరుపక్షాల వాదనలను విన్న హైకోర్టు, ఈ పథకాలపై తక్షణ స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. అయితే, దీనిపై సమగ్ర వివరణ ఇవ్వడానికి ప్రభుత్వానికి నాలుగు వారాల గడువు ఇచ్చింది. తదుపరి విచారణను ఆగస్టు 5కి వాయిదా వేసింది. ఎన్నికల్లో లబ్ధి పొందడమే లక్ష్యంగా రాజకీయ పార్టీలు ఉచిత పథకాలను ఎరగా వేస్తున్నాయనే విమర్శలు వ్యూహాత్మకంగా వినిపిస్తున్న తరుణంలో, హైకోర్టు ఈ అంశాన్ని చట్టబద్ధత కోణంలో ప్రశ్నించడం అత్యంత ప్రాధాన్యతను సంతరింపజేసుకుంది. మరి ప్రభుత్వం చట్టసభ ఆమోదం అంశంపై న్యాయస్థానానికి ఎలాంటి వివరణ ఇస్తుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## బహుజన రాజ్యాధికారం సాధించడానికి అన్ని బీసీ కులాలు ముందుకు రావాలి.. బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్ పిలుపు

### బీసీ ఐక్యవేదికకు మద్దతు తెలిపిన నాయి బ్రాహ్మణ సంఘం



**శేరిలింగంపల్లి.. ప్రజాబలం ప్రతినిధి నరేష్ జూలై 10**బహుజన రాజ్యాధికారం సాధించటానికిబీసీ కులాల, బీసీ సంఘాల నాయకులను గత నెల నుండి కలిసి ఐక్యత పెంచేందుకు, బహుజనులకు రాజ్యాధికారం సాధనకై కృషి చేయాలనేదే బీసీ ఐక్యవేదిక ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నదని బీసీ కుల సంఘాల ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్ పేర్కొన్నారు. బీసీ కులాలన్నిటికీ మరియు ముఖ్య నాయకులను బేరి రామచందర్ యాదవ్ కలిసి పోరాటాలను పిలుపునిస్తూ ముందుకు రావాలని కోరారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల సంఘాల నాయకులను కలిసే క్రమంలో శేరిలింగంపల్లి నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు మంగలి సాయిలు నాయి బ్రాహ్మణ కార్యవర్గ నాయకులను కలవడం జరిగింది. చర్చల సందర్భంగా నాయి బ్రాహ్మణ సంఘం కార్యవర్గం మొత్తం బీసీ కులాల సంఘాలకు ఐక్య వేదికకు పూర్తి మద్దతు తెలిపడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అన్ని కుల సంఘాల నాయకులతో కలిసి చర్చించడం జరుగుతుందని అన్ని కుల సంఘాల నాయకుల మద్దతుతో అధికారం సాధిస్తామని అన్నారు. ముదిరాజ్, యాదవ్, పద్మశాలి ,గౌడ్స్ మున్నూరు కాపు సంఘాలను కలవడం జరుగుతుందని, ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో కొన్ని కులాలకు ఇప్పటికీ కూడా గుర్తింపు లేకుండా పోయిందనీ, రోడ్లపైనే ఉండటానికి ఇల్లు లేక జీవనాధారం లేక బ్రతుకు ఈడుస్తున్నారని అని పేర్కొన్నారు. కనీసం కులంపేరు కూడా చెప్పుకోలేని స్థితిలో కొన్ని కులాలు బాధపడుతున్నాయని అన్నారు. మరి రాష్ట్రంలో కులాల దామాషా పద్ధతిన ఎవరికి రావాల్సిన వాటా వారికి అందాలని అన్నారు. విద్యతో సహా వైద్యం, ఉద్యోగం, సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కావాలని బీసీలు మేమెంతో మాకంత విద్యా ఉద్యోగ రంగాలలో రాజకీయ రంగాలలో సమాన హక్కులు కల్పనపై అందరూ కలిసి పోరాటం చేద్దాం అన్నారు. ఈ పోరాటంలో అన్ని కుల సంఘాలు అందరు నాయకులు బీసీ కులాల ఐక్యవేదికకు పూర్తి మద్దతు తెలిపడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ తో పాటు సాయన్న ముదిరాజ్, ఆర్గనైజర్ సెక్రెటరీ హరికృష్ణ చారి, యువజన సంఘం అధ్యక్షులు కుమార్ యాదవ్, సాయి కురుమ, రాజు గౌడ్, పద్మశాలి అశోక్, కిరణ్ ముదిరాజ్, రజక సంఘం మల్లేష్, పెద్దలు యువత అందరికి రాజ్యాధికారం కోసం చర్చించారు. అన్ని కుల సంఘాల నాయకులు బేరి రామచందర్ యాదవ్ ఫోన్ నెంబర్ సంప్రదించవలసిన 89 78 99 98 96,

## ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ను కలిసిన సిఎంఓఏఐ అర్జీ 1 అధికారులు



**పెద్దపల్లి/గోదావరిఖని, జులై-10, ప్రజాబలం ప్రతినిధి :**అర్జీ 1 ఏరియాకు చెందిన సింగరేణి అధికారులు శుక్రవారం రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్ ను కలిసి సమస్యలపై వినతి పత్రం సమర్పించారు.

లి ప్రధాన డిమాండ్లు :

1. కోల్ ఇండియాతో సమానంగా సింగరేణి అధికారులకు పే అప్‌గ్రేడేషన్ అమలు చేయడం
2. గత 3 సంవత్సరాల పీఆర్పీ బకాయిలను వెంటనే విడుదల చేయడం
3. ఇతర అలవెన్సులు వర్తింపజేయడం

అధికారులు తమ సమస్యలను ఎమ్మెల్యే కు వివరించారు. వినతిని సానుకూలంగా స్వీకరించిన ఎమ్మెల్యే వెంటనే సింగరేణి సిఅండ్ఎండీ తో ఫోన్ లో మాట్లాడారు. అంతేకాకుండా ఈ అంశంపై ముఖ్యమంత్రి మరియు ఉపముఖ్యమంత్రి తో నేరుగా మాట్లాడి త్వరలోనే అధికారులకు మంచి శుభవార్త ఉంటుందని ఎమ్మెల్యే సింగరేణి అధికారులకు హామీ ఇచ్చారు. అధికారుల సమస్యల పట్ల స్పందించి తక్షణమే చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చిన ఎమ్మెల్యే కు జమీూా× =+-1 ఏరియా అధికారుల తరపున సిఎంఓఏఐ నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు అపెక్స్ వైస్ ప్రెసిడెంట్ చిలుక శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ పెరుమాళ్ల శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ కోల మల్లేశం, జాయింట్ సెక్రటరీ డీఆర్.రావుల దామోదర్, బీసీ సెంట్రల్ ప్రెసిడెంట్ ధీటి చంద్రమౌళి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రైతు భరోసా ఆశీర్వాద సభను వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు.



**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జులై 10**బిముఖ్యమంత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు భరోసా ఆశీర్వాద సభను ఏటూరునాగారం రైతు వేదికలో ఏర్పాటు చేసిన ప్రత్యక్ష ప్రసారం ద్వారా ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు, ఏటూరునాగారం డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ కర్ల అరుణ, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు కలిసి వీక్షించారు.

బిఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ కేవలం తొమ్మిది రోజుల్లోనే రూ.9,000 కోట్ల రైతు భరోసా నిధులను విడుదల చేసి 73 లక్షల 30 వేల మంది రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. అలాగే 1 కోటి 51 లక్షల ఎకరాలకు పెట్టుబడి సాయం అందించగా, ఇప్పటివరకు రైతు భరోసా పథకం కింద మొత్తం రూ.36,321 కోట్ల పెట్టుబడి సహాయం రైతులకు అందించినట్లు సభలో వెల్లడించారు..




ఈ కార్యక్రమంలో మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు చేల వినయ్ కుమార్, పీఎసీఎస్ డైరెక్టర్ వంగపండ్ల రవి, వ్యవసాయ శాఖ అధికారి (ఏవో) వేణుగోపాల్, వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏ ఈ ఓ) రవికుమార్, వార్డ్ ఉమ్మగాని రమేష్,రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కవిత టార్గెట్ కేటీఆర్...

హైదరాబాద్, జూలై 10, తెలంగాణ రాజకీయాల్లో మరోసారి పెను సంచలనం రేగింది. బీఆర్ఎస్ పార్టీ అధినాయకత్వం, దాని అనుబంధ సోషల్ మీడియా వైఖరిపై టీఆర్ఎస్ చీఫ్ కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గులాబీ పార్టీ ఖాతాలో ఉన్న రూ.1400 కోట్ల భారీ నిధుల వెనుక క్విడ్ ప్రో కో అవినీతి దాగి ఉందంటూ ఆమె చేసిన ఆరోపణలు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ సొమ్మును తక్షణమే తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు ఒక్కొక్కరికి కోటి రూపాయల చొప్పున పంపిణీ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. తన రాజకీయ ప్రస్థానంలో ఎన్నడూ వ్యక్తిగత విమర్శలకు పోలేదని స్పష్టం చేస్తూనే, బీఆర్ఎస్ విధానాలపై విమర్శల పర్వాన్ని ఎక్కుపెట్టారు.తాను మళ్లీ బీఆర్ఎస్ గూటికి చేరుకుంటానంటూ కొందరు పనిగట్టుకుని చేస్తున్న ప్రచారాన్ని కవిత పూర్తిగా ఖండించారు. "నా కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు మళ్లీ బీఆర్ఎస్‌లోకి వెళ్లే ప్రసక్తే లేదు" అని ఆమె తేల్చి చెప్పారు. ఒక మహిళ ఒంటరిగా ప్రజాబలంతో ముందుకు సాగుతుంటే ఓర్వలేక, కాంగ్రెస్, బీజేపీలతో చేతులు కలిపి తన ప్రజా పోరాటాలను అణచివేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. చివరికి టీఆర్ఎస్ అనే పేరు కూడా తనకు దక్కకుండా చేసేందుకు ఏకంగా ఎన్నికల సంఘానికి వెయ్యికి పైగా ఫిర్యాదులు పంపడం బీఆర్ఎస్ భయాందోళనలకు నిదర్శనమని ఎద్దేవా చేశారు.బీఆర్ఎస్ అగ్రనేతలను టార్గెట్ చేస్తూ కవిత ఘాటు విమర్శలు చేశారు. కాళేశ్వరం అవినీతిలో అనకొండ లాంటి హరీశ్‌రావును బీఆర్ఎస్ ఇంకా ముందు పెట్టడం చూస్తుంటే, ఆ పార్టీ భవిష్యత్తు శూన్యమని అర్థమవుతోందని వ్యాఖ్యానించారు. అలాగే కేటీఆర్ తన మిత్రుడు ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్‌కు క్విడ్ ప్రో కో పద్ధతిలో అక్రమ పర్మిషన్లు ఇచ్చారని, ఇటీవల రూ. 188 కోట్లు వెచ్చించి 'పయనీర్' అనే ఇంగ్లీష్ పేపర్‌ను కొనుగోలు చేశారని ఆరోపించారు. డబ్బు బలంతో మీడియా, సోషల్ మీడియాలను గుప్పిట్లో పెట్టుకుని, తమ వార్తలు బయటకు రాకుండా గుంటనక్కల్లా ఫోన్లు చేయిస్తూ అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జోడెద్దుల్లా పార్టీని నడపాల్సిన వారే బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తున్నారని ధ్వజమెత్తారు.సోషల్ మీడియా వేదికగా బీఆర్ఎస్ శ్రేణులు తల్లి, చెల్లె అనే కనీస సభ్యత మరచి ఇష్టానుసారంగా ట్రోలింగ్ చేస్తున్నారంటూ కవిత తీవ్రంగా ఫైర్ అయ్యారు. "సభ్యత మరిచి తిడితే ఊరుకునేందుకు ఇది ఆంధ్రా కాదు, కాళ్లు విరగొట్టి చేతుల్లో పెడతాం బిడ్డా" అంటూ ఘాటుగా హెచ్చరించారు. మరోవైపు ఫినిక్స్ సంస్థకు రూ. 80 వేల కోట్ల విలువైన భూములను కట్టబెట్టారని, అటవీ శాఖ పెట్టిన కేసులను కూడా పక్కనబెట్టేశారని ఆరోపించారు. అవినీతి విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం కిటికీలు తెరిస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా తలుపులు తెరిచిందని విమర్శించారు. కేవలం సీఎంపై కోపంతోనే కాళేశ్వరం నీళ్లను ఎత్తిపోయడం లేదని, చిన్న రాళ్ల కట్ట కడితే నీటిని వాడుకోవచ్చని సూచించారు.తెలంగాణ ఉద్యమ సమయంలో చిన్న కాంట్రాక్టర్లు, స్కూల్ యాజమాన్యాలు ఎంతో త్యాగం చేశాయని, తాను బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు కూడా కార్మికులు, ఉద్యమకారుల పక్షాన నిలబడి కొట్లాడానని కవిత గుర్తు చేసుకున్నారు. కానీ వారికి అక్కడ అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు అప్పనంగా అప్పగించిన భూములన్నింటిపై ఖచ్చితంగా రివ్యూ జరిపి, అవినీతి సొమ్మును కక్కిస్తామని హెచ్చరించారు. సింగరేణి కార్మికుల హక్కుల సాధన కోసం ఈ నెల 20వ తేదీ నుంచి నిరవధిక దీక్షకు దిగుతున్నట్లు ప్రకటించి, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ప్రజా అజెండా లేదని తేల్చి చెప్పారు.

## మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా బైరి ప్రశాంత్ గౌడ్

### ప్రశాంత్ గౌడ్ కు శుభాకాంక్షలు తెలిపిన పలువురు నేతలు



**శివ్వంపేట,ప్రజాబలం ప్రతినిధి (జులై 10) ప్రతినిధి :**-అధికార కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పలువురికి పదవులతో పాటు నియమిక పత్రాలు అందజేయడం జరిగింది. మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర జంగయ్య యాదవ్, చేతుల మీదుగా అదేవిధంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఇంచార్జ్ కొలను హనుమంత్ రెడ్డి, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి,సమక్షంలో నియామక పత్రాలు తీసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆర్ లక్ష్మి, అదే విధంగా పలు అధ్యక్షులు జిల్లా కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బైరి ప్రసాద్ గౌడ్,మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రతినిత్యం ప్రజలకు వివరిస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ ఈ రాష్ట్రంలో మరో 10 సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బైరి ప్రశాంత్ గౌడ్, స్పష్టం చేశారు.

## ఏపీలో ఎండ్ టు ఎండ్ పీసీబీ క్లస్టర్ నిర్మాణానికి సహకరించండి

### షిన్‌హ్యాప్ ఎలక్ట్రానిక్స్ ఛైర్మన్ టేహూ కిమ్ తో మంత్రి లోకేష్ భేటీ

సియోల్ (సౌత్ కొరియా): ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డుల (ఖఅః) తయారీలో పేరెన్నికగన్న షిన్‌హ్యాప్ ఎలక్ట్రానిక్స్ (ూష్ట్రతినిష్త్రఎబీజూ ఇశ్రీవఃఱbతీనీనితిఃఱబ అనీ., ఒbిట.) ఛైర్మన్ టేహూ కిమ్ (ఓతీ. ఝీవష్ట్రనీనీ ఖిఎ), ఇంజనీరింగ్ అడ్వైసివ్ (ఇం) షిబ్లీ అహమ్మద్ (ఓతీ. ూష్ట్రతిఎశ్రీఎ ంష్ట్రఎవట)లతో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సియోల్ లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... షిన్‌హ్యాప్ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల తయారీకి ఏపీని గమ్యస్థానంగా ఎంచుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. నాయుడుపేట వద్ద అభివృద్ధి చేసిన ఖఅః ఎకోసిస్టమ్ వద్ద సిర్మా, జెట్‌వర్క్, ఎపిటోమ్, సిప్సా టెక్ అనే నాలుగు కంపెనీలు తయారీ యూనిట్ల ఏర్పాటుకు ముందుకు వచ్చాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎండ్-టు-ఎండ్ ఖఅః క్లస్టర్ నిర్మాణానికి ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని కోరారు. షిన్‌హ్యాప్ ఎలక్ట్రానిక్స్ ఛైర్మన్ టేహూ కిమ్ మాట్లాడుతూ... భారతదేశంలో ఈవీ/ఆటో, హెల్త్‌కేర్, స్మార్ట్ మీటరింగ్ కోసం ఖఅఃలు, అఅఒ, ఇఓూ లు తయారుచేసే అతిపెద్ద ప్లాంట్ ను తిరుపతి జిల్లా నాయుడుపేటలో ఏర్పాటు చేయబోతున్నట్లు చెప్పారు. రూ.1,595 కోట్లతో ఏర్పాటు చేయబోతున్న ఈ ప్లాంట్ ద్వారా 2,170మందికి ఉద్యోగాలు లభిస్తాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ తాజా ప్రతిపాదనలపై సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని టేహూ కిమ్ తెలిపారు.

# జనసేన పార్టీలో చేరిన అడ్వకేట్ రవి వర్మ




**కూకట్పల్లి (ప్రజాబలం) జూలై 10:** శేరిలింగంపల్లి నియోజకవర్గం, హైదర్‌నగర్ డివిజన్ వెర్టెక్స్ ప్రైమ్ కు చెందిన న్యాయవాది రవి వర్మ, శుక్రవారం జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమక్షంలో హైదరాబాద్‌లో జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ పార్టీ కండువా కప్పి ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు.

ప్రజాసేవ, పారదర్శక పాలన, రాజ్యాంగ విలువల పరిరక్షణ, యువత సాధికారత వంటి అంశాల్లో జనసేన పార్టీ అవలంబిస్తున్న విధానాలు తనను ఆకర్షించాయని తెలిపారు. తెలంగాణలో పార్టీ అభివృద్ధికి, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానని, సమాజాభివృద్ధికి ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ వేదికగా చురుకుగా పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ జనసేన పార్టీ ఇంచార్జ్ శంకర్ గౌడ్, ఉపాధ్యక్షులు మహేందర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ రామ్ తాళ్లూరి, చేరికల కమిటీ సభ్యులు ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్, డా. గడల శ్రీనివాస్, ప్రజీత్ గౌడ్, తనీష్, సీనియర్ నాయకులు రాజ లింగం, రామ కృష్ణ, సాగర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు రవి వర్మకు స్వాగతం పలికి, పార్టీ బలోపేతానికి ఆయన సేవలు ఉపయోగపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఘనంగా AVOPA రాష్ట్ర అధ్యక్షులు మల్లిపెద్ది శంకర్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు శ్రీధర్ పుట్టినరోజు వేడుకలు




మణికొండలో AVOPA ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మల్లిపెద్ది శంకర్ మరియు రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బొడ్డు శ్రీధర్ గార్ల జన్మదినం మణికొండ లో గల వృద్ధాశ్రమంలో ఘనంగా నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భంగా AVOPA రాష్ట్ర అధ్యక్షులు మల్లిపెద్ది శంకర్ మాట్లాడుతూ ఈ ప్రపంచంలో వచ్చేటువంటి ఏ కష్టాన్నైనా ఏదో విధంగా జయించవచ్చు, కానీ వృద్ధాప్యాన్ని జయించడం అనేది చాలా కష్టం, కావున మణికొండలో మేము పుట్టినరోజు సందర్భంగా మాకు తోచిన విధంగా భక్తిగా వృద్ధాశ్రమాలకు సాయం చేస్తూ వృద్ధాశ్రమంలో పుట్టినరోజు జరుపుకోవడం జరిగింది.

మానవసేవయే మాధవసేవ లక్ష్యంతో పనిచేస్తున్న "ఆవ్రా" మణికొండలో ప్రతి కార్యక్రమాన్ని ఏదో రూపంలో నిజమైన లబ్ధిదారులకు చేరాలని లక్ష్యంతో పని చేయడం జరుగుతుంది.

ఈ కార్యక్రమంలో AVOPA రాష్ట్ర నాయకులు కట్ట రవికుమార్, వీరబొమ్మ రమేష్, జిల్లా కోశాధికారి సాయిరాం, పుప్పాలగూడ యూనిట్ అధ్యక్షులు దారం వేణుమాధవ్, మహిళా విభాగం కార్యదర్శి కోశాధికారి మహాలక్ష్మి, దేవి ప్రియ, దారం మల్లయ్య, సాయిబాబా మరియు తదితరులు పాల్గొనడం జరిగింది

# రేషన్ మాఫియా పై ఎమ్మెల్యే గళ్లా మాధవి మరోసారి ఉక్కుపాదం

**100కు పైగా రేషన్ బస్తాల అక్రమ రవాణాను నేరుగా అడ్డుకున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి..**
**ఎమ్మెల్యే రాకను గుర్తించి పరిగెత్తిన అక్రమార్కులు, చిక్కిన డ్రైవర్..**

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో రేషన్ మాఫియా పై ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు గళ్లా మాధవి మరోసారి ఉక్కుపాదం మోపారు. పేద ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తూ పక్కదారి పట్టిస్తున్న వారిపై కఠిన చర్యలు తప్పవని మరోసారి స్పష్టం చేశారు.గతంలో నల్లచెరువు, నల్లకుంట ప్రాంతాల్లో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనాలను స్వయంగా అడ్డుకొని కేసులు నమోదు చేయించిన ఎమ్మెల్యే గళ్లా మాధవి, అనంతరం పోలీసు మరియు పౌరసరఫరాల శాఖ అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించి రేషన్ బియ్యం అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలని ఆదేశించారు. అలాగే ప్రతి రేషన్ దుకాణంలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు.ఈ క్రమంలో గురువారం రాత్రి రేషన్ షాప్ నంబర్?150 పరిధిలోని రామనామ క్షేత్రం వద్ద భారీగా రేషన్ బియ్యం అక్రమ రవాణాకు సిద్ధం చేస్తున్నట్లు 18 డివిజన్ టీడీపీ అధ్యక్షులు ఉల్లి గోపాల్ కృష్ణ గుర్తించి ఎమ్మెల్యే గళ్లా మాధవికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే ఎమ్మెల్యే గళ్లా మాధవి హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.ఎమ్మెల్యే గళ్లా మాధవి రాకను గుర్తించిన అక్రమార్కులు పారిపోగా, వాహన డ్రైవర్ చిక్కారు..అప్పటికే అక్కడ 100కు పైగా బస్తాల రేషన్ బియ్యాన్ని వాహనంలో లోడ్ చేసి తరలించేందుకు సిద్ధంగా ఉంచినట్లు ఎమ్మెల్యే గళ్లా మాధవి..గుర్తించి,అడ్డుకున్నారు.అనంతరం లాలాపేట పోలీసులకు సమాచారం అందించగా, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వాహనాన్ని స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ. పేదల కడుపు నింపాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించి సొమ్ము చేసుకునే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు చేరాల్సిన బియ్యాన్ని దుర్వినియోగం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకునేలా అధికారులతో సమన్వయం చేస్తామని ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు..గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో రేషన్ మాఫియాకు తావులేదని, అక్రమ రవాణా, నిల్వలు, దుర్వినియోగంపై నిరంతర నిఘా కొనసాగుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజలు కూడా ఎక్కడైనా రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే సమాచారం అందించాలని కోరారు...

## మద్యం మత్తులో ఆర్టీసీ బస్సునే టార్గెట్ చేసాడు

జనగామ బస్టాండ్లో నిలిపి ఉన్న ఆర్టీసీ అద్దె బస్సును ఓ వ్యక్తి మద్యం మత్తులో దొంగిలించి తీసుకెళ్లాడు. పాలకుర్తికి చెందిన వెంకన్న, బస్సును స్టార్ట్ చేసి సూర్యాపేట వైపు సుమారు 21 కిలోమీటర్లు ప్రయాణించాడు. సింగరాజుపల్లి టోల్ గేట్ వద్ద అదుపు తప్పి సిమెంట్ దిమ్మెను ఢీకొట్టడంతో బస్సు ఆగిపోయింది. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.


# ఆరోగ్య సలహాలను సమాజానికి అందిచే వారధి లాంటి వారే మీడియా పాత్రికేయులు - డాక్టర్ భూమేష్ కుమార్

**మీడియా మిత్రులను సన్మానిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ సహాయ్**

**సాక్షి రిపోర్టర్ శ్రీనివాసులుని సన్మానిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ సహాయ్**

**నాంపల్లి ప్రజాబలం ప్రతినిధి:** హైదరాబాద్ : ఆరోగ్య సమస్యల పట్ల ప్రజల్లో అవగాహనా కల్పించేదే మీడియా ప్రతినిధులని వారిని వారధి అని ఉస్మానియా జనరల్ ఆస్పత్రి డీవీఎల్ విభాగాధిపతి డాక్టర్ భూమేష్ కుమార్ పేర్కొన్నారు. ఇటీవల ఆస్పత్రిలో నిర్వహించిన ప్రపంచ చర్మ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని గోషామహల్ నియోజకవర్గం వర్కింగ్ జర్నలిస్ట్ అషోషియేషన్ అధ్యక్షుడు డి సుభాష్ కృష్ణ (మన తెలంగాణ ) ఆధ్వర్యంలో గౌరవ సలహదారులు రఘువీర్ (ఆంధ్రప్రభ), జంగన్న (వార్త), ప్రధాన కార్యదర్శి వై సతీష్ కుమార్ (నమస్తే తెలంగాణ ), ముర్తుజా (టీ న్యూస్ ), నవీన్ (10 టీవి), సభ్యులు డి శ్రీనివాసులు (సాక్షి ) లను ఆయన మోడల్ లతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ సహాయ్, ఆర్ఎంఓ 1 డాక్టర్ శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.



# సర్ ప్రక్రియ పూర్తి చేయాలి :

## రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి






**పెద్దపల్లి/గోదావరిఖని, జూలై-10, ప్రజాబలం ప్రతినిధి :** నిర్ణీత కాల వ్యవధిలో సర్ ప్రక్రియ పూర్తి చేసేందుకు సూపర్ వైజర్లు, సంబంధిత సిబ్బంది మరింత కృషి చేయాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. సర్ తో పాటు వివిధ అంశాలపై నగర పాలక సంస్థ కార్యాలయంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), కమీషనర్ జె.అరుణ శ్రీ తో కలిసి శుక్రవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్ ప్రక్రియ పలు పోలింగ్ స్టేషన్ లలో పురోగతిలో లేకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్ణీత కాల వ్యవధిలో ప్రక్రియపూర్తి చేయడానికి ఒక ప్రణాళిక రూపొందించుకొని పని చేయాలని అన్నారు. అదనపు కలెక్టర్, కమీషనర్ జె.అరుణశ్రీ మాట్లాడుతూ ఈ నెల 18 లోపు సర్ ప్రక్రియ వంద శాతం పూర్తి చేయడానికి బి ఎల్ ఓ లతో పాటు వార్డు అధికారులకు, సహాయకులకు కూడా మల్టిపుల్ లాగిన్స్ ఇవ్వడం జరుగుతుందని అన్నారు.ఆన్ లైన్ లో నమోదు చేయడంతో పాటు ఫారాలను భర్తీ చేయడంలోనూ ఓటర్లకు సహకరించాలని కోరారు. సర్ కు సశీబందించి హెల్ప్ డెస్క్ సేవలు కూడా అందించాలని అన్నారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ డిప్యూటీ కమీషనర్ నాయిని వెంకట స్వామి, ఎ సి పి శ్రీహరి, సెక్రెటరీ మహేశ్వర రెడ్డి, టి పి ఎస్ నవీన్, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రాజనాల శ్రీహరి చూపు జనసేన వైపు..!

### తెలంగాణ కాంగ్రెస్‌కు భారీ షాక్..?
### తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామంచోటుచేసుకోబోతోందా..?

హైద్రాబాద్ జులై 10; వరంగల్‌కు చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు రాజనాల శ్రీహరి జనసేన వైపు అడుగులు వేస్తున్నారా..?అంటే అవును అనే సమాధానం వస్తుంది. తాజాగా చోటుచేసుకున్న పరిణామాలు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తున్నాయి.వరంగల్‌కు చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు రాజనాల శ్రీహరి



శుక్రవారం జనసేన పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీలో చేరికకు సంబంధించిన అంశాలతో పాటు తెలంగాణలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, భవిష్యత్ రాజకీయ పరిణామాలపై ఇరువురు సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం.

జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ రామ్ తాళ్లూరి ఆధ్వర్యంలో ఈ కీలక భేటీ జరిగింది. తెలంగాణలో జనసేన పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయడం, పార్టీ విస్తరణతో పాటు రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన రాజకీయ కార్యాచరణపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించినట్లు తెలుస్తోంది.

ఈ భేటీ సందర్భంగా రాజనాల శ్రీహరి, ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని పవన్ కళ్యాణ్ కు బహూకరించారు. అనంతరం తెలంగాణ రాజకీయ పరిస్థితులు, రాష్ట్రంలో జనసేన పార్టీ భవిష్యత్ కార్యాచరణపై ప్రత్యేకంగా చర్చించారు.

రాబోయే రోజుల్లో తెలంగాణలో జనసేన పార్టీని మరింత బలమైన రాజకీయ శక్తిగా తీర్చిదిద్దే దిశగా కీలక అడుగులు పడుతున్నట్లు తాజా పరిణామాలు సంకేతాలిస్తున్నాయి. రాజనాల శ్రీహరి జనసేనలో చేరితే వరంగల్‌తో పాటు తెలంగాణ రాజకీయాల్లోనూ ప్రభావం చూపే అవకాశం ఉందనే చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది.

మొత్తానికి... రాజనాల శ్రీహరి చూపు జనసేన వైపు మళ్లడం తెలంగాణ రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. ఆయన జనసేనలో చేరిక తెలంగాణ కాంగ్రెస్‌కు రాజకీయంగా భారీ షాక్‌గా మారే అవకాశముందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఈ సమావేశంలో జనసేన పార్టీ వైస్ ప్రెసిడెంట్ బొంగునూరి మహేందర్ రెడ్డి ,తెలంగాణ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ నేమూరి శంకర్ గౌడ్ , గ్రేటర్ హైదరాబాద్ నాయకులు రాధారం రాజలింగం తెలంగాణ ప్రచార కార్యదర్శి సాగర్ , తెలంగాణ రాష్ట్ర నాయకులు తనీష్ మచ్చ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు..

# కాంగ్రెస్--బీఆర్ఎస్ కుట్రలు ఫలించవు..

## తెలంగాణలో అధికారంలోకి వచ్చేది బీజేపీయే: కోలన్ శంకర్ రెడ్డి



రంగారెడ్డి(మహేశ్వరం),జూలై 10: కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఎన్ని రాజకీయ కుట్రలు పన్నినా తెలంగాణలో భారతీయ జనతా పార్టీ విజయాన్ని అడ్డుకోలేవని బీజేపీ రాష్ట్ర సహకార విభాగం కన్వీనర్ కోలన్ శంకర్ రెడ్డి అన్నారు.

ఈరోజు నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతి, అప్పులు, ప్రజా వ్యతిరేక విధానాలతో రాష్ట్రాన్ని వెనక్కి నెట్టిందని ఆరోపించారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ అభివృద్ధి, సంక్షేమం, పారదర్శక పాలనకు పెద్దపీట వేస్తోందని కొనియాడారు. ప్రజల విశ్వాసం బీజేపీపైనే ఉందని, రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా బీజేపీ ముందుకు సాగుతోందని, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజలను మభ్యపెట్టే రాజకీయాలకు కాలం చెల్లిందని కోలన్ శంకర్ రెడ్డి అన్నారు.

# తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న నిజమైన తెలంగాణ ఉద్యమకారులందరికీ న్యాయం చేయాలి

### గుర్తింపు మరియు సంక్షేమచర్యలు చేపట్టాలి
### తెలంగాణ ప్రభుత్వ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యులు కోదండరాం కు బండి రమేష్ విజ్ఞప్తి



హైద్రాబాద్ జులై 10;తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న నిజమైన తెలంగాణ ఉద్యమకారులందరికీ న్యాయం, గుర్తింపు మరియు సంక్షేమ చర్యలుకల్పించాలని తెలంగాణ ఉద్యమకారుల కమిటీ విజ్ఞప్తి చేసింది.ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వ తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యులు ప్రొఫెసర్ ఎం. కోదండరాం ను తెలంగాణఉద్యమకారుల కమిటీ చెర్మెన్ బండి రమేష్ కలిసి వినతి పత్రం సమర్పించారు.

తెలంగాణ ఉద్యమం కారులకు 250 చదరపు గజాల నివాస స్థలం కేటాయించాలని, నెలకు ?25,000 పింఛను ఇవ్వాలని, తెలంగాణ ఉద్యమ కేసులన్నింటినీ ఉపసంహరించుకోవాలని,తెలంగాణఉద్యమకారుల గుర్తింపు కార్డుల జారీ చేయాలని,ప్రత్యేక బడ్జెట్‌తో తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఉచిత బస్ పాస్, హెల్త్ కార్డ్ మరియు బీమా సౌకర్యాలు కల్పించాలని, ఉస్మానియా విశ్వవిద్యాలయం/సికింద్రాబాద్ సమీపంలో అమరవీరుల స్థూపం నిర్మించాలని, అమరవీరుల కుటుంబాలకు, గాయపడిన కార్యకర్తలకు, జైలులో ఉన్న కార్యకర్తలకు మరియు క్షేత్రస్థాయి తెలంగాణ ఉద్యమకారులకు తగిన గుర్తింపునిస్తూ, గుర్తింపు ప్రక్రియ నిష్పక్షపాతంగా, పారదర్శకంగా ఉండాలని కోరారు.అలాగేతెలంగాణ ఉద్యమకారుల త్యాగాలను, సేవలను గౌరవించేందుకు తెలంగాణ ప్రభుత్వం సానుకూల చర్యలు తీసుకోవాలని కోరారు.

# చీఫ్ సెక్రటరీ తో బీసీల డిమాండ్లపై బీసీ నాయకులు చర్చలు.



హైద్రాబాద్ జులై 10:బీసీ విద్యార్థులు – బీసీ ప్రజల డిమాండ్లపై నేడు సచివాలయంలో నేడు చీఫ్ సెక్రటరీ సంజయ్ జాజు తో బీసీ నేతలు ఆర్. కృష్ణయ్య నాయకత్వంలో బి.సి సంఘ నాయకులూ చర్చలు జరిపారు. ఈ క్రింది డిమాండ్లు పరిష్కరించాలని కోరారు.14 లక్షల మంది కాలేజీ విద్యార్థుల ఫీజుల బకాయలు 8వేల కోట్లు వెంటనే విడుదల చేయాలని, కాలేజీ హాస్టల్ సీట్లు దొరకక చాలామంది విద్యార్థులు చదువు మానుకుంటున్నారు. అదనంగా 120 బీసీ కాలేజీ హాస్టళ్ళు, 30 ఎస్టి కాలేజీ హాస్టళ్ళు మంజూరు, అలాగే ప్రస్తుతం కొనసాగుతున్న హాస్టళ్ళలలో 20 శాతం సీట్లు పెంచాలని కోరారు.150 బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలో మంజూరు చేయాలి. బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలో 99 శాతం రిజల్ట్ రావడంతో డిమాండ్ బాగా ఉన్నందున అదనంగా 10 శాతం సీట్లు పెంచాలని,బిసి కార్పొరేషన్ ద్వారా రెగ్యులర్ గా సబ్సిడీ రుణాలు ఇవ్వాలి ఒక్కొక్క కుటుంబానికి 20 లక్షల రూపాయలు మంజూరు చేయాలని కోరారు.ఉద్యోగాల భర్తీకే అమలు చేస్తున్న రోస్టర్ విధానం బీసీలకు అన్యాయం చేసే విధంగా ఉంది. దీనిపై సమీక్ష చేసి మార్చాలి.రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 30వేల టీచర్ పోస్టుల భర్తీకే నోటిఫికేషన్ జారీ చేయాలని,రాష్ట్రంలో ఖాళీగా యున్న గ్రూప్ 1 1600 పోస్టులు, గ్రూప్ 2లో 3వేల పోస్టులు గ్రూప్ 4 లో 10వేల పోస్టులు భర్తీ చేయాలనీ కోరారు.కాగా న్యాయమైన డిమాండ్లు పరిష్కరిస్తామని చీఫ్ సెక్రటరీ సంజయ్ జాజు హామీ ఇచ్చారు.

ఈ చర్చలలో

రాష్ట్ర బి.సి విద్యార్థి సంఘం పగిళ్ళ సతీష్, రాష్ట బి.సి సంఘం సి. రాజేందర్, రాష్ట బి.సి విద్యార్థి సంఘం కన్వీనర్ మోడీ రాందేవ్, రాష్ట్ర బి.సి ప్రజా సమితి అధ్యక్షులు భీంరాజు, గుజ్జ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మందకృష్ణ మాదిగకు జన్మ దిన శుభాకాంక్షలు తెలిపిన శివసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ సుదర్శన్

హైద్రాబాద్ జులై 10 : వీఞాూ నాయకులు మందకృష్ణ మాదిగకుశివసేన ఉద్ధవ్ థాక్రే తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ సుదర్శన్ నేడు మర్యాద పూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సుదర్శన్ మాట్లాడుతూ

అన్ని వర్గాల కోసం పోరాటం చేసే గొప్ప నాయకుడు మందకృష్ణ మాదిగ అని కొనియాడారు.అతని పోరాట ప్రతిమను సేవా నిరతిని గురయించిన కేంద్ర ప్రభుత్వం పద్మ శ్రీ బిరుదు తో గౌరవించిందన్నారు




# చీఫ్ సెక్రటరీ తో బీసీల డిమాండ్లపై బీసీ నాయకులు చర్చలు.



హైద్రాబాద్ జులై 10: బీసీ విద్యార్థులు – బీసీ ప్రజల డిమాండ్లపై నేడు సచివాలయంలో నేడు చీఫ్ సెక్రటరీ సంజయ్ జాజు తో బీసీ నేతలు ఆర్. కృష్ణయ్య నాయకత్వంలో బి.సి సంఘ నాయకులూ చర్చలు జరిపారు. ఈ క్రింది డిమాండ్లు పరిష్కరించాలని కోరారు.14 లక్షల మంది కాలేజీ విద్యార్థుల ఫీజుల బకాయలు 8వేల కోట్లు వెంటనే విడుదల చేయాలని, కాలేజీ హాస్టల్ సీట్లు దొరకక చాలామంది విద్యార్థులు చదువు మానుకుంటున్నారు. అదనంగా 120 బీసీ కాలేజీ హాస్టళ్ళు, 30 ఎస్టి కాలేజీ హాస్టళ్ళు మంజూరు, అలాగే ప్రస్తుతం కొనసాగుతున్న హాస్టళ్ళలలో 20 శాతం సీట్లు పెంచాలని కోరారు.150 బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలో మంజూరు చేయాలి. బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలో 99 శాతం రిజల్ట్ రావడంతో డిమాండ్ బాగా ఉన్నందున అదనంగా 10 శాతం సీట్లు పెంచాలని,బిసి కార్పొరేషన్ ద్వారా రెగ్యులర్ గా సబ్సిడీ రుణాలు ఇవ్వాలి ఒక్కొక్క కుటుంబానికి 20 లక్షల రూపాయలు మంజూరు చేయాలని కోరారు.ఉద్యోగాల భర్తీకే అమలు చేస్తున్న రోస్టర్ విధానం బీసీలకు అన్యాయం చేసే విధంగా ఉంది. దీనిపై సమీక్ష చేసి మార్చాలి.రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 30వేల టీచర్ పోస్టుల భర్తీకే నోటిఫికేషన్ జారీ చేయాలని,రాష్ట్రంలో ఖాళీగా యున్న గ్రూప్ 1 1600 పోస్టులు, గ్రూప్ 2లో 3వేల పోస్టులు గ్రూప్ 4 లో 10వేల పోస్టులు భర్తీ చేయాలనీ కోరారు.కాగా న్యాయమైన డిమాండ్లు పరిష్కరిస్తామని చీఫ్ సెక్రటరీ సంజయ్ జాజు హామీ ఇచ్చారు.ఈ చర్చలలో రాష్ట్ర బి.సి విద్యార్థి సంఘం పగిళ్ళ సతీష్, రాష్ట బి.సి సంఘం సి. రాజేందర్, రాష్ట బి.సి విద్యార్థి సంఘం కన్వీనర్ మోడీ రాందేవ్, రాష్ట్ర బి.సి ప్రజా సమితి అధ్యక్షులు భీంరాజు, గుజ్జ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పేదల నడ్డి విరుస్తున్న మైక్రో ఫైనాన్స్ సంస్థలు





## కూలీలు, వీధి వ్యాపారులు, మధ్యతరగతి వారే లక్ష్యం

## రోజురోజుకు వేధింపులు ఎక్కువవుతున్నాయి

## గిరి గిరి పేరిట సాయంత్రం వసూళ్లు

**చంద్రుగొండ జులై 10 ప్రజా బలం ప్రతినిధి:**–పేద సామాన్య మధ్య తరగతి ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని కొంతమంది మైక్రో ఫైనాన్సర్లు పేదల రక్తాన్ని పీడిస్తున్నారు.... ఈ మైక్రో ఫైనాన్స్ లు ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా , ఖమ్మం, వైరా, సత్తుపల్లి, ఏన్కూర్, జూలూరుపాడు, కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు, భద్రాచలం, సత్తుపల్లి, అశ్వరావుపేట, మధిర, బోనకల్, ముదిగొండ, భద్రాచలం, ఇల్లందు పాటు పలు మండలాల్లో, గ్రామాలలో పేదలను టార్గెట్ చేస్తూ వడ్డీ వ్యాపారం దందా కొనసాగుతుంది. సామాన్యుడి నడ్డి విరుస్తున్న మైక్రో ఫైనాన్స్ దందాకు అడ్డుకట్ట వేయకుండా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వడ్డీ వ్యాపారుల ఉచ్చులో చిక్కుకొని ఎన్నో నిరుపేద కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నాయి. కొన్ని సందర్భాల్లో వాయిదాలు చెల్లించలేని వారిపై దాడులకు సైతం వెనకాడడం లేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఎలాంటి అనుమతులు లేకుండానే కోట్ల రూపాయల లావాదేవీలు జరుగుతున్నా జిల్లా అధికార యంత్రాంగం చోద్యం చూస్తుందన్న ఆరోపణలు ఉన్నాయి. జిల్లా కేంద్రంతో పాటు పలు మండల కేంద్రాలలో చిన్న రూము లను అద్దెకు తీసుకొని జిల్లా వ్యాప్తంగా తమ దందాను విస్తరింప చేసుకుంటున్నారు.

**అడ్డగోలుగా దోపిడీ**

అమాయక నిరుపేదల అవసరాలను ఆసరాగా చేసుకుంటున్న ఫైనాన్స్ సిబ్బంది వాయిదాల పద్ధతిలో అప్పులు చెల్లించలంటూ అధిక వడ్డీలను వసూలు చేస్తున్నారు. ఎక్కువగా దినసరి కూలీలు, నిరక్షరాస్యులే, చిరు వ్యాపారులే కావడంతో సిబ్బంది చెప్పిందే లెక్కగా మారుతుంది. రుణాలు ఇచ్చే సమయంలో ఇన్సూరెన్స్ డాక్యుమెంట్, చార్జీల పేరిట అదనపు వస్తువులకు ఎగబడుతున్నారు. పట్టణాలు గ్రామాలు అనే తేడా లేకుండా వడ్డీ వ్యాపారం కొనసాగిస్తున్నారు.

నూటికి రూ.ఐదు నుంచి రూ.10 శాతం వరకు వడ్డీతో అప్పులు ఇస్తూ బలవంతపు వసూళ్లకు ఎగబడుతున్నారు. అత్యవసర సమయంలో నైతే 20శాతం వరకు వడ్డీలు ఇస్తున్నట్లు సమాచారం. గ్రామాల్లో కొంతమంది మహిళలను గ్రూపులుగా ఏర్పాటు చేసి రుణాలను మంజూరు చేస్తున్నారు. ఒక్కో గ్రూపుకు రూ.2500 నుంచి రూ.5000 వరకు అదనంగా దండుకుంటున్నారు. ఏజెంట్లు చెప్పే మాయ మాటలకు అమాయక ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు. ఏదైనా ఒక నెల వాయిదా చెల్లించకపోతే వడ్డీల మీద వడ్డీలు వేస్తూ అధికంగా వసూలు చేస్తున్నారు. ఇంట్లో ఎవరైనా అనారోగ్య బారిన పడి చనిపోయిన ఇంటి ముందు శవం ఉన్న వడ్డీ మాత్రం చెల్లించాల్సిందే అని బెదిరింపులకు దిగుతున్నారు. కొన్ని సందర్భాల్లో వాయిదాలు చెల్లించలేని పరిస్థితుల్లో వత్తిళ్లు పెరిగిపోతున్నాయి. అసలే గ్రామాల్లో నీతి నిజాయితీ పరువు ప్రతిష్ఠలకు పోతున్న అమాయక ప్రజలు ఆర్థిక ఇబ్బందులతో ఉసురు తీసుకుంటున్న పరిస్థితులు ఎదురవుతున్నాయి.

**కట్టడి చర్యలు కరువు**

మారుమూల గ్రామాల్లో విచ్చలవిడిగా సాగుతున్న మైక్రో ఫైనాన్స్ లపై నిఘా కరువు అవుతుందన్న ఫిర్యాదులు వస్తున్నాయి. గ్రామాల్లో తరచుగా ఫైనాన్స్ సిబ్బందికి అమాయక ప్రజల మధ్య ఘర్షణలు జరుగుతున్నా బయటకు రాకుండా జాగ్రత్త పడుతున్నారు. ఎలాంటి పెట్టుబడి ఖర్చు లేకుండా తేలికగానే వస్తున్న అప్పులకు అలవాటు పడిన కొందరు మైక్రో ఫైనాన్స్ మాఫియా మాయలో పడి తీవ్రంగా నష్టపోతున్నారు.

రెక్కాడితే కానీ డొక్కాడని అమాయక ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నారు. డైలీ, వీక్లీ, మంత్లీ పేరిట అప్పులు ఇస్తూ వాయిదాలు పద్ధతిలో వసూలు చేస్తున్నారు. తెల్లవారుజామున సాయంత్రం వేళల్లో ఇంటికి వచ్చి వడ్డీ అసలుతో సహా వాయిదాలను చెల్లించాలని ముక్కుపిండి మరి వసూలు చేస్తున్నారు. ఇదంతా బహిరంగంగానే జరుగుతున్న ఏ అధికారి కూడా స్పందించడం లేదని వాపోతున్నారు . వడ్డీ వ్యాపారుల ఆగడాలను తట్టుకోలేక చిరు వ్యాపారాలు, అమాయక కూలీలు, గిరిజనలు నిత్యం భయాందోళనకు గురవుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఇంట్లోకి చోరబడి వాయిదాలు చెల్లించాలంటూ బల వంతానికి దిగుతునారు .

మైక్రో ఫైనాన్స్ రుణాలపై ఏమాత్రం అవగాహన లేని అమాయక నిరుపేదలు అప్పు చెల్లించేందుకు మళ్లీ అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

చేసిన కష్టమంతా ఫైనాన్స్, వాయిదాలు వడ్డీలకే సరిపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని పలువురు మహిళలు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ఈ మైక్రో ఫైనాన్స్ పై దృష్టి సారించి మైక్రో ఫైనాన్స్ బారిన పడిన ప్రజలకు భరోసా ఇచ్చి న్యాయం చేయాలని, మైక్రో ఫైనాన్స్ ని కట్టడి చేయాలని జిల్లా ప్రజానీకం కోరుకుంటుంది.

# మంగపేట, మల్లూరు, కాటాపురం ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాల తగ్గింపుపై ప్రత్యేక దృష్టి

## ఏటూరునాగారం డివిజన్ లో ఫీడర్ల పనితీరును సమీక్షించిన టీజీఎన్పీ డీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

## సమస్యాత్మక ఫీడర్లపై 14 రోజుల కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులకు ఆదేశం

**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జులై 10**టీజీఎన్పీడీసీఎల్ చైర్మన్ ఉ మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ,ఐఏఎస్ శుక్రవారం ములుగు సర్కిల్‌లోని ఏటూరునాగారం డివిజన్‌లో విస్తృతంగా పర్యటించి విద్యుత్ సరఫరా వ్యవస్థ పనితీరును పరిశీలించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గించి వినియోగదారులకు మరింత నాణ్యమైన సేవలు అందించాలనే లక్ష్యంతో ఫీడర్ల పనితీరు, ట్రిప్పింగ్స్ పరిస్థితి, అటవీ ప్రాంతాల్లో లైన్ల భద్రత తదితర అంశాలపై ఆయన సమగ్రంగా అధికారులను అడిగి తెలుసుకున్నారు . ఈ సందర్భంగా 33 కేవీ, 11 కేవీ ఫీడర్లలో తరచూ సంభవిస్తున్న అంతరాయాలు, ట్రిప్పింగ్స్‌కు గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకుని, వినియోగదారులకు నాణ్యమైన, అంతరాయరహిత విద్యుత్ సరఫరా అందించే దిశగా తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఈ పర్యటనలో భాగంగా సీఎండీ ముందుగా 132/33 కేవీ కమలాపురం సబ్‌స్టేషన్‌ను సందర్శించి, అక్కడి నుంచి విద్యుత్ సరఫరా అయ్యే 33 కేవీ మంగపేట, మల్లూరు ఫీడర్లలో తరచూ చోటుచేసుకుంటున్న ట్రిప్పింగ్స్‌కు గల కారణాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమస్యాత్మక ఫీడర్లపై ప్రత్యేక దృష్టి సారించి, అంతరాయాల మూలకారణాలను గుర్తించి నివారణ చర్యలు వేగవంతం చేయాలని సూచించారు.

అలాగే 132/33 కేవీ కమలాపురం నుంచి 33/11 కెవి మల్లూరు వరకు కొత్తగా వేసిన ఇంటర్ లింకింగ్ లైన్ ను పరిశీలించిన సీఎండీ వినియోగంలోకి తీసుకు రావాలని చెప్పారు .

అనంతరం 33/11 కెవి మంగపేట సబ్‌స్టేషన్‌ను సందర్శించిన సీఎండీ అక్కడి లాగ్‌బుక్‌ను పరిశీలించి 11 కేవీ ఫీడర్లలో తరచూ సంభవిస్తున్న అంతరాయాలపై ఫీల్డ్ సిబ్బందితో నేరుగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పునరావృతమవుతున్న అంతరాయాలకు కారణమవుతున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి 14 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని, ఆ ప్రణాళికలో పేర్కొన్న పనులను నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని డీఈని ఆదేశించారు.






అనంతరం 33/11 కెవి మల్లూరు సబ్‌స్టేషన్‌ను పరిశీలించిన సీఎండీ అక్కడ కొనసాగుతున్న రియల్ టైం ఫీడర్ మానిటర్ పనుల పురోగతిని సమీక్షించారు. వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను అత్యంత త్వరగా పూర్తి చేయాలని నిర్మాణ విభాగం డీఈకి సూచించారు.

33 కేవీ కాటాపురం ఫీడర్‌ను పరిశీలించిన సీఎండీ , 33/11 కెవి కాటాపురం సబ్‌స్టేషన్‌ను కూడా సందర్శించారు. కాటాపురం సబ్‌స్టేషన్ పరిధిలో 33 కేవీ, 11 కేవీ లైన్లలో తరచూ చోటుచేసుకుంటున్న ట్రిప్పింగ్స్‌ను తగ్గించేందుకు అవసరమైన ప్రాంతాల్లో కవర్డ్ కండక్టర్లు ఏర్పాటు చేసే పనులను చేపట్టాలని ఏడీఈ తాడ్వాయిని ఆదేశించారు.

ముఖ్యంగా అటవీ, చెట్లతో నిండిన ప్రాంతాల్లో లైన్ అంతరాయాలను తగ్గించేందుకు ముందస్తు రక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నాణ్యమైన , మెరుగైన విద్యుత్ సరఫరాలో అందించడం టీజీఎన్పీడీసీఎల్ ప్రధాన లక్ష్యమని, ఫీల్డ్ స్థాయిలో అధికారులు సమస్యాత్మక ఫీడర్లపై ప్రత్యేక దృష్టి పెట్టి, వినియోగదారులకు అంతరాయరహిత విద్యుత్ అందించే దిశగా వేగంగా చర్యలు చేపట్టాలని సీఎండీ శ్రీ కర్నాటి వరుణ్ రెడ్డి స్పష్టం చేశారు . .

సీఎండీ వెంట ఎస్ఈ ఆపరేషన్ ములుగు బిక్షపతి, డీఈ టెక్నికల్ భాస్కర్, డీఈ ఆపరేషన్ ఏటూరునాగారం జె. పురుషోత్తం, ఏడీఈ ఆపరేషన్ ఏటూరునాగారం బి. ఉమారావు, ఏఈ ఆపరేషన్ కమలాపురం, ఏఈ ఆపరేషన్ ఏటూరునాగారం, ఏడీఈ తాడ్వాయి, ఏఈ కమర్షియల్ ములుగు రాజేష్, మహేందర్ రెడ్డితో పాటు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు

# ఎస్సీ కాలనీలో సిసి రోడ్డు ప్రారంభించడం జరిగింది

## ప్రారంభించిన వారు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దుర్గారెడ్డి



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి జులై 10 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా** :పుల్కల్ మండల పరిధిలోని ముదిమాణిక్యం గ్రామంలో,ఈరోజు శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వర్యులు శ్రీ దామోదర్ రాజనరసింహ, ఆదేశాల మేరకు 10,లక్షల నిధులతో పుల్కల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దుర్గారెడ్డి, ఆధ్వర్యంలో ఈరోజు ముదిమాణిక్యం,గ్రామంలో ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు ప్రారంభించడం జరిగింది, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గ్రామ అధ్యక్షులు ప్రభుగౌడ్, కాంగ్రెస్ పార్టీ నాలుగవ వార్డు నెంబర్ మహేష్, యూత్ అధ్యక్షులు మల్లేశం, నర్సింలు, బాలరాజ్,మహ్మద్ ఆసిన్, మహమ్మద్ సమీర్,భాను ప్రసాద్,కాంగ్రెస్ పార్టీ నాయకుడు మాణిక్యం, సంగమేష,కుమారు, నాగరాజ్,నాగేష్,, తదితరులు పాల్గొన్నారు

## ఏపీలో గృహోపకరణాల తయారీ యూనిట్ ఏర్పాటు చేయండి

### కుకూ ఎలక్ట్రానిక్స్ హెచ్‌వోడీ చో హన్ చుల్ తో మంత్రి నారా లోకేష్ భేటీ

సియోల్ (సౌత్ కొరియా): గృహోపకరణాలు, నీరు, గాలి శుద్ధి పరికరాల సంస్థ కుకూ(అబీఇ‌ఎనీసీ) ఎలక్ట్రానిక్స్ (దక్షిణ కొరియా) ఓవర్సీస్ సేల్స్ ఉ మార్కెటింగ్ హెచ్‌వోడీచో హన్ చుల్ (ఓటీ. అష్ట్రనీ ఊజినిఇ‌ష్ట్రబీశ్రీ), ఆసియా రీజియన్ ప్రతినిధులతో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... శ్రీసిటీలోని గృహోపకరణాల క్లస్టర్ లో అంబర్, ఈప్యాక్ డ్యూరబుల్, డైకిన్, ఎల్జీ ఎలక్ట్రానిక్స్ మొదలైనవి సంస్థలు ఉన్నాయి. దేశంలో 40% ఏసీలు, 35% టీవీలు ఆంధ్రప్రదేశ్ లో తయారవుతున్నాయి. ఇందుకు అవసరమైన స్కిల్డ్ వర్క్ ఫోర్స్ అందుబాటులో ఉంది. ఇక్కడ నుంచి ఆగ్నేయ, మధ్యప్రాచ్య దేశాలకు ఎగుమతి చేయడం సులభం. దక్షిణ భారతదేశంలో ఏసీల వినియోగం ఎక్కువగా ఉంటుంది. ప్రపంచ వాణిజ్యానికి భారతదేశం ఒక విశ్వసనీయ తయారీ భాగస్వామిగా ఉంది. ఈ అనుకూలతల దృష్ట్యా ఆంధ్రప్రదేశ్ లోని శ్రీసిటీ లేదా తిరుపతిలో గృహోపకరణాల తయారీ యూనిట్ ఏర్పాటు చేయాల్సిందిగా మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు. కుకూ ఎలక్ట్రానిక్స్ హెచ్‌వోడీ మాట్లాడుతూ... దక్షిణ కొరియాలో నంబర్ 1 ప్రెషర్ రైస్-కుక్కర్ల తయారీ సంస్థ అయిన కుకూ ఎలక్ట్రానిక్స్, ఇప్పుడు నీరు ఉ గాలి శుద్ధి, ఉపకరణాల అద్దె రంగాల వైపు మళ్లుతోందని తెలిపారు. వంటగది ఉపకరణాలు (ఎఊ ప్రెషర్ కుక్కర్లు), నీటి శుద్ధి (ఖీూ / నానో, చిఊూ-గ్రేడ్), గాలి ఉ ఆరోగ్యం (ప్యూరిఫైయర్లు, హ్యూమిడిఫైయర్లు, బిడెట్లు) తయారీతోపాటు ప్రపంచవ్యాప్తంగా 10 లక్షలకు పైగా ఉపకరణాల యూనిట్లు తమవద్ద అద్దెకు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. తమ సంస్థ 40కి పైగా దేశాలకు గృహోపకరణాలను ఎగుమతి చేస్తోందని తెలిపారు.

## ఎస్ఐఆర్ పనులకు సెలవులు రద్దు

## రెండో శనివారం, ఆదివారం కూడా విధులు నిర్వహించాలి: ఆర్డీవో దేవుజ

**జహీరాబాద్, జూలై 10 ప్రజా బలం ప్రతినిధి:** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయడానికి జహీరాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారి దేవుజ కీలక ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో ఎన్యూమరేషన్ ఫారాల నింపడం, వాటి డిజిటలైజేషన్ పనుల్లో పురోగతి మందగించిన నేపథ్యంలో రెండో శనివారం జూలై 11, ఆదివారం జూలై 12 న కూడా సంబంధిత సిబ్బంది విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు.ఎన్నికల నమోదు అధికారులు, బీఎల్వో సూపర్వైజర్లు, బీఎల్వోలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, జీపీఓలు తదితర ఎస్ఐఆర్ విధుల్లో పాల్గొంటున్న సిబ్బంది ప్రభుత్వ సెలవులు వినియోగించకుండా క్షేత్రస్థాయిలో పనిచేసి ఎన్యూమరేషన్ ఫారాల నింపడం, ఆన్లైన్ డిజిటలైజేషన్ ప్రక్రియను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు.

ఎన్నికల సంఘం, ఉన్నతాధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని, నిర్లక్ష్యం, ఆదేశాల ఉల్లంఘనకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో దేవుజ హెచ్చరించారు.

# ఓటు హక్కు కోల్పోకుండా ఎస్ఐఆర్‌లో పాల్గొనాలి

## – ఎంజీ రాములు



**జహీరాబాద్, జూలై 10 ప్రజాబలం ప్రతినిధి:** ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని, నిర్లక్ష్యం చేస్తే ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని జహీరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎంజీ రాములు హెచ్చరించారు. శుక్రవారం జహీరాబాద్ మండలంలోని రాయిపల్లి(డి) గ్రామంలో 126, 127 పోలింగ్ బూత్‌ల పరిధిలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ హెల్ప్ సెంటర్‌ను సందర్శించి బీఎల్వోలు, బీఎల్ఏలతో కలిసి ఇంటింటికీ జరుగుతున్న ఓటరు వివరాల ధృవీకరణ ప్రక్రియను సమీక్షించారు. ప్రతి అర్హత కలిగిన ఓటరు తమ వివరాలను పరిశీలించుకుని, అవసరమైన మార్పులు, చేర్పులు, సవరణలు చేయించుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు నిరంతరం అందాలంటే ఓటరు వివరాలను సక్రమంగా నమోదు చేసి ఫారాలను పూర్తి చేయాలని కోరారు.ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, తప్పులులేని ఓటరు జాబితా రూపొందించడంలో బీఎల్వోల పాత్ర కీలకమని ఆయన కొనియాడారు. ప్రతి ఒక్కరూ ఎస్ఐఆర్ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని తమ ఓటు హక్కును భద్రపరచుకోవాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సేవాదళ్ జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహులు, జాకీర్ పటేల్, అవినాష్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు జి. సంజీవరెడ్డి, వార్డు సభ్యులు శేఖర్, ఎర్రోళ్ల సంజీవులు, రాజేందర్, జయరాజ్ (మాజీ సొసైటీ చైర్మన్), గ్రామ పెద్దలు పెంటయ్య, పాపయ్య, రవికుమార్, సురేష్, సంజీవ్, షేనాకయ్య, అశోక్, విజయ్, అలెగ్జాండర్, నాగరాజ్, శ్రీనివాస్, ఖలీల్, బీరన్న, సయ్యద్ మూలాన, నవాబ్ తదితరులు పాల్గొన్నారు.

## టీవీవీపీ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

## జహీరాబాద్ ప్రభుత్వాసుపత్రి ఎదుట ఉద్యోగుల నిరసన



**జహీరాబాద్, జూలై 10 ప్రజా బలం ప్రతినిధి:** తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) ఉద్యోగుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ప్రభుత్వాసుపత్రి ఎదుట తెలంగాణ వైద్య ఉద్యోగుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉద్యోగులు నిరసన చేపట్టారు. టీవీవీపీ కమిషనర్ పదవి ఖాళీగా ఉండటంతో పరిపాలనా వ్యవహారాలు నిలిచిపోయాయని, దీంతో ఉద్యోగుల సర్వీస్‌కు సంబంధించిన అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

టీవీవీపీకి పూర్తిస్థాయి రెగ్యులర్ కమిషనర్‌ను వెంటనే నియమించాలని, రీడిప్లాయ్‌మెంట్ ప్రక్రియ పూర్తి చేయడంతో పాటు పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, అర్హులైన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించి రెగ్యులరైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సకాలంలో కొనసాగింపు ఉత్తర్వులు జారీ చేసి వేతనాల చెల్లింపులో జాప్యం లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని ఉద్యోగులు హెచ్చరించారు.కార్యక్రమంలో వెంకటేశం, ఎన్. కుమారస్వామి, ఎం. విక్రమ్, శ్రీనివాస్, రామేశ్వరి, బి. సునంద, వినోద కుమారి, ఎం. లలిత, డి. నిర్మల, సంగమేష్, శివరాణి, సుని, మధు తదితరులు పాల్గొన్నారు.

## నూతనంగా ఎన్నికైన మంగపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టు పెల్లి వెంకటేశ్వర్లు ను సన్మానించిన జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటముల రఘు.



**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జులై 10** శుక్రవారం మంగపేట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టుపల్లి వెంకటేశ్వర్లు ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించిన జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమల రఘు. ఆర్టిఏ డైరెక్టర్ వసంత శ్రీనివాస్

ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యల పై పరిష్కారం కోసం కృషి చేయాలని. కాంగ్రెస్ పార్టీకి బలోపేతానికి. మంత్రి సీతక్క గారికి అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి అయ్యూరి యానయ్య. ఎస్సీ, ఎస్టి అట్రాసిటీ నెంబర్ మురుకుట్ల నరేందర్. నరసింహ సాగర్ కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు హరికృష్ణ. కొమరం సారయ్య. కొమరం బిక్షపతి ఎటురూ నాగారం కాంగ్రెస్ పార్టీ నాయకులు వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

# ఆయిల్ పామ్ సాగుపై రైతులకు విజ్ఞాన యాత్ర





**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 10(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:** సంగారెడ్డి/ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగుపై ఆసక్తి ఉన్న రైతులకు విజ్ఞాన యాత్రను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన 22 మంది రైతులను ఖమ్మం జిల్లా,కొనిజర్ల మండలంలోని ఆయిల్ పామ్ తోటల సందర్శనకు గోద్రెజ్ ఆగ్రోవెట్ సంస్థ సహకారంతో తీసుకువెళ్లారు,ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జాతీయ ఆయిల్ పామ్ మిషన్ (ఎన్ఏంఈఓ–ఓపి) కార్యక్రమంలో భాగంగా రైతులకు ఆయిల్ పామ్ సాగుపై క్షేత్రస్థాయి అవగాహన కల్పించడం, శాస్త్రీయ సాగు పద్ధతులను పరిచయం చేయడం మరియు ఇతర ప్రాంతాల్లో విజయవంతంగా సాగు చేస్తున్న రైతుల అనుభవాలను తెలుసుకునే అవకాశాన్ని కల్పించడం ఈ విజ్ఞాన యాత్ర ముఖ్య ఉద్దేశ్యం ఈ సందర్భంగా రైతులు ఆయిల్ పామ్ తోటలను ప్రత్యక్షంగా సందర్శించి మొక్కల పెంపకం, తోటల నిర్వహణ, ఎరువుల యాజమాన్యం, నీటి నిర్వహణ, పంట సంరక్షణ,దిగుబడులు, తాజా పండ్ల గుత్తుల కోత, రవాణా, ప్రాసెసింగ్ మరియు మార్కెటింగ్ అంశాలపై క్షేత్రస్థాయిలో అవగాహన పొందారు,అదేవిధంగా, ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులతో ముఖాముఖిగా సమావేశమై, వారు అనుసరిస్తున్న సాగు పద్ధతులు, నిర్వహణ విధానాలు, పంట ద్వారా పొందుతున్న ఆదాయం, ఎదురైన సమస్యలు మరియు వాటి పరిష్కారాల గురించి తెలుసుకున్నారు. ఈ పరస్పర చర్చలు రైతుల్లో ఆయిల్ పామ్ సాగుపై మరింత నమ్మకాన్ని పెంపొందించాయి,విజ్ఞాన యాత్రను ఉద్యాన అధికారి కె. మౌనికా రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు,ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,ఆయిల్ పామ్ దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయాన్ని అందించే వాణిజ్య పంట అని, ప్రభుత్వం ఎన్ఏంఈఓ–ఓపి పథకం ద్వారా అందిస్తున్న ప్రోత్సాహకాలు మరియు సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకుని ఆయిల్ పామ్ సాగును విస్తరించాలని సూచించారు. అలాగే శాస్త్రీయ పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించి మంచి ఆదాయాన్ని పొందవచ్చని రైతులకు వివరించారు,ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి కె.మౌనికా రెడ్డి,గోద్రెజ్ ఆగ్రోవెట్ సంస్థ ఏజీఎం ఈశ్వర్ రెడ్డి, సంస్థ ప్రతినిధులు మరియు సంగారెడ్డి జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన ఆయిల్ పామ్ సాగుపై ఆసక్తి గల రైతులు పాల్గొన్నారు.

## తుమ్మలపల్లి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీప్రెసిడెంట్ తుమ్మల సురేష్ యాదవ్

## మా గ్రామ అభివృద్ధి నా లక్ష్యం అంటున్న మన్నె పాండు

**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి జులై 10(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలంతుమ్మలపల్లి గ్రామానికి చెందిన తలారి మహేశ్వరి ఎ/శీ పోచప్ప గారి నూతన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం పారభోస్తాం చేయడం జరిగింది ఇ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమల సురేష్ యాదవ్ మరియు మాజీ ఎంపీటీసీ సురేష్,మాజీ ఎంపీటీసీ మహేష్,మండల రాజ సెల్ అధ్యక్షులు పసుల సురేష్ మరియు తుమ్మలపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సర్పంచ్ గా పోటీ చేసినఅభ్యర్థి. మన్నే పాండు, ఉపసర్పంచ్ సురేష్,వార్డు మెబార్స్ బి.రాజు ,ప్రసాద్ గౌడ్, ముజు, మరియు విలేజ్





కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున గృహప్రవేశకార్యక్రమంలోపాల్గొనడం జరిగింది

## శ్రీసిటీలో మోటివ్ లింక్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేయండి

## మోటివ్ లింక్ సీఈవో కిమ్ కి-హాన్ తో మంత్రి లోకేష్ భేటీ

సియోల్ (సౌత్ కొరియా): దక్షిణ కొరియాకు చెందిన ఆటోమోటివ్ పవర్ ఎలక్ట్రానిక్స్, పాసివ్ కాంపొనెంట్స్ తయారీ సంస్థ మోటివ్ లింక్ (ఓూఎఎఇఒఎఔఐ) సీఈవో కిమ్ కి-హాన్ (ఓఁతీ. ఐతిఎ ఐతి-ష్ట్రజీని), ఇంటర్నేషనల్ సేల్స్ అండ్ రీసెర్చ్ జనరల్ మేనేజర్ బైద్య శర్మతో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సియోల్ లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ లో ఈవీ విడిభాగాలు (ఇఎ ఎఅఅజ విడిభాగాలు), నాఓఆ / ఖఃం ఉత్పత్తి, ఇంటిగ్రేటెడ్ మాడ్యూల్, ఇతర ఇఎ మాగ్నెటిక్స్ విడిభాగాలు తయారు చేసే యూనిట్ ను ఏర్పాటు చేయండి. ఇందుకు అవసరమైన విద్యుత్, నీరు, లాజిస్టిక్స్ వంటి మౌలిక సదుపాయాలతో కూడిన భూమి శ్రీసిటీలో సిద్ధంగా ఉంది. ఏపీలోని స్పేస్ సిటీ, స్కైరూట్, ంఓఅం వంటి రక్షణరంగ తయారీ యూనిట్లలో పెట్టుబడులు పెట్టే అంశాన్ని పరిశీలించండి. ఓఅఔఇచీ, సోలమ్, ఒఉ ఎలక్ట్రానిక్స్, ఒఉ కెమ్ వంటి ఇతర కొరియన్ కంపెనీలతో పాటు శ్రీసిటీలో మోటివ్ లింక్ ప్రాజెక్ట్‌ను ఏర్పాటు చేయాలని మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు.మోటివ్ లింక్ (ఓూఎఎఇఒఎఔఐ) సీఈవో కిమ్ కి-హాన్ మాట్లాడుతూ... భారతదేశంలో గ్రీన్‌ఫీల్డ్ ఇఎ-కాంపోనెంట్స్ (ట్రాన్స్‌ఫార్మర్లు/ ఆఅ కన్వర్టర్లు) ప్లాంట్ కోసం స్టెర్లింగ్ టూల్స్‌తో ఒక టెక్-లైసెన్స్ జాయింట్ వెంచర్ ను మోటిలింక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, తమిళనాడులోని చెన్నైలో సెప్టెంబర్ 2025లో స్థాపించిందని తెలిపారు. భారత్ లో తమ సంస్థ మొదటి స్వతంత్ర ప్లాంట్ తమిళనాడులోని శ్రీపెరంబుదూర్-ఒరగడమ్-చెన్నై ఆటో క్లస్టర్‌లో ఉందని అన్నారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని కిమ్ కి-హాన్ తెలిపారు.

## జహీరాబాద్‌కు కేంద్ర నిధులు, రైల్వే ప్రాజెక్టులు తీసుకురావాలి

### -డి ఆర్ యు సి సి మాజీ సభ్యులు షేక్ ఫరీద్




**జహీరాబాద్, జులై 10 ప్రజాబలం ప్రతినిధి:** జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులు, రైల్వే ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలను తీసుకురావడంలో ప్రజాప్రతినిధులు మరింత చొరవ చూపాలని మాజీ డివిజనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు షేక్ ఫరీద్ కోరారు.కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ స్టేషన్ పథకం, రైల్వే మౌలిక వసతుల అభివృద్ధి, వికలాంగులు, వృద్ధుల సంక్షేమానికి సంబంధించిన పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. వీటి ప్రయోజనాలను జహీరాబాద్ ప్రాంతానికి తీసుకురావడానికి ప్రజాప్రతినిధులు కేంద్ర ప్రభుత్వ శాఖలతో సమన్వయం పెంచాలని సూచించారు. జహీరాబాద్ అభివృద్ధికి కీలకమైన ముంబై--హైదరాబాద్ బుల్లెట్ ట్రైన్‌ను జహీరాబాద్ మీదుగా నడిపే ప్రతిపాదన, జల్నా--తిరుపతి ఎక్స్‌ప్రెస్ కు జహీరాబాద్ రైల్వే స్టేషన్‌లో స్టాపేజ్ కల్పించడం, కోహీర్ సమీపంలోని ఎల్‌సీ నంబర్--24 వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం వంటి అంశాలను కేంద్ర ప్రభుత్వం, రైల్వే శాఖ దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన అమలు చేయించాలని కోరారు.

ప్రజలు తమ ప్రజాప్రతినిధుల నుంచి అభివృద్ధి కార్యక్రమాల అమలులో మరింత చొరవను ఆశిస్తున్నారని పేర్కొన్నారు. జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ కేంద్ర ప్రభుత్వ శాఖలతో సమన్వయం పెంచి, నియోజకవర్గానికి మరిన్ని కేంద్ర నిధులు, రైల్వే ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలను తీసుకురావడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.రాజకీయాలకు అతీతంగా ప్రజల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తూ, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని షేక్ ఫరీద్ పిలుపునిచ్చారు.

## ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

### ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను గడువులోగా పూర్తి చేయాలి

### :: భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ డా. పవన్ కుమార్ శర్మ

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జులై 10** కలెక్టరేట్ శుక్రవారం న్యూఢిల్లీ నుంచి ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ--2026 కార్యక్రమంపై భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ పవన్ కుమార్ శర్మ, తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.



ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి ములుగు జిల్లా నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి హాజరయ్యారు.

ఈ సందర్భంగా డా. పవన్ కుమార్ శర్మ మాట్లాడుతూ, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ ఈ నెల 24వ తేదీలోగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తి చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణలో భాగంగా ఏ పోలింగ్ కేంద్రంలోనూ 1,200 మందికి మించి ఓటర్లు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



తెలంగాణ రాష్ట్రంలో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ 99.06 శాతం పూర్తయిందని, డిజిటలైజేషన్ ప్రక్రియ 33.31 శాతం పూర్తయిందని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్‌కు వివరించారు.

ప్రతి బీఎల్ఓ రోజుకు కనీసం 15 శాతం డిజిటలైజేషన్ లక్ష్యాన్ని సాధించేలా చర్యలు చేపట్టాలని, ప్రతి బీఎల్ఓకు ముగ్గురు వాలంటీర్ల బృందాన్ని ఏర్పాటు చేసి సహకారం అందించాలని సూచించారు. అలాగే ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసి నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీవో కృష్ణవేణి, ఎన్నికల సూపరింటెండెంట్ సలీమ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో విలువలు, ఆత్మవిశ్వాసం పెంపొందించాలి: కలెక్టర్ మను చౌదరి

### హిందీ పండితుల శిక్షణలో పాల్గొన్న జిల్లా కలెక్టర్

### పాఠశాల సమస్యల పరిష్కారానికి హామీ

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం జూలై 10:** ఉపాధ్యాయులు పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా విద్యార్థుల్లో నైతిక విలువలు, బాధ్యతాయుత భావన, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా బోధించాలని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి సూచించారు. శుక్రవారం కూకట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన హిందీ పండితుల శిక్షణ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి రేణుకాదేవితో కలిసి ఆయన పాల్గొన్నారు.



ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు సాంకేతిక పరిజ్ఞానంపై ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకొని, విద్యార్థులకు కూడా అందించాలన్నారు. విద్యార్థుల్లో హిందీ భాషా ప్రావీణ్యాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.



విద్యార్థులు తమ ఆలోచనలను నిర్భయంగా వ్యక్తీకరించేలా, వేదికపై మాట్లాడే ధైర్యాన్ని పెంపొందించేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని అన్నారు. ప్రతి విద్యార్థిలో నేర్చుకోవాలనే జిజ్ఞాసను పెంచగలిగితేనే ఉపాధ్యాయుడి బాధ్యత సార్థకమవుతుందన్నారు.

పాఠశాలల్లో మౌలిక సదుపాయాల సమస్యలు ఉంటే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి అవసరమైన వొకాబులరీ, లెర్నింగ్ సాఫ్ట్‌వేర్ వంటి వనరులను కూడా అందిస్తామని తెలిపారు.

కార్యక్రమంలో కూకట్‌పల్లి ఎంఆర్ఓ అశోక్, ప్రధానోపాధ్యాయుడు రవీందర్ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బాలానగర్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన పులి శివకుమార్ గౌడ్



**కూకట్పల్లి (ప్రజాబలం ) జులై 10:**బాలానగర్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడిగా నియమితులైన పులి శివకుమార్ గౌడ్ శుక్రవారం కూకట్పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్, తెలంగాణ రాష్ట్ర ఖమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ మర్యాదపూర్వకంగా ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి పార్టీ బాధ్యతలు అప్పగించినందుకు బండి రమేష్‌కు పులి శివకుమార్ గౌడ్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని, ముఖ్యంగా బీద, బడుగు, బలహీన వర్గాల సమస్యల పరిష్కారానికి అండగా నిలుస్తానని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి డివిజన్‌లో పార్టీని మరింత బలోపేతం చేయడమే తన ప్రధాన లక్ష్యమని శివకుమార్ గౌడ్ తెలిపారు.

## ఏపీ రాష్ట్రంలో మళ్లీ కరోనా కలకలం.. ఇద్దరు మృతి




**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి జులై 10 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా** :ఏపీ రాష్ట్రంలో కరోనా కేసులు మళ్లీ కలకలం రేపుతున్నాయి. వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన ఇద్దరు వ్యక్తులు వైరస్ బారినపడి మంగళవారం మృతి చెందారు, మృతుల్లో ఒకరికి 43 ఏళ్లు, మరొకరికి 60 ఏళ్లుపైనే ఉన్నాయని తెలిసింది,మృతులిద్దరికీ ఆర్టీపీసీఆర్ టెస్ట్‌లో పాజిటివ్ అని తేలడంతో తదుపరి నిర్ధారణ పరీక్ష కోసం వారి బ్లడ్ శాంపిళ్లను పుణె వైరాలజీ ల్యాబ్‌కు పంపడానికి కడప జిల్లా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు,43 ఏళ్ల వ్యక్తి కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృత్యువాత పడగా, 60 ఏళ్లు పైబడిన వ్యక్తి తమిళనాడులోని సీఎంసీ వెల్లూరులో చికిత్స పొందుతూ మరణించారు, కాగా ఈ ఘటనపై మరింత సమాచారం తెలియాల్సి ఉంది...

## శ్రీ సరస్వతీ శిశు మందిర్, కరీంనగర్‌లో ఆచార్య నిరంతర ప్రశిక్షణా వర్గం ప్రారంభం.

కరీంనగర్ శ్రీ సరస్వతీ విద్యాపీఠం, తెలంగాణ ఆధ్వర్యంలో శ్రీ సరస్వతీ శిశు మందిర్, కరీంనగర్ విభాగ్ స్థాయి ప్రాథమిక మరియు శిశువాటిక ఆచార్యుల కోసం రెండు రోజుల నిరంతర ప్రశిక్షణా వర్గ ప్రారంభించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కరీంనగర్ విభాగ్ అధ్యక్షులు ముక్కాల సీతారాములు, కార్యదర్శి మెచినేని దేవేందర్ రావు, శైక్షణిక్ ప్రముఖ్ కాటం రవీందర్, సమితి కార్యదర్శి ఎలగందుల సత్యనారాయణ, పాఠశాల కార్యదర్శి ఇంజనీర్ కోల అన్నారెడ్డి, గట్టు శ్రీనివాస్, విభాగ్ ఉపాధ్యక్షులు కోట లక్ష్మారెడ్డి, పాఠశాల సంయుక్త కార్యదర్శి కొత్తూరు ముకుందం, జగిత్యాల జిల్లా సహా కార్యదర్శి బాజోజు శ్రీనివాస్ పాల్గొని ఆచార్యులను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, విలువలు, క్రమశిక్షణ, దేశభక్తి, వ్యక్తిత్వ వికాసం పెంపొందించడంలో ఆచార్యుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. మారుతున్న విద్యా విధానాలకు అనుగుణంగా బోధనా నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాలని, ప్రతి ఆచార్యుడు సమాజ నిర్మాణంలో ఆదర్శంగా నిలవాలని సూచించారు.ఈ శిక్షణా వర్గంలో బోధనా పద్ధతులు, తరగతి గది నిర్వహణ, విద్యార్థుల మనోవిజ్ఞానం, విలువల ఆధారిత విద్య, కార్యాచరణ ప్రణాళిక వంటి అంశాలపై సమగ్రంగా శిక్షణ అందించబడింది.కార్యక్రమంలో విభాగ్ పాఠశాల ప్రధానాచార్యులు, 160 మంది ఆచార్యులు, విద్యాపీఠం బాధ్యులు పాల్గొన్నారు అని నిర్వాహక పాఠశాల ప్రధానోద్యాయులు మోర రణధీర్ తెలిపారు.

## గోపాల్‌నగర్ ప్రధాన రహదారి సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తాం.. బండి రమేష్



**కూకట్పల్లి (ప్రజాబలం ) జూలై 10:** గోపాల్‌నగర్ మెయిన్ రోడ్ ప్లాట్ యజమానుల విజ్ఞప్తి మేరకు బండి రమేష్ గోపాల్‌నగర్ ప్రధాన రహదారిని సందర్శించి, అక్కడి ప్లాట్ యజమానులతో సమావేశమై వారి సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్లాట్ యజమానులు మాట్లాడుతూ, గోపాల్‌నగర్ లేఅవుట్ 1980లో ఏర్పడిందని, 1981లో ప్లాట్లను కొనుగోలు చేశామని తెలిపారు. అప్పట్లో ఆమోదించబడిన లేఅవుట్‌లో ప్రధాన రహదారి వెడల్పు 40 అడుగులుగా మాత్రమే ఉందని, తమ వద్ద ఉన్న అన్ని రిజిస్టర్డ్ అమ్మకపు పత్రాల్లో (సేల్ డీడ్స్ ) కూడా 40 అడుగుల రహదారే నమోదై ఉందని వివరించారు. మూసాపేట నుండి లింగంపల్లి వరకు ఇదే రహదారి అనేక ప్రాంతాల్లో 60 నుండి 80 అడుగుల వెడల్పుతో మాత్రమే ఉందని, అలాంటప్పుడు గోపాల్‌నగర్ ప్రాంతంలో మాత్రమే 120 అడుగుల రహదారి పేరుతో భూములను సేకరించడం పూర్తిగా అన్యాయమని తెలిపారు. ఈ సమస్య గత 40 సంవత్సరాలుగా పరిష్కారం కాకుండా కొనసాగుతోందని, చట్టబద్ధంగా కొనుగోలు చేసిన ప్లాట్ యజమానుల హక్కులను ప్రభుత్వం పరిరక్షించాలని వారు బండి రమేష్ ని కోరారు. ప్లాట్ యజమానుల వినతిని, సంబంధిత పత్రాలను పరిశీలించిన అనంతరం బండి రమేష్ సమస్య తీవ్రతను గుర్తించి, సంబంధిత అధికారులతో చర్చించి ఈ సమస్యకు వీలైనంత త్వరగా న్యాయమైన పరిష్కారం చూపేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గోపాల్‌నగర్ మెయిన్ రోడ్ ప్లాట్ యజమానులు ఈ సందర్భంగా బండి రమేష్ కి తమ సమస్యను ప్రత్యక్షంగా పరిశీలించి భరోసా కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్ బాబు,వినోద్ చావా, శ్రీనివాస్, తిలక్, అనిల్, సుధాకర్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో వంద శాతం రాయితీ కల్పించాలి

### - ఆర్టీసీ డిపోలో వినతి పత్రం సమర్పించిన టిడబ్ల్యూజేఎఫ్



**చంద్రుగొండ /కొత్తగూడెం ప్రజబలం ప్రతినిధి** :-రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా సేవలందిస్తున్నామని అలాగే ఆర్టీసీ సంస్థకు కూడా తమ సేవలందిస్తున్న విషయం అందరికీ తెలిసిందే రాష్ట్ర ప్రభుత్వం, ఆర్టీసీ సంస్థ చాలా ఏళ్ళుగా మాయొక్క జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో 1/3 రాయితీ పై ప్రయాణ సదుపాయం అమలు చేస్తున్నందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాం. అయితే గత కొంతకాలంగా 1/3 చార్జీలు అంటూనే దాదాపు 50% చార్జీలు వసూలు చేస్తున్నారు. దీనివల్ల జర్నలిస్టులకు భారమవుతుంది. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి వార్తలు సేకరిస్తున్న జర్నలిస్టులకు ఈ 1/3 చార్జీలు భరించలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలో అనేక మంది జర్నలిస్టులు సరైన వేతనాలు లేకపోయినప్పటికి జర్నలిజం వృత్తిలో కొనసాగుతూ ప్రభుత్వానికి, ప్రజలకు, ఆర్టీసీ సంస్థకు సేవలందిస్తున్నారు. అటువంటి జర్నలిస్టులు వార్తల సేకరణకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాల్సి రావడం వల్ల వారిపై ప్రయాణ చార్జీల భారం పడుతుంది. రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిన ప్రభుత్వం, ఆర్టీసీ సంస్థ...మా కొద్దిమంది జర్నలిస్టులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించకపోవడం బాధాకరం. కావున దయచేసి జర్నలిస్టులకు అన్ని అర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని జిల్లా కో ఆర్డినేటర్ జి వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రామిశెట్టి సైదయ్య, ఫెడరేషన్ సభ్యులు నేరేళ్ళకుంట సుధాకర్, జక్కుల సంపత్, జి నాగరాజు, షేక్ జాఫర్, తేజవత్ వెంకటేశ్వర్లు, పగడాల నవీన్ రెడ్డి, గుడిమెట్ల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## జహీరాబాద్ ఆస్పత్రిలో డాక్టర్ల కొరత తీర్చాలి

### -ప్రసూతి, చిన్నారుల వార్డును వెంటనే ప్రారంభించాలి: సీపీఎం



**జహీరాబాద్, జూలై 10 ప్రజాబలం ప్రతినిధి:** జహీరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బంది పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని సీపీఎం సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం నాయకులతో కలిసి ఆస్పత్రిని సందర్శించిన ఆయన, సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌ను కలిసి ఆస్పత్రి సమస్యలపై చర్చించారు.
అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ఏడాది క్రితమే నిర్మాణం పూర్తయిన ప్రసూతి, చిన్నారుల వార్డును ఇప్పటికీ ప్రారంభించకపోవడం బాధాకరమన్నారు. వెంటనే అందుబాటులోకి తీసుకువచ్చి ప్రజలకు సేవలు అందించాలని కోరారు. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి జోక్యం చేసుకుని ఆస్పత్రి సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. జహీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి రోజూ 500 మందికి పైగా రోగులు వస్తున్నారని, జనరల్ మెడిసిన్, గైనకాలజీ, పిల్లల వైద్యం, ఆర్థోపెడిక్ తదితర స్పెషాలిటీ వైద్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గైనకాలజిస్టు డిప్యుటేషన్‌కు వెళ్లడంతో గర్భిణులు, మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అవసరమైన మందులు, స్కానింగ్ సౌకర్యం కల్పించి, ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సీపీఎం ఏరియా కమిటీ సభ్యుడు ఎస్. మహిపాల్‌తో పాటు బక్కన్న, బాల్‌రాజ్, మల్లారెడ్డి, మహేశ్వర్, సంగమేశ్వర్, శ్రీకాంత్, రాజు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలియజేసిన ములుగు జిల్లా ఆత్మ చైర్మన్ చిటమట రఘు



**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జులై 10**ములుగు జిల్లా ఆత్మ చైర్మన్ చిటమట రఘు. మాట్లాడుతూ నాపై విశ్వాసం ఉంచి ములుగు జిల్లా ఆత్మ చైర్మన్ బాధ్యతలను అప్పగించిన గౌరవ మంత్రి శ్రీమతి దనసరి అనసూయ సీతక్క గారికి, ములుగు డీసీసీ అధ్యక్షులు పైడాకుల అశోక్ ములుగు జిల్లా గ్రంథాలయ చైర్మన్ భానోత్ రవిచందర్ , ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖ కళ్యాణి గారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు, ధన్యవాదాలు.
బినా నియామకానికి సహకరించి, నన్ను ప్రోత్సహించిన ములుగు జిల్లా మరియు ప్రత్యేకంగా ఏటూరునాగారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, కాంగ్రెస్ కుటుంబ సభ్యులందరికీ పేరుపేరునా నా హృదయపూర్వక ధన్యవాదాలు.
బిగురువారం :09.07.2026న ములుగు జిల్లా డీఎల్ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఆత్మ కమిటీ చైర్మన్ మరియు కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు.
బిఈ కార్యక్రమంలో పాల్గొని తమ ఆశీస్సులు అందించిన రాష్ట్ర, జిల్లా, మండల, బ్లాక్, గ్రామ స్థాయి నాయకులకు, వివిధ చైర్మన్‌లకు, సర్పంచ్‌లకు, అన్ని అనుబంధ సంఘాల నాయకులకు, ప్రజా ప్రతినిధులు,యువజన నాయకులకు, మహిళా నాయకులకు, కార్యకర్తలకు హృదయపూర్వక ధన్యవాదాలు
బినాపై ఉంచిన ఈ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తాను. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి రైతు వద్దకు చేరేలా పనిచేస్తూ, రైతుల అభ్యున్నతే నా లక్ష్యంగా ముందుకు సాగుతానని ఈ సందర్భంగా హామీ ఇస్తున్నాను
చైర్మన్ గా రైతులకు అందించే కార్యక్రమాలు
బిజిల్లాలోని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం..
బిరైతులకు ఉపయోగపడే శిక్షణలు, అవగాహన కార్యక్రమాలు, ప్రదర్శనలను ప్రోత్సహించడం.
బివ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక ఫిషరీస్,వెటర్నరీ తదితర శాఖలతో కలిసి పనిచేయడం.
రైతులకు అందుబాటులో ఉన్న పథకాల గురించి అవగాహన కల్పించి, అర్హులైన వారికి ప్రయోజనాలు అందేలా కృషి చేయడం
ఆత్మ కమిటీ సమావేశాల్లో పాల్గొని, రైతుల సంక్షేమానికి సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడం.
బివ్యవసాయంలో కొత్త సాంకేతికతలను ప్రోత్సహించడం. ఆధునిక సాగు పద్ధతులు, నూతన వ్యవసాయ సాంకేతికతలను రైతులకు పరిచయం చేయడం.
. రైతు సంఘాలతో కలిసి పనిచేస్తాం,రైతుల అభిప్రాయాలను సేకరించి, వాటి ఆధారంగా అభివృద్ధి కార్యక్రమాలను రూపొందించడం...
బి. నిధుల వినియోగంపై పర్యవేక్షణ రైతుల అభివృద్ధి కోసం కేటాయించిన నిధులు సక్రమంగా వినియోగించబడుతున్నాయో లేదో పర్యవేక్షించడం. బిరైతుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం మరియు రైతుల మధ్య వారధిగా పనిచేస్తూ, వ్యవసాయ అభివృద్ధికి కోసం పనిచేస్తాం అని అన్నారు.

## అడవి శాఖ వారిచే హెచ్చరిక బోర్డు జారీ




**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జులై 10**ములుగు జిల్లా లో అభయరణ్యంతో నిండి ఉన్న మండలాలు వాజేడు వెంకటాపురం మండలాలలో చుట్టువైపుల కొండలతో పచ్చడి చెట్ల మధ్య నుంచి జాలువారే జలపాతాలను చూడడానికి అన్ని ప్రాంతాల పర్యటకులు జలపాతాల వద్దకు చేరుకొని జలపాతాలను సహా కుటుంబంతో సంతోషంగా గడిపి మళ్లీ చూడదగిన ప్రదేశాలకు వెళ్లి తిరుగు ప్రయాణం చేస్తారు
కొంతమంది మిత్రులతో కలిసి జలపాతాలను చూడడానికి ఫారెస్ట్ అధికారులు రిజర్వ్ ఫారెస్ట్ లో ఉన్న జలపాతాలకు వెళ్లడానికి హెచ్చరిక బోర్డులు జారీచేసిన యువకులు వినకుండా అలాంటి ప్రాంతాలకు వెళ్లి మృత్యువాత పడుతున్నారు ఇప్పటికి సుమారు ముత్యాల ధార బొగత జలపాతం మాగలొద్ది జలపాతం గుండాల జలపాతం నిషేధంగా ఫారెస్ట్ అధికారులు హెచ్చరిక జలపాతాలుగా ప్రకటించారు
వర్షాకాలం కావడంతో వాజేడు వెంకటాపురం మండలాలలో గుట్టలపై నుంచి కిందికి జాలువారుతున్న నీరు పర్యాటకులకు కనువిందులు చేస్తున్నాయి దేనితో చాలా మంది ఆ ప్రాంతాలకు వెళ్లి జలపాతాలు చూడాలని ఆలోచనతో యువకులు మద్యం మత్తులో జలపాతాలలో మునిగిపోయి ప్రాణాలు పోగొట్టుకున్న పరిస్థితి కనబడుతుంది
ఫారెస్ట్ అధికారులు ప్రవేశపెట్టిన జలపాతాలు బొగత జలపాతం ఒకటి మాత్రం పర్యాటకులు చూడడానికి అనుమతినిచ్చారు
ఎవరైనా రిజర్వ్ ఫారెస్ట్‌శ్రీ లో ఉన్నా జలపాతాలకు వెళ్లి చూసేవారికి చట్టపరమైన శిక్షలకు గురికావాల్సి వస్తుందని హెచ్చరికలు జారీ చేశారు

## పేదవాని కడుపు నింపడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

సికింద్రాబాద్ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ క్యాంటీన్ల అల్పాహార కార్యక్రమాన్ని ఈరోజు రెజిమెంటల్ బజార్ లోని మదర్ థెరిసా విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ఈ క్యాంటీన్ లో ఎమ్మెల్యే శ్రీగణేష్ ప్రారంభించారు.
పేద, మధ్యతరగతి ప్రజలకు, కార్మికులకు 5 రూపాయలకే నాణ్యమైన, రుచికరమైన అల్పాహారాన్ని అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. మదర్ థెరిసా చూపిన సేవా మార్గంలో, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రేవంత్ రెడ్డి గారి ప్రభుత్వం ముందుకు సాగుతుంది.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com